# బుద్ధి పిలిచింది - మనసు పలికింది

"బాబుగారూ ! విధి అట్లా వక్రించినప్పుడు, నా జీవితం చుక్కాని లేని నావలా అయిపోగా నేనట్లా చెయ్యక తప్పలేదు" ఆమె కళ్ళూ ముక్కు కొంగుతో తుడుచుకొని, గాలికి రేగుతున్న తలవెంట్రుకలను రెండు చేతులతో సర్దుకున్నది. ఆమెను పరీక్షగా చూస్తే నలభై సంవత్సరాలు దాటిన మనిషిలాగే కనుపిస్తుంది. మనిషి దేహచ్ఛాయను బట్టి చూస్తే ఒకప్పుడు గోధుమవన్నె ఛాయలో ఉండేదనిపిస్తుంది. తీరైన ముక్కూ గడ్డమూ, విశాలనేత్రాలూ తీర్చిదిద్దినట్టున్న కనుబొమలూ చూడచక్కని దానిలాగే కనబడుతుంది.

ముకుందం ఆమెను పరిశీలనగా చూసి తలకు కట్టుకున్న మఫ్లరును సర్దుకుని కూర్చున్నాడు.

రైలు నడుస్తున్నది. కంపార్టుమెంటులో కూర్చున్న ప్రయాణీకులు చాలామంది అస్తవ్యస్తంగా నిద్రలోకి జారారు. కొందరు కిటికీ తలుపులు తెరచి బయటికి చూస్తున్నారు.

ఆమెకెదురుగా ఉన్న బల్లమీద- అదే మూలగా ఉన్న సీటు కావటం చేత బాగా ఆనుకుని సన్నటి ఉత్తరీయమొకటి కప్పుకుని ముడుచుకున్నట్టుగా కూర్చున్నాడు ముకుందం.

ఆమె మాటలు వింటూ అలాగా అన్నట్టుగా తలపంకించాడు ముకుందం.

"ప్రొద్దున్నే రేడియోపెట్టి పిల్లలను కాఫీ తాగటానికి రమ్మని పిలుస్తున్నాను. అంతలో" రాత్రి హైదరాబాదు నుండి విజయవాడకు

బయలుదేరిన రైలు బండి జనగామ దగ్గర వాగు పొంగినందువల్ల కొన్ని బోగీలు పట్టాలుతప్పి నీళ్ళల్లో పడిపోయాయి. ఇంజనుతో కూడా ఒక బోగీ ముందుకు వెళ్ళింది..." ఇంక వివరాలు వినే ఓపికలేక "ఒరే నాయనా! నాన్నగారు బయలుదేరిన రైలుకు ప్రమాదం జరిగింది" అంటూ ఒక కేక పెట్టాను. రేఖ ఇంకా పక్కమీద పడుకుని కళ్ళు నులుపుకుంటోంది. పెద్దవాడు కాంతి పళ్ళుతోముకుంటూ అలాగే వచ్చాడు. చిన్నవాడు హరి పక్కమీదినుంచి దిగ్గునలేచి ఒక్క అడుగులో నన్ను చేరుకుని ఏమిటేమిటని చేతులు పట్టుకుని ఊపేశాడు. విన్నదంతా ఇద్దరికీ ఒణుకుతూ చెప్పాను. ఏడుస్తూ రేఖ వచ్చింది"

"అప్పుడు మాకెవరు దిక్కు? ఏడుస్తూ" రమణమూర్తిగారిని అడిగిరండి ఆయనకేమయినా తెలుసునేమో?" నని వాళ్ళిద్దరినీ పంపాను వీళ్లు వెళ్లేటప్పటికి ఆయన కారులో కాంపౌండరునూ ఒక నర్సునూ తీసుకుని బయలుదేరుతున్నారట. వీళ్ళను కూడా కారులో ఎక్కించుకుని- ఆ ప్రమాదం జరిగిన చోటికి వెళ్ళారు."

"అదా? అది చాలా ఘోరమైన రైలు ప్రమాదము. అయితే వాగు చాలా చిన్నది. ఆ ప్రమాదం కోసమే అది పొంగింది. కాని అప్పుడే వాగు తీసిపోయిందని పేపర్లో వచ్చింది. చాలా జననష్టం జరిగింది కదూ?" అన్నాడు ముకుందం.

"జననష్టమూ జరిగింది. నాకొంప కూడా కూలిపోయిందండీ బాబూ! వెళ్ళిన పిల్లలు మరునాటికి గాని రాలేదు. ఈ లోపల నేనూ మా రేఖ చిత్తరువుల్లా గడపలో కూర్చున్నాము. వాళ్ళకోసం ఎదురుచూస్తూ మంచినీళ్ళయినా ముట్టకుండా, పిల్లలు బిక్కముఖాలతో వచ్చి జరిగిందంతా చెప్పారు. శవాలు నీళ్ళల్లో కొట్టుకుపోయి తుప్పలకూ చెట్లకూ పట్టుకుని ఆగిపోయాయట. ముఖాలు ఉబ్బి గుర్తుపట్టలేకుండా ఉన్నా

యట. ప్లాట్‌ఫారమ్ పొడుగునా శవాలను పడుకోబెట్టారట. ఒక్క శవానికయినా ఒంటిమీద బట్టలేదట. ఎలా గుర్తుపట్టటం? అవన్నీ పరిక్షగా చూసిన రమణమూర్తిగారు ఒకదాని దగ్గర ఆగి "మీనాన్నగారే అనుకుంటాను. ఏమోయ్ కాంతీ, బాగాచూడు." అన్నాడట. కాంతి బావురుమని ఏడ్చేశాడట, చిన్నవాడు హరి బాగా పరికించిచూసి కన్నీళ్లు కారుస్తూ "అవునేమో"నన్నాడట. ఆ రమణమూర్తిగారు శవాన్ని కారులో ఇంటికి తీసుకు వచ్చారు. ఇంక నాపరిస్థితి ఏం చెప్పను బాబుగారూ? ఇల్లంతా వెతికినా పట్టుమని పది రూపాయలు లేవు. చేతికి రెండు జతల గాజులు-మెడలో పుస్తెలతాడు. వేలికి పెళ్ళినాటి ప్రధానపు టుంగరము. బంధువులంతా కబురుపిని వచ్చారు. ఆ వస్తువులు మార్చి కర్మకాండ ముగింపచేసి వెళ్ళారు. నేను పోయిన మనిషికోసమే ఏడవనా? అప్పుడు మెట్రిక్ చదువుతున్న కాంతి - ఆ కింది క్లాసు చదువుతున్న హరి-మూడవఫారం చదువుతున్న రేఖ-వీళ్ళకోసమే ఏడవనా?" ఆమె మళ్ళీ కొంగుతో కళ్ళు ఒత్తుకుంది.

"సంసారం నిర్వహించేవాడు పోతే ఏడుపుగాక ఇంకేముంది? ప్రభుత్వం వారు కొంత డబ్బు ఇచ్చి ఉంటారు అవునా?" ముకుందం ఆమె చెప్పినదంతా సావధానంగా వింటున్నాడు.

మాణిక్యం కూర్చున్న బెంచీపైన బర్తుమీద ప్రయాణీకు డొకడు దుప్పటి కప్పుకుని పడుకున్నా నిద్రపట్టలేదు కాబోలు- వీళ్ళమాటలన్నీ అతడి చెవిన పడుతూనే ఉన్నాయి. ముకుందం కుతూహలంతో వినటాన్ని అతడు గమనించినట్టే ఉన్నాడు. దిగ్గున లేచి కూర్చుని" అయితే నేను చచ్చిపోయానన్నమాట!" నోట్లో గొణుక్కున్నాడు.

"మీరన్నట్టుగా ప్రభుత్వం చనిపోయినవాళ్ళ కుటుంబాలకు ఇచ్చింది బాబూ. నాకు వచ్చింది రెండువేల ఐదువందలు. మనిషి పోయా

రనగానే ఇవ్వవలసిన వాళ్ళు ఊరుకోరుగా ? వారి స్నేహితులు చేబదుళ్ళు తీసుకున్నారని వచ్చారు. ఇంటి అద్దె నాలుగు నెలలది ఇవ్వాలని యజమాని వచ్చాడు."

"సామాను తీసుకున్న దుకాణదారుడు రెండు నెలల నుంచీ బాకీ పెట్టారని వచ్చాడు. నిండా మునిగినవాడికి చలేమిటని అందరికీ ఇవ్వవలసింది ఇచ్చేశాను. తక్కువయింది వంటపాత్రలమ్మి ఇచ్చాను. చివరకు పిల్లలు కప్పుకునే బ్లాంకెట్లు కూడా అమ్మేశాను. ఇంకా నాకు దేవుఁడేమిటని దేవుడిమందిరమూ పూజసామగ్రి కూడా అమ్మి ఎనభై రూపాయలు చేతబట్టుకుని ఒకతల్లిని ఆశ్రయిద్దామని పిల్లలతో మూడు చిన్న సూటుకేసులతో బయలుదేరాను. ఆ తల్లి ఇల్లు బేగంపేటలో ఉన్నది. కొంతదూరం బస్సులో - కొంతదూరం నడచి-వాళ్ళయింటికి చేరుకునేసరికి సాయంకాలము ఆరుగంట లయింది. ఇంట్లో ఆ తల్లి లేదు. ఇంటినిండా దీపాలు వెలుగుతున్నాయి మరొకగంటలో యజమానురాలు వస్తుందని నౌకర్లు అన్నారు. వరండాలో కుర్చీలు ఉన్నాయి. కాని వాటిమీద కూర్చోబుద్ధి పుట్టలేదు. మెట్లదగ్గర గోడకానుకొని కూర్చున్నాము. పిల్లలు కునికిపాట్లు పడుతున్నారు. జరిగినదానికి మనసంతా కరడు కట్టుకుపోయింది. భవిష్యత్తు అగమ్యగోచరంగా ఉంది. అలా ఆమె కొరకు నిరీక్షిస్తూ- గేటు చప్పుడయినప్పుడల్లా ఆమె వస్తున్నదని ఆశపడి కళ్లు విప్పుకొని చూస్తూ నిమిషాలను గంటలుగా గడుపుతూ ఉండగా కారు వచ్చి మెట్ల దగ్గర ఆగింది.

ఆయింటి యజమానురాలు కారు దిగి "ఎవరూ ఇక్కడ కూర్చుంది?" అంటూ నాదగ్గరికి వచ్చింది. అప్పటికి నేను గజగజ వణకుతూ లేచి ముఖమ్మీద చేతులుంచుకుని నిలబడ్డాను.

"మాణిక్యం ? ఏమిటది ? ఇలా వచ్చావు పిల్లలతో ? ఏ ఊరయినా వెళ్ళుతున్నారా ?" నా చేతులు పట్టుకుంటూ అడిగింది ఆదుర్దాగా.

కాళ్లు చాపుకుని కూర్చుందామనుకున్న ముకుందం చివ్వున లేచి మళ్ళీ కూర్చున్నాడు. ముఖమ్మీద ఏ మాత్రం ఆదుర్దాగానీ కుతూహలాన్ని గానీ కనబడనీయకుండా "ఆమెను అంతకు పూర్వం మీరెరుగుదురా? ఎవరామె" మామూలుగా అడిగాడు.

పైబర్తు మీద ఉన్న ప్రయాణీకుడు తల వాళ్ళవైపుకు త్రిప్పుకొని కళ్ళు అరమోడ్పులా పెట్టుకుని వింటున్నాడు.

"ఆమె పేరు రాణి కామేశ్వరీదేవి. నాకు చాలా సంవత్సరాల నుండీ తెలుసు. నా బిడ్డల చదువులకూ బట్టలకూ తోచిన సహాయం చేస్తూ ఉండేది. ఆమెతో నా సంగతంతా చెప్పుకుని బావురుమని ఏడ్చేశాను".

"మాణిక్యం! ముందు పిల్లలూ నీవు భోజనం చేసి ఆగదిలో పడుకోండి. నేను రేపు మాట్లాడి నీ సంగతంతా సెటిల్ చేస్తాను" అన్నదామె.

"ఆహాఁ!" అన్నాడు ముకుందం.

ఆరాత్రి ఆందోళనతో మనసు ఊగిపోతున్నా నీళ్లల్లో కొట్టుకు పోయేవాడికి కొయ్య దొరికినట్టుగా ఆశ మళ్ళీ - ఈ కాలంలో ఎంతటి మహారాణులయినా రాజ్యాలూ, సంస్థానాలూ లేనివాళ్ళే కదా? వాళ్లే మానసికంగా క్రుంగిపోయి ఉంటారు. మనకేం సహాయం చేస్తారన్న నిరాశ. ఈ రెండిటి మధ్య- వెలుగు చీకట్లను చూస్తూ- అనుభవిస్తూ- భయంతో బిగుసుకుపోతూ తెల్లవార్లు జాగరణ చేశాను. పిల్లలు ఎంతటి దుఃఖాన్ని దైన్యాన్నీ కూడా నిద్రవల్ల పోగొట్టుకుంటారు. ముగ్గురూ పెట్టెలో నుంచి తీసి పరచిన పాతచీరెల మీద సూటుకేసులు తలక్రింద పెట్టుకుని హాయిగా పడుకున్నారు. ఐదుగంటలకే లేచి ముఖం కడుక్కుని గోడకానుకొని కూర్చున్నారు. ఎనిమిది తొమ్మిది గంటలకు కామేశ్వరీదేవి వచ్చి నన్ను తనగదిలోకి పిలిచి తన కుర్చీకెదురుగా ఉన్న కుర్చీలో కూర్చోమన్నది.

నాకేమని సలహా ఇస్తుందో? ఏం సహాయం చేస్తుందోనని దీనంగా ఆమె ముఖంలోకి చూశాను.

"మాణిక్యం! ముందు కాఫీ టిఫిన్ తీసుకుందాము- తరువాత మన సంప్రతింపులు-తీసుకో కాఫీ" కప్పు స్వయంగా చేతి కందించింది.

నాకు కడుపులో పేగు కదిలినట్లయింది. కప్పు చేత బట్టుకుని అలాగే చూస్తున్నాను.

"మాణిక్యం! నేనూ బిడ్డల తల్లినే. తల్లి మనసు నాకు తెలుసు. నీ పిల్లలు కాఫీ టిఫిన్ అవతల గదిలో తీసుకుంటున్నారు. ముందు కాఫీ తీసుకో. పిచ్చి మాణిక్యం! నీవెంతో ధైర్యం కలదానివనుకున్నా. ముఖాన్ని అద్దంలో చూసుకో. ఎన్నేళ్ళనుంచో అన్నం నీళ్ళు ఎరగని ముఖంలా ఉంది" తొందర పెట్టింది.

"నాకు కడుపులోకి ఏమీ ఎక్కటంలేదు. తింటేగాని ఆమె మాట్లాడదు. ఎట్లాగో అయిందనిపించాను."

కామేశ్వరీదేవికి కాఫీ టిఫిన్ తీసుకోగానే జరదాతో తమల పాకు బీడా వేసుకునే అలవాటు. నౌకరు తీసుకురాగానే తానొకటి తీసుకుంటూ "నీకు అలవాటుందిగా! ఒకటి తీసుకో" అంటూ పళ్ళెం అందించింది.

''నా కొద్దు తల్లీ!'' చేతులు జోడించాను ఆవేదనతో.

"చూడు మాణిక్యం! నీసంగతంతా రాత్రి ఒంటిగంట వరకూ ఆలోచించాను. ఎంతసేపు ఆలోచించినా నాకు ఒకటే పరిష్కారం తోచింది. నీ కిష్టమయితే అలా చెయ్యి. కాని నేను బలవంతం చేశానని అనుకోకు" అన్నది నా ముఖంలోకి చూస్తూ,

నా కేదో ఆశారేఖ పొడ చూపింది. "చెప్పండి- కామేశ్వరీదేవీ- అదేమిటో?" అన్నాను ఆదుర్దాతో.

"మాకు ఒకప్పుడు సంస్థానాలుండేవి. వల్లమాలిన ఆస్తి ఉండేది. ఒళ్ళు తెలియకుండా ఖర్చులు చేసుకున్నప్పటికీ బయటపడలేదు. కాని మా సంస్థానాలన్నీ ప్రభుత్వం తీసుకున్న తరువాత వారిచ్చే భరణాలతో మేము కూడా ఖర్చులన్నీ తగ్గించుకొని జాగ్రత్తగా మసలుకుంటున్నాము ఇప్పుడా భరణాలూ లేవు. నన్ను చూశావుగా! రాజా వారున్నప్పటికంటె చాలా ఖర్చులు తగ్గించాను. ఒక పెద్ద ఆఫీసరుకు పైభాగమంతా అద్దెకిచ్చాను. కుక్కల్ని తీసేశాను. నాకిప్పుడు ఒక ఆయా, ఒక వంటమనిషి. కొత్తకారు అమ్మేశాను. పాతకారు అట్టిపెట్టుకుని ఒక డ్రైవర్ని పెట్టుకున్నాను. కారుంది గదా అని ప్రతిరోజూ బయటికి వెళ్ళను. ఎందుకో తెలుసా పెట్రోలు ఖర్చని అయితే నా పరిస్థితులన్నీ ఏకరువుపెట్టి నీకు నేను ఏమీ సహాయం చేయలేనని అనుకుంటావేమో? భయపడకు నీకోసం ఒక పథకం ఆలోచించాను. మీ నలుగురినీ భరించి- నీబిడ్డలకు నేనొక్కదాన్నీ దారి చూపించలేను. బాగా విను. మీ కాంతినీ హరినీ బొంబాయిలో ఉన్న మా అక్కకు ఉత్తరం వ్రాసి ఆమె దగ్గరికి పంపిస్తాను. మా అక్క ఆదిలక్ష్మీ దేవి నామాట కాదనదు. నీ బిడ్డలకు చదువు చెప్పిస్తుంది. చదువులు కాగానే వాళ్ళే ఏదో ఉద్యోగం చూసుకుంటారు. మగపిల్లలు కదా. ఒకగది ఇవ్వమనీ చదువుకు సహాయం చేయమని వ్రాస్తాను. ఐదారేళ్ళు భరిస్తే వాళ్ళే ఒకదారికి వస్తారు. ఇకపోతే నీ కూతురు. నా చెల్లెలు సునందాదేవికి ఒక్కడే కొడుకు. ఆమె దగ్గరికి నీకూతుర్ని పంపుతాను మనిషినిచ్చి. ఒక ఉత్తరం కూడా వ్రాసి ఇస్తాననుకో. ఆమె ఒక పల్లెటూల్లో ఉంటుంది. గాని అక్కడే బస్తీ సౌకర్యాలన్నీ కల్పించుకున్నది. కొంత చదువేదో చెప్పిస్తుంది. ఎవరినన్నా చూసి పెళ్ళి చేస్తుంది. తనపిల్లలా చూసుకుంటుంది. పిల్లల దిగులేమీ నీకుండదు. నీవు నాకు మనసు కలిసిన మిత్రురాలివి. నీవు నాదగ్గరే ఉండు. నాకొక్కపిల్లవాడు. వాడు జగమొండి. కలకత్తాలో చదువుతున్నాడని తెలుసుగా? ఏడాదికొకసారి వచ్చి చూస్తాడునన్ను. రాజా

గారు పోయిన తరువాత వాడే నా ప్రపంచం, వాడే నా జీవిత సర్వస్వ మనుకున్నాను. కాని వాడు నన్నిట్లా ఏడిపిస్తున్నాడు. నాకు తోడుగా నా దగ్గరుండి మంచీ చెడూ చూస్తూ ఉండు. ఇదంతా నీకిష్టమయితేనే సుమా! అన్నది కామేశ్వరీదేవి.

నా బిడ్డలను గురించి నేను ఎన్నెన్నో కలలు కన్నాను. ఆయనది చిన్న ఉద్యోగమయినా - జీతం సగమయినా ఇంటికి తీసుకురాకపోయినా వాళ్ళ భవిష్యత్తును గురించి బంగారు మేడలు కట్టాను. కాని నా ఇప్పటి పరిస్థితి? ఆమె పూనుకోకపోతే ఈ పిల్లలగతి ఏంకాను? సహాయం చేస్తా మంటూ ఎవరు ముందుకు వస్తారు? కామేశ్వరీదేవి ఒక్కతే బాల్యస్నేహాన్ని మరిచిపోకుండా నా బిడ్డలకొకదారి చూపిస్తానంటున్నది. ఒప్పుకోక నేను చేసేదేమున్నది? అదిగాక మరొక మార్గమేది? కటిక చీకటిలో ఉన్న నాకు కాంతిపుంజంలా కనబడి చేతినందించింది.

"దిగ్గున లేచి ఆమె చేతులను అంది పుచ్చుకుని కళ్ళకద్దుకొని వెక్కి వెక్కి ఏడ్చాను. బాబుగారూ! అప్పుడు నా మనసు కొంత కుదుట పడ్డది. పిల్లలను ఒప్పించటానికి రెండురోజులు పట్టింది. మగపిల్లలు త్వరగా సమాధాన పడ్డారు. కాని రేఖ! నన్నొదిలి వెళ్ళనంటుంది. దానిని ఒప్పించటానికి కామేశ్వరీదేవి కూడా ప్రయత్నించింది. చివరకు పదిరోజు లకు దాని ప్రయాణం సాగింది" మాణిక్యం ఇంతవరకూ చెప్పి బరువుగా నిట్టూర్చింది.

ఎటో ఆలోచిస్తున్నా ముకుందం ఆమె చెప్పినదానిలో ప్రతి అక్షర మూ విని, ఆట్టాగా అన్నట్లు తలూపుతూ "ఇంకా చెప్పండి" అన్నట్టు కుతూహలంతో కళ్ళు వెడల్పు చేసుకుని ముఖం ముందుకు ఒంచి వింటు న్నాడు.

పైబర్తుమీద పడుకున్న ప్రయాణీకుడు ఆవేదనతో అటూ ఇటూ మసలుతూ ఇంకేం చెబుతుందోనని చెవులు దోరగిల పెట్టుకుని తన ముఖం కనబడకుండా చోటు చేసుకుని వింటున్నాడు.

"ఇంకేమమ్మా! పిల్లలు హాయిగా చదువుకుంటున్నారంటున్నావు! నీలెక్క ప్రకారం మగపిల్లల చదువు లయిపోయి ఉండాలి. వాళ్లకు తగిన ఉద్యోగాలలో ఈపాటికి చేరే ఉంటారు. అమ్మాయి కూడా బాగా చదువుకుని పెళ్ళి చేసుకున్నదో - చేసుకుంటుందో? అంతే కదూ? తల్లికి అంతకంటే కావలసిందేముంది? మీరు గతాన్ని మరచిపోయి పిల్లల భవిష్యత్తును చూసి సంతోషిస్తూ కాలం గడపాలి. ఏమంటారు?" అన్నాడు ముకుందం తనకూ మనసు తేలికయిందన్నట్టుగా ముఖం పెట్టి.

"నిజమే బాబుగారూ! మీరన్నట్టు ఇంతకాలమూ వాళ్ల భవిష్యత్తునే చూసుకుంటూ గతం మరిచి బ్రతుకుతున్నా. పెద్దవాడు చదువు పూర్తి చేసుకుని బొంబాయిలోనే ఏదో కంపెనీలో ఉద్యోగం చూసుకున్నాడు. చిన్నవాడు వ్యాపార దృష్టికలవాడు. వాడిచేత ఆదిలక్ష్మిదేవి ప్లాస్టిక్ సామాన్ల దుకాణం పెట్టించింది. బాగా నడుస్తున్నదని ఆమె ఉత్తరాలు వ్రాస్తున్నది. అమ్మాయి రేఖ బి. ఏ. ప్యాసయింది. సునందాదేవిగారు సంగీతం నాట్యం కూడా చెప్పించారట. పెళ్ళికి ఎదిగింది" కళ్ళల్లో తడి మెరుస్తుండగా మాణిక్యం చెప్పింది.

"ఇంకేం? సమస్యలన్నీ తీరినట్టే. నావ ఒడ్డుకు చేరుకున్నట్టే. పిల్లకు సునందాదేవిగారు ఎట్లాగయినా పెళ్ళిచేస్తారు. ఆదిలక్ష్మిదేవిగారు కూడా అంతో ఇంతో సహాయం చేస్తారు. ఇంకా మీ సమస్యలూ సందేహాలూ ఏమిటి?" అన్నాడు ముకుందం నవ్వు పెదవులమీదికి తెచ్చుకుంటూ.

"అయ్యో! బాబుగారూ! ఇప్పుడు నా మీదికి విరుచుకుపడ్డ సమస్య ఇదివరకూ ఉన్నటువంటిది కాదు. ఇది నాబిడ్డ జీవిత సమస్య. నాబిడ్డ

నిండు జీవితం మరో వారంలో ముగియ బోతున్నది. నాతల్లి కులానికి పేదకాదు. గుణానికి అంతకంటే కాదు. తిండికి పేదయై వారింట ఉండి-సునందాదేవి కనుసన్నలలో మెలగుతూ చదువుల సరస్వతి అయింది. సౌందర్యరాసిగా రూపొందింది. సునందాదేవి కురూపికెవరికో ఇచ్చి పెళ్ళి చేస్తుందనగా విన్నాను. ఆవిషయంలో ఆమె అక్కగార్లు చెప్పినా వినటం లేదు" మాణిక్యం ముఖంలో దుఃఖం కంటే నిస్సహాయత వ్యక్తమయింది.

"శ్రీమంతుల కెవరికో కోడలవుతుందన్నమాట! దానికింత విచారమా?" వెడదనవ్వొకటి నవ్వాడు ముకుందం.

"బాబుగారూ! ఐశ్వర్యమెవరికి కావాలి? పిల్లవాడు కురూపని విన్నాను. అతడికి నా కూతురునిచ్చి పెళ్ళిచేయాలన్న కక్ష ఆమెకెందుకు కలిగిందో?"

పైబర్తుమీద పడుకున్న ప్రయాణీకుడు ఆవేదనతో దిగ్గున లేచి కూర్చున్నాడు.

ముకుందం పైకి గంభీరంగా ఆమెతో మాట్లాడాడేగాని కడుపులో దేవినట్టుగా ఉంది.

అంతలో రైలాగింది.

"స్టేషను వచ్చింది కాబోలు" అన్నది మాణిక్యం.

"ఇది పెద్ద జంక్షనమ్మా. చాలా సేపాగుతుంది రైలు ఇక్కడ" ముకుందం ముఖం అదోలా పెట్టుకుని కూర్చున్నాడు.

ప్రయాణీకులంతా గబగబా రైలుదిగి కాఫీ టీలు సేవించి సిగరెట్లు కొనుక్కుని ప్లాట్‌ఫారమ్మీద ఇటూఅటూ తిరుగుతున్నారు. స్టేషనులో రెండుమూడు రైలుబండ్లకు బొగ్గూ నీళ్ళూ నింపటంలో రైల్వే ఉద్యోగులు నిమగ్నులై ఉన్నారు. మాణిక్యం ప్లాట్‌ఫారమ్మీద గరమ్ చాయ్ అని అరచిన వాడిదగ్గర రెండుకప్పుల టీ తాగింది.

"బాబుగారూ! ఇక్కడ దిగితే బస్సుకోసం రెండుగంటల సేపన్నా ఆ చెట్టు కింద నిరీక్షించాలి. రెండు స్టేషన్ల తరువాత వచ్చే స్టేషన్‌లో దిగితే వెంటనే బస్సుందుతుంది గాని ఇల్లు చేరుకునేసరికి పన్నెండు గంటలవుతుంది" ఆలోచిస్తున్నట్టుగా కళ్ళు మూసుకుంది.

"అయితే ఈపెళ్ళి ఆపు చేయటానికే వెళ్ళుతున్నారన్నమాట ?" అన్నాడు ముకుందం ఆమె నిశ్చయాన్ని తిరిగి జ్ఞప్తికి తెస్తూ.

"ఆపు చేయాలనే నా ప్రయత్నం బాబుగారూ! కాని ఆమె ఆపిల్ల మీద చేసిన ఖర్చంతా తిరిగి ఇవ్వమంటే ఏం చెయ్యను ? అయినా నాబిడ్డకు పెళ్ళికాదంటారా ? ఒకవేళ పేదరాలిని కనుక పెళ్లి చెయ్యలేనేమో ? కాక పోతేనేం ? నలుగురు పిల్లలకు చదువు చెప్పుకుని బ్రతుకుతుంది" ముక్కుపుటా లెగరవేస్తూ అన్నది మాణిక్యం. అననయితే అన్నది కాని ఇంతకాలం తన కూతురిని సంరక్షణ చేసి చదువు చెప్పించిన సునందాదేవి అంతటితో వదలిపెట్టదన్న భయం గుండెను మెలిపెట్టేస్తున్నది ఈ సమస్య సులభంగా పరిష్కారమయ్యేది కాదని మనసు నొక్కి చెబుతున్నది. తన ఉద్దేశ్యము బయటపెట్టిన మరుక్షణం రేఖను ఇంట్లో ఉండనిస్తుందా ? భయంకరమైన ఆలోచనలతో ఆమె దేహం జలదరించింది.

ముకుందం కప్పుకున్న దుప్పటిని మడత చేసిపెట్టుకుని కాళ్ళకు చెప్పులు తగిలించుకుంటూ రైలుపెట్టెదిగి వెళ్లాడు. కాఫీ టిఫిన్ తీసుకోవటానికి అవతలి ప్లాట్‌ఫారమ్ మీదికి వెళ్లి ఉంటాడని మాణిక్యం ఊహించింది. తన కడుపులో ఉన్నదంతా చెప్పకోవటంవల్ల మనసు కొంత తేలిక పడినప్పటికీ రానున్న ఆపద ఆమెను నిప్పుల సెగలోకి నెట్టుతున్నట్టుగా బాధపడుతోంది. తన మనసు స్థిరత్వాన్ని కోలుపోయినట్టుగా ఉంది. ఆలోచనలు ఒకచోట నిలిచి ఒక నిశ్చయానికి రాలేక పోతున్నాయి.

పైనున్న ప్రయాణీకుడు బర్తుక్రిందికి దిగి ప్లాట్‌ఫారమ్మీద అటూ ఇటూ పచారు చేయటం మొదలు పెట్టాడు.

కొంచెంసేపు తలగోక్కుంటూ కళ్ళు మూసుకుని ఆవలించిన మాణిక్యం ఏమనుకున్నదో - దుప్పటి మడత చేసుకుని సంచీలో పెట్టుకుని చెప్పులు వేసుకుని తలమీదుగా కొంగులాక్కుని, రైలుబండి దిగి పోయింది.

*　　　*　　　*

"అమ్మా రేఖమ్మ చెప్పు తెగిపోయిందట. స్కూలుకు ఎట్లా వెళ్లాలి అనుకుంటోంది" యాదమ్మ సునందాదేవి ముందర పాందాన్ పెడుతూ సన్నగా అంటున్నది.

సునందాదేవి ఉదయం ఎనిమిది గంటలకు కాఫీతోపాటు టిఫిన్ తీసుకోగానే వచ్చి హాల్లో కూర్చుంటుంది. ఇంట్లో ఉన్న దాసీ జనంలో ముఖ్యురాలు యాదమ్మ ఆమెకు పాందానూ పండు తమలపాకులూ తీసుకు వచ్చి ముందుపెట్టి, సన్నటి పుల్లతో సున్నంకాచు తమలపాకులకు రాసి, పచ్చిపోక చెక్కలను అడకత్తెరతో సన్నగా కత్తిరించి, ఎండుకొబ్బరి తురుమువేసి చిన్న పళ్లెంలో పెట్టి ఆమె ముందుంచుతుంది. ఆమె తమల పాకులను మడిచి బీడాగా చేసుకుని లవంగం గుచ్చి నోటబెట్టుకుంటుంది. యాదమ్మ అందించిన ఏలక్కాయ ఒకటి వొలిచి చిటికెడు జరదాతోపాటు నోట వేసుకుంటుంది తమలపాకు బీడాను జరదాతోపాటు నమిలితేగాని ఆమె దేనికీ సమాధాన మివ్వదు. ఎవరొచ్చినా పలకరించదు.

"ఆఁ! ఏమిటి యాదమ్మా? రేఖ ఇవాళ స్కూలుకు పోదా?" అన్నది. జరదా ఘాటుకు ముఖం ఎర్రబడి ముక్కుపుట లదురుతున్నాయి.

"తెగిన చెప్పు ముందరపెట్టుకుని కూర్చున్నదమ్మా" యాదమ్మ దూరంగా నిలబడి తలమీదుగా కొంగు సవరించుకుంటూ అన్నది.

"కూటికి లేకపోయినా అన్ని హంగులూ కావాలన్న మాట! అందరూ చెప్పులు వేసుకునే స్కూలుకు వెళ్లుతున్నారా? వెళ్ళకపోతే ఊరుకోమను. పాపం-లేనివాళ్లు కదా అని అక్క పంపితే సరే నన్నాను. కాని ఈ పిల్లకు ఇంత టెక్కా?" సోఫాకు ఆనుకుని కూర్చున్నది.

రేఖకు పధ్నాలుగేళ్ళు నడుస్తున్నాయి. తెలిసీ తెలియని వయసు. అమ్మ తనను ఎందుకు ఈమె దగ్గరికి పంపించిందో కొద్దిగా అర్థమయిందానాడు.

"రేఖా! చూడు తల్లీ! మన సంసారం ఈ విధంగా నాశనమయి పోయింది. మనం నలుగురం ఒకచోట ఉంటే గడిచే విధానం లేదు. అందుకే అన్నలను ఆదిలక్ష్మీదేవిగారి దగ్గరికి బొంబాయి పంపిస్తున్నాను. నీవు మెట్రిక్ పాసవగానే కామేశ్వరీదేవిగారి సహాయంతో పెళ్ళి చేస్తాను. నా తల్లివి కదూ? కష్టకాలంలో కళ్ళుమూసుకుని రోజులు గడపాలమ్మా!" తల నిమురుతూ బ్రతిమిలాడింది మాణిక్యం.

"నాకు పెళ్లొద్దు. ఉద్యోగం చేసుకుంటాను. మనిద్దరం ఉందాము ఒకచోట" మారాం చేసింది రేఖ.

"పోనీ, ఉద్యోగం చేద్దువు గానిలే. ముందు చదువుకో. చూడు తల్లీ. సునందాదేవిగారు చెప్పినట్టు విను. ఆమె ఏదయినా ఇస్తే తీసుకో. నాకిది కావాలని అడగకు. నీకు చదువు ముఖ్యం. బాగా చదువుకో. ఈ రాణుల ఇళ్ళల్లో దాసీజనం పెత్తనం చలాయించాలని చూస్తారు. జరిగేది ఒకటి-వాళ్ళు అమ్మగారికి చెప్పేదొకటి. వాళ్ళ మంతనాలకు లోబడకు. వాళ్లకు నీ విషయంలో ఎటువంటి అవకాశాన్ని ఇవ్వబోకమ్మా. సునందాదేవిగారు పైకి ఏదన్నా దురుసుగా అన్నా ఆమె హృదయం మంచిది. వెంటనే సర్దు

కుంటుంది. అక్కకు నిన్ను బాగా చూసుకుంటానని మాట ఇచ్చింది ఆ మాట తప్పదు. నీవు ధైర్యంగా ఉండు ఆమెకు చెప్పి నాకు ఉత్తరాలు వ్రాస్తూ ఉండు మాటిమాటికీ నన్ను చూడాలని ప్రయాణం కాకు. ఆమె పంపితేరా. లేకపోతే నేను కామేశ్వరీదేవిగారి నడిగి చూసిపోతూ ఉంటాను సరేనా? నాతల్లి పరిస్థితులను అర్థం చేసుకుంటుంది" చుబుకం పట్టుకుని ముఖం పైకెత్తి ముద్దుపెట్టుకున్నది ఫాలభాగమ్మీద.

రేఖకు ఇంకా కొంత అర్థమయ్యింది. నాన్నలేడు. అమ్మ బాధ పడుతోంది. ఆమె కన్నీళ్లు కారిస్తే తనకూ ఏడుపు వస్తుంది. తన కన్నీళ్లు అమ్మ చూడకుండా తలవంచుకుని రెండు పరికిణీలు రెండు జాకెట్లు రెండు ఓణీలు పెట్టుకున్న సంచీతో బయలుదేరింది. మాణిక్యం స్వయంగా వెళ్లి సునందాదేవికి ఒప్పగించింది కన్నీళ్ళతో.

"ఉంచి వెళ్ళండి. మాదేవిడీలో ఎందరు లేరు? అందులో ఈపిల్ల ఒకతె. మీరు ఉత్తరాలూ అవీ రాయకండి. రాస్తే పిల్లకు తల్లిని చూడా లన్న ఆరాటమెక్కువవుతుంది. ఎప్పుడయినా నేనే పంపిస్తాను లెండి" అన్నది సునందాదేవి. మనసులో అంత ఇష్టం లేనట్టుగా మాణిక్యం కని పెట్టినా చేసేది లేక కళ్ళనీళ్ళు కళ్ళల్లోనే ఇంకింపచేసుకుని, యాదమ్మ రెండు చేతులూ పట్టుకుని "నీ బిడ్డలా చూసుకో అంతా నీదేభారము. ఇంకా పిల్ల పెద్దదయినా కాలేదు. నాఖర్మమిలా కాలింది" అంటూ వాపోయింది.

తల్లి వెళ్ళిన రెండు రోజుల వరకూ రేఖకు మాట్లాడితే కన్నీళ్ళు దూకేవి. యాదమ్మ నంటిపెట్టుకుని తిరిగేది. మూడోవాడు ఆ ఊరిలో ఉన్న స్కూల్లో యాదమ్మచేత సునందా చేర్పించింది.

దేవిడీకి వెనుకగా నౌకర్లకు వరసగా గదులున్నాయి. దేవిడీలో పనులు కాగానే నౌకర్లంతా ఎవరి గదుల్లోకి వారు చేరుకుంటారు. దేవిడీ నుంచి తెచ్చుకున్న భోజనాలు ఆ గదుల్లో చేస్తారు యాదమ్మ గదిలో రేఖ

ఉండటానికి సునందాదేవి ఏర్పాటు చేసింది. రేఖ తన బట్టలు స్నానం చెయ్యగానే గది ముందర కట్టిన తాడుమీద ఉదికి ఎండవేసుకోవటం, అన్నం తిన్న పళ్ళెం గ్లాసు కడిగి బోర్లించుకోవటమూ, స్కూలునుంచి రాగానే యాదమ్మ తన కోసమని ఉంచినదేవో తిని చదువుకోవటమూ తప్ప ఎవరితోనూ మాటాపలుకూ లేకుండా మౌనంగా ఉంటోంది. స్కూల్లో కూడా ఇంకా స్నేహితు లేర్పడలేదు.

స్కూల్లో దయమంతి, కామాక్షీ తన క్లాసుపిల్లలే. అయినా కొన్ని రోజులు రేఖను ఎగాదిగా చూడటం మొదలుపెట్టారు. పది రోజుల తరువాత "ఏ ఊరినుంచి వచ్చావు?" అని అడిగారు.

ముక్తసరిగా జవాబిచ్చింది రేఖ.

"ఈ ఊళ్లో చదువుకోవటానికి హైదరాబాదునుంచి వచ్చావా? ఇది చాలా గొప్ప స్కూలని ఎవరయినా చెప్పారా?" పగలబడి నవ్వారు.

ఏడుస్తూ క్లాసులోకి వెళ్ళి కూర్చుంది రేఖ.

ఒకనెల తనలో తానే పాఠాలు చదువుకుంటూ ఒకరి జోలి లేకుండా గడిపేసింది రేఖ. తల్లిమీద అన్నలమీద బెంగ క్రుంగదీస్తోంది. ఒక ప్రక్క స్కూల్లో ఒక్కరయినా తనతోటివాళ్ళు స్నేహంగా ఉంటే బాగుండునని మనసు ఆగాట పడుతోంది. కాని తనంతట తాను ఎవరినీ కలుపుకొని మాట్లాడదలచుకోలేదు.

ఒకనాడు కామాక్షి రేఖ భుజమ్మీద చేత్తో తడుముతూ "రేఖా! నీ దస్తూరి చాలా బాగుంటుందోయ్. నీ ఇంగ్లీషు కూడా చాలా పైస్థాయిలో ఉందని టీచరు అన్నది" రేఖ ముఖంలోకి చూసింది.

కామాక్షి పలకరించినందుకు కాదుగాని ఆమె మాటలలో తన కాన్వెంటు స్కూలు చదువు జ్ఞాపకం వచ్చింది రేఖకు. తనను మదర్

ఎప్పుడూ మెచ్చుకునేది. తను క్లాసులో ప్రోక్టర్, ఎన్నో వార్షిక బహుమతులు తెచ్చుకునేది. మదర్‌కూ టీచర్లకూ వాళ్ళు చెప్పిన పనులు చేస్తూ వాళ్ళకెంతో సహకారిగా ఉండేది. కన్నీళ్లు తుడుచుకుంటూ ముందుకు సాగిపోయింది రేఖ.

దమయంతికి కూడా అనుకోకుండా రేఖ సహాయం కావలసి వచ్చింది. క్లాసులో చెప్పిన లెక్కలు అర్థం కాలేదు. కామాక్షికి కూడా వాటిని చేయటం చేతకాలేదు. ఇద్దరూ కూడబలుక్కుని రేఖను బ్రతిమిలాడారు. ఆ మధ్యాహ్నం ఇంటర్‌వల్లో ఆమెకు తమ ఇళ్ళ దగ్గర్నుంచి తెచ్చుకున్న టిఫిన్లు పెట్టారు.

రేఖ పక్కున నవ్వింది.

"ఎందుకు నవ్వుతావు?" ఇద్దరూ తెల్లబోయారు.

"మీరిద్దరూ నా కంటె బాగా మార్కులు తెచ్చుకునే వాళ్లు కదూ? ఈ లెక్కలు నేను చెబితే తప్పిపోతారని నాభయం. మీరంతగా కావాలంటే చెబుతాను. అందుకేనా మీరిద్దరూ నాకు టిఫిన్ పెట్టింది?" పెదవులు ముడిచింది రేఖ.

ఇద్దరూ కాదు కాదన్నారు. తమకు తెలియనివి రేఖ దగ్గర నేర్చుకుంటామన్నారు. టీచరే చెప్పిందట- రేఖ నడగండి ఏదయినా తెలియకపోతే" అంటూ.

రేఖ మనసు మెత్తబడింది. "నన్నింతగా బ్రతిమిలాడటమెందుకు? సరిగ్గా అడిగితే చెప్పేదాన్నిగా?" అంది.

"రేఖా! అది కాదోయ్. నిన్ను చూడగానే మాకెట్లాగో అనిపించింది. నీ మెడ బోసిది. నీ చెవుల కేమీలేవు. చేతులకు రెండు మట్టిగాజులు. నీవు కట్టుకునే బట్టలా వెలిసిపోయినవి. నీ తల వెంట్రుకలకు సరిగా

నూనె అయినాలేదు. నీ ముఖానికి పౌడరుస్నోలలాంటి పూతలు లేవు. కాని నీవు క్లాసులో కల్లా ఒక జ్యోతిలా వెలిగిపోతున్నావు. మన టీచరు కంటె అనర్గళంగా ఇంగ్లీషు హిందీ మాట్లాడేస్తున్నావు. అందుకని-ఉన్న మాట చెప్పద్దూ? మాకెట్లాగో అనిపించింది. మేమిద్దరం మా నైలాను డ్రెస్సులూ మా అలంకారాలూ - మా తీవీ నీ దగ్గర లేకపోతే నీ వెవర్తి పిల్లవో - ఏ పనిమనిషి కూతురివో అనుకున్నాము. అవన్నీ మర్చిపో రేఖా! ఇవాల్టి నుంచీ నీవు మా అక్కవు. మా స్నేహితురాలివి. ఒప్పుకోవూ?'' దమయంతి రేఖ రెండు చేతులూ పట్టుకుంది.

వాళ్ళ చేష్టలకు మొదట బాధపడినా స్నేహానికి తల ఒగ్గింది రేఖ. నవ్వు ముఖాలతో భుజాలమీద చేతులు వేసుకుని క్లాసు రూములోకి నడిచారు. టీచరు రాకముందు తెలియని లెక్కలు చూసుకున్నారు. ముగ్గురూ ఒక వరసలో కూర్చున్నారు.

ఆనాడు రేఖ ముఖం విప్పారింది. అప్పటినుంచీ తల్లినీ అన్నలనూ అంతగా తలుచుకొని ఏడవటం మానేసింది. బెంగ కొంత వరకూ తీరినట్లనిపించింది.

"చెప్పు తెగిపోయిందా రేఖా! ఈడుస్తూ నడుస్తున్నావు?" దమయంతి అడిగింది.

ఔనని తలూపింది రేఖ.

దమయంతికి చెప్పు తెగితే ఏంచెయ్యాలో తెలియదు. తండ్రి ఎప్పుడు హైదరాబాదు వెళ్లినా అయిదారు జతలు తెచ్చి ఇస్తాడు. కామాక్షికి అంతే. వాళ్ల చీరెలు జాకెట్లు చెప్పులు అన్నీ హైదరాబాదు నుంచే వస్తాయి. వాళ్లా ఊరిలో ఏమీ కొనుక్కోరు. అసలు మంచి షాపులు కూడా ఉండవు.

"నా దగ్గర ఒక కొత్త చెప్పుల జత ఉంది. రేపు తెచ్చి ఇస్తాను" అన్నది దమయంతి.

"నా దగ్గరా ఉంది. మా నాన్న ఈసారి మా అక్కకని తెచ్చిన జత ఆమెకు నచ్చకపోతే నాకే ఇచ్చాడు. ఒక జత తీసుకో రేఖా !" అన్నది కామాక్షి.

రేఖ అదోకమాదిరిగా నవ్వింది. "మీకు ఉన్నాయనీ, ఉంటాయనీ నాకు తెలుసు. నాకు లేదనీ తెలుసు. అంత మాత్రంచేత మీదగ్గర తీసుకుంటాననుకున్నారా ? తీసుకోను. చెప్పు లేకపోతే చదువుకు భంగమా చెప్పండి ? చెప్పులు లేకపోతే గబగబా నడుస్తాను" అంది అదోకమాదిరిగా వాళ్ళ వంక చూస్తూ.

"కాళ్ళు కాలవూ ? కాళ్ళకు మట్టి అంటదూ ?" కామాక్షి వింతగా చూసింది.

"రేఖా ! నీవు హైదరాబాదు నుంచి వచ్చానంటున్నావు ? అక్కడి మాదిరిగా ఇక్కడ తారు రోడ్లు లేవు. అంతా బురద బురద" దమయంతి ఆ ఊరి రోడ్లను ముక్కు విరుస్తూ వర్ణించింది.

"బురద ఉంటే ఉంటుంది. క్లాసులోకి వెళ్లేటప్పుడు కాళ్ళు కడుక్కొని వెళతాను" తేలిగ్గా అనేసింది రేఖ.

రేఖను బలవంతం చేసి ఏపనీ చేయించలేమని వాళ్లిద్దరూ తెలుసుకున్నారు. అప్పటి నుంచీ ఆమె పట్ల స్నేహమే కాకుండా గౌరవం కూడా పెరిగింది వాళ్ళిద్దరికీ.

ఇంటికి రాగానే యాదమ్మ ఇచ్చిన రొట్టె తిని గ్లాసెడు నీళ్లు తాగి పుస్తకాలు ముందర వేసుకుని కూర్చున్నది రేఖ.

"నీ చెప్పు తెగిందని దొరసానితో చెప్పినాను రేఖమ్మా. ఆమె విని ఊరుకున్నది. స్కూలుకు వట్టికాళ్ళతోనే వెళ్లావా?" యాదమ్మ తల వెంట్రుకలు దువ్వుకుని ముడివేసుకుంటూ అడిగింది.

"ఎందుకు చెప్పావు యాదమ్మా ? వట్టి కాళ్ళతో స్కూలుకు వెళ్లితే తప్పా ?" పుస్తకంలో పేజీలు తిరగవేస్తూ తలెత్తి చూసింది రేఖ.

రేఖ మాటల్లో ఇప్పుడు స్పష్టంగా కనబడుతున్న ధైర్యాన్ని గమనించింది యాదమ్మ. తెల్లబోయి చూసింది. మొదట్లో రేఖకు ఒక్కతే పడుకోవటానికి భయంగా ఉండేది. ప్రొద్దు గూకితే గజగజలాడుతూ ఒక మూలకు ఒదిగి ఒదిగి కూర్చునేది. యాదమ్మ భోజనం చేసి తమలపాకు వేసుకుని బయటికి బయలుదేరేది. నౌకర్లందరూ ఒకచెట్టు క్రింద ఉన్న బండమీదికి చేరేవారు. అక్కడ కబుర్లూ, హాస్యాలూ, నవ్వులూ, సరదాలూ శృంగారాలూ నడుస్తూ ఉండేవి. యాదమ్మ గదిలోకి వచ్చేసరికి పదకొండయినా అయేది. అంతవరకూ ప్రాణాలు బిగబట్టుకుని కూర్చున్న రేఖ ఆమెను చూడగానే పక్కపరచుకొని పడుకునేది. యాదమ్మ పడుకోగానే ఆమె చెయ్యి గట్టిగా పట్టుకుని నిద్రపోయేది. యాదమ్మ ఎప్పుడోగాని లేచేది కాదు. లేచిననాడు "పడుకో బిడ్డా! కల వచ్చిందా ? అమ్మ కలలో కనబడ్డదా ?" అంటూ వీపుమీద చెయ్యి వేసేది.

ఆచెయ్యి ఆసరాతో కొండంత ధైర్యం తెచ్చుకుని నిద్రలోకి జారుకునేది రేఖ.

* * *

సంస్థానాన్ని ప్రభుత్వం తీసుకున్నప్పటికీ సునందాదేవి భర్తకు డబ్బు చాలా కలిసి వచ్చింది. గుర్రపు పందేలలో అతడెప్పుడూ డబ్బు పోగొట్టుకోలేదు. కాగా దానిలో లాభాలు బాగా వస్తూ ఉండేవి. అతడి పెత్తల్లి లక్షలకు అధికారిణి. నడివయసులో పెనిమిటి చనిపోతూ అంతా భార్య చేతిలో పెట్టాడు. ఆమె దత్తత చేసుకోవాలనుకున్నది. కాని పోటీలు పడుతూ వచ్చిన దాయాదులమీద ఆమెకు మంచి అభిప్రాయం కలగలేదు. తన చెల్లెలి కొడుకు గోపాలకృష్ణరాయడి మీద మనసు ఉంది. కాని, చెల్లె

లికి ఒక్కడే కొడుకు. మరిది కృష్ణమరాజుకు ఆ ఊరిలో చాలా సంతాన మున్నది. కాని- భార్యకు మాత్రము ఒక్కడే కొడుకు. గోపాలకృష్ణ రాయడి తండ్రి ఎప్పుడూ బయటనే తిరుగుతూ ఉండేవాడు ఎప్పుడూ ఆయన చుట్టూ వందిమాగధులవంటి స్నేహితులు, పాటకచేరీలు, నాట్యాలు- వాళ్ల లోనే కాలక్షేపంగా ఉండేది. ఆయన ఈ దుర్వ్యసనాలతో రోగపీడితుడై మంచానబడి రెండు సంవత్సరాలు తీసుకుని మరణించాడు. గోపాలకృష్ణ రాయడి పెత్తల్లి నరసాయమ్మ తనయావదాస్తినీ తన చెల్లెలి కుమారుడికి ఇచ్చి అతడి చేతులమీదుగా దాటిపోయింది.

ధనం చూడగానే ఎవరికయినా వెర్రెత్తుతుంది. గోపాలకృష్ణరాయడి భవంతికి అక్కడ దేవిడీ అని పేరు. విశాలమయిన వరండాలు - పెద్దపెద్ద చావడులు - నిలువుటద్దాలతో పడక గదులూ - పెద్ద భోజనశాల - ఆధునిక సౌకర్యాలు - డబ్బుతో సమకూర్చబడేవన్నీ అమరి ఉన్నాయి. క్రింద భాగమెంత ఉన్నదో మేడపైన అంత ఉన్నది. కాగా - మేడమీద ఒక డాన్సింగ్ హాలు అద్దాలు అమర్చబడిన గోడలతో విశాలంగా ఉన్నది. దానిలో విద్యుద్దీపాల అమరిక చాలా విచిత్రంగా ఉంటుంది. అది గోడల కమర్చిన అద్దాలలో ప్రతిబింబించి వింత వెలుగులను ప్రసరింప చేస్తూ ఉంటుంది. డ్యాన్సుల తరువాత విందు, పార్టీకి తగిన పెద్ద హాలొకటి ఉంది. ఏభయిమంది సునాయాసంగా బల్లముందర కూర్చుని విందారగించే బల్లలూ కుర్చీలూ ఉన్నాయి. ఆ ప్రదేశాలన్నీ అపురూపమయిన ఖరీదు గల తైలవర్ణ చిత్రాలతో గోడలకు అలంకరింపబడి ఉన్నాయి.

గోపాలకృష్ణరాయడు సాయంత్రం కాగానే మేడమీద మిత్రులతో సమావేశమవుతాడు. అక్కడ పాట కచేరీ - వేశ్యల నృత్యాలు - మధు పానీయాలు - బిర్యానీతో విందులు - గలగల్లాడుతూ ఉంటుంది మేడపై భాగమ.

క్రింది భాగములో సునందాదేవి ఒక్కతే ఉంటుంది. స్నానం కాగానే గంజిపెట్టిన వెంకటగిరి జరీ అంచుల చీరెకట్టుకుని - తలనిండా పూలు పెట్టుకుని తమలపాకు జరదా బీడా ఘుమాయింపుతో హాల్లో ఉన్న సోఫాలో కూర్చుని పైన జరుగుతున్న సందడినంతా వినటమేగాని కంటితో చూడలేదు. ఆమె ఉత్సాహమంతా నీరుగారి పోతుంది. ఉస్సురంటూ అటూ ఇటూ తిరుగుతుంది. వేడి నిట్టూర్పులు విడుస్తుంది.

గోపాలకృష్ణరాయడి స్నేహితులలో భుజంగం అందరితో నవ్వుతూ తుళ్లుతూ కబుర్లు చెబుతూ ఉంటాడు. అతడు అందగాడే కాని - మెల్లకన్ను కనబడకుండా రంగుటద్దాలు ధరించిపైన ఉన్నట్లే ఉండి, కిందికి దిగివచ్చి "మంచి తమలపాకు బీడా అమ్మగారి నడిగి తీసుకురా" అని నౌకర్ని పిలుస్తూ ఉంటాడు. సునందాదేవి దగ్గర ఆంతరంగికంగా మసలుకునే నౌకరు పేరు ముత్తి. అది వృద్ధురాలయినా - ముఖం ముడతలు పడినా రసికురాలు. ఎవరిని ఎలా పలకరించాలో - ఎవరికి ఎలా మర్యాదలు చేయాలో - ఎవరిలో ఎటువంటి బలహీనతలు ఉన్నాయో క్షణాలమీద గ్రహించగల చతుర. మాటలో గడసరి. ముత్తి భుజంగం ముఖం చూడ గానే సంగతి పసికట్టింది. అతడు వచ్చిన వెంటనే పైకి వెళ్తాడు. వెళ్ళిన తరువాత నాలుగు సార్లయినా క్రిందికి వస్తాడు. ముత్తితో కబుర్లకు దిగు తాడు. చూపులతో ఇల్లంతా కలయ తిరుగుతాడు.

భుజంగం దేవిడీలోకి రావటం మొదలు పెట్టిన నాలుగయిదు నెల లకు సునందాదేవి దర్శనం లభించింది. తమలపాకుల బీడాతో ఆరంభ మయిన పరిచయము పరాచికాలకు వారం తిరక్కముందే దిగింది. సునందా దేవికి ఇప్పుడు మేడపైన జరుగుతున్న కార్యకలాపాలను వినటానికి తీరిక లేకుండా పోయింది. ఆమె మనసులో పేరుకుపోయిన చీకటి పటాపంచ లయింది. వెలుగు రేఖలు పొడచూపాయి. ఎండిపోయిన ఆశలు మోసులెత్తు

తున్నాయి. ఆమె ఎదలో చికాకులూ చింతలూ లేవు. ఉల్లాసం-ఉత్సాహం ఉబికి ఉబికి పైకి వస్తున్నాయి.

ఆనాడు మేడమీద పార్టీ జోరుగా జరుగుతున్నది. ప్రఖ్యాత నర్తకిని బొంబాయి నుంచి పిలిపించారు. మిత్రులంతా పైన చేరారు. మధ్య మధ్య పానీయాలు అందిస్తున్నారు సేవకులు. పళ్లేలతో మల్లెలు పైకి తీసుకు వెళ్ళి వెదజల్లుతున్నారు నౌకర్లు. విందు వంటకాలు తయారవుతున్నాయి. కోళ్లూ మేకలూ తెగుతున్నాయి. దేవిడీలో క్రిందా పైనా ఊపిరి సలపకుండా నౌకర్లు సందడిగా తిరుగుతున్నారు.

హఠాత్తుగా ముత్తి పెట్టిన పెద్దకేక క్రిందికీ పైకీ తిరుగుతున్న సేవక బృందాన్ని నిలవబెట్టింది. అందరూ ఏమిటేమిటని ప్రశ్నించారు.

"నర్సిమ్మును పిలవండి" ఆదుర్దాతో ఆజ్ఞాపించింది ముత్తి. ముత్తి సునందాదేవి ఆంతరంగిక సేవకురాలే కాదు- నౌకర్లమీద పెత్తనం కూడా ఆమెదే. అందరూ హడలిపోతూ ఉంటారు ఆమెను చూడగానే.

పైనుంచి నర్సిమ్ము ఆదరాబాదరాగా మెట్లుదిగి వచ్చి ముత్తి ముందర నిలబడ్డాడు చేతులు కట్టుకుని.

"దొరతో చెప్పు- దొరసాని తెలివి తప్పి పడిపోయిందని" చెప్పి లోపలికి వెళ్ళిపోయింది ముత్తి.

మంచి పట్టులో ఉన్నది డాన్సు. నర్తకి దోసెళ్లతో మల్లెలు అందరిమీదా విసురుతూ, కవ్విస్తూ పాట పాడుతున్నది. ఆమె నాట్యం ప్రేక్షకుల హృదయాలమీద చేసినట్టుగా ఉంది. వహ్వావహ్వా అంటున్నారు ప్రేక్షకులు ఉద్రేకంతో. కొందరు లేచి ఆమె చెయ్యి పట్టుకోబోతున్నారు. నౌకర్లు అందరికీ పానీయాలు అందిస్తున్నారు.

నర్సిమ్ము చెప్పగానే గోపాలకృష్ణరాయడు క్రిందికి దిగి వచ్చాడు. మెల్లగా గదిలో అడుగుపెట్టాడు. పందిరి పట్టె మంచం పైన అస్తవ్యస్తంగా

పడుకుని ఉంది సునందాదేవి ఆమె తలలోని మల్లెలతోపాటు ముఖం కూడా వాడిపోయి ఉన్నది. ముఖమంతా చెమట బిందువులతో నీరు చిలకరించినట్టుగా ఉంది.

వెంటనే డాక్టర్ని పిలుచుకురమ్మని మనిషిని పంపి కుర్చీ మంచానికి దగ్గరగా లాక్కుని కూర్చున్నాడు గోపాలకృష్ణరాయడు. ఆమెను చూడగానే అతడికి జాలి కలిగింది తనకు తరగని కాలక్షేపం ఉంది. లేకపోతే సృష్టించుకుంటాడు. కాని - ఆమెకు కాలక్షేపం లేదు. సంతానం కలిగితే ఆమెకెంతో నిండుగా ఉండేది. అది లేదు. సంతానం కోసం తనను యాత్రలకు రమ్మని పీడించేది. వ్రతాలు చేయమనేది. తనను ప్రతిమిలాడేది. అలిగేది. కోపగించేది. పాపం! ప్రాణం విసిగి పోయినట్టుంది. ఇప్పుడు తననేమో అడగటంలేదు. చాలా ముభావంగా ఉంటోంది. బహుశః మనోవ్యాధి కలిగిందేమో సంతానం కోసం! అంతగా కావాలంటే పెంచుకొమ్మని కూడా సలహా ఇచ్చాడు, ఇప్పించాడు. ఆమె కది నచ్చలేదు. తన కడపున పుట్టాలంటుంది. స్త్రీలకు మాతృత్వం అంటే ఎంత కాంక్ష? అతడి మనసంతా జాలితో నిండిపోయింది. ఆమె తల నిమురుతూ కూర్చున్నాడు.

డాక్టరు వచ్చాడు. ఆమెను పరీక్షచేశాడు. మనిషి బలహీనంగా ఉంది గాని - మరేమీ జబ్బు కనబడటంలేదు. వెంటనే తన హాస్పిటల్లో ఉన్న నర్సును పిలిపించి పరీక్ష చేయించాడు. సునందాదేవికి వేడివేడి హార్లిక్సు తెప్పించి ముత్తిని తాగించమన్నాడు. ఆమె తాగిన వెంటనే మత్తుగా పడకమీద వాలిపోయింది.

గోపాలకృష్ణ రాయడికి అదేమిటో అర్థము కాలేదు. డాక్టరుతో బయట హాలులో ఉన్న సోఫాలో కూర్చుని సిగరెట్టొకటి వెలిగించి "ఏమిటి జబ్బు? ఏమయినా ఫిట్సు బాబతా? ఎంత డబ్బయినా ఖర్చు

చేయండి. ఇంజక్షనులూ మందులూ వాడండి. ఆమె ఎప్పటి మాదిరిగా ఇంట్లో లక్ష్మిలా తిరిగేటట్టు చూడండి" అన్నాడు ఆవేదనతో.

డాక్టరు కళ్ళల్లో మెరుపు తళుక్కుమన్నది. ముసిముసి నవ్వులతో "దొరవారూ! మీరు అదృష్టవంతులు. ఈ దేవిడీలో ఒక పాప కొద్ది కాలంలో నడయాడబోతున్నది. మీరు తండ్రికాబోతున్నారు. ఈ దేవిడీకి ఒక కొత్త వెలుగు" అన్నాడు.

"ఆఁ!" నోరు తెరిచాడు గోపాలకృష్ణరాయడు. అది ఆశ్చర్యమో సంభ్రమమో తెలియని సేవకులు డాక్టరికి మధుర పదార్థాలతో నిండిన పళ్ళెము తెచ్చి ముందర పెట్టారు గోపాలకృష్ణరాయడు ఆశ్చర్యములో నుంచి తేరుకునే లోపల డాక్టరు సెలవు తీసుకున్నాడు.

గోపాలకృష్ణరాయడు అలాగే కూర్చున్నాడు. పై నుంచి ఎన్నో కబుర్లు వచ్చాయి రమ్మని. నాట్యం పూర్తయిందని నర్తకి కబురుపెట్టింది. అతడు కదలలేదు. విందుకు వేళయింది. ఆయన అలాగే కూర్చున్నాడు. చూసి చూసి అందరూ మెల్లిగా జారుకున్నారు. వంటకాలు చల్లారి పోయాయి. సేవకులు ఎక్కడి వాళ్ళక్కడ నిద్ర కొరిగారు.

గోపాలకృష్ణరాయడు చలనం లేకుండా అలాగే కూర్చున్నాడు. తనకు సంతానం కలగబోతున్నదంటే అతడికి ఆశ్చర్యంగా ఉంది. అయోమయంగా ఉంది. అర్థం కాకుండా ఉంది.

ఇది ఎలా సాధ్యం?

తానెంతమంది డాక్టర్లను సంప్రతించాడు!?

సునందాదేవి యాత్రలకు రమ్మంటే లాభమేమీ ఉండదని ఆమెను నిరుత్సాహపరచాడు?

"మీరు తండ్రి కాబోతున్నారని చెప్పిన డాక్టరే తనను పరీక్షచేసి మీకు సంతతి కలగదని చెప్పాడు కదా!

ఇది నిస్సందేహంగా ఓ నాటకము.

ఈ నాటకంతో తనకు సంబంధం లేదు.

ఎవరి సంతానమో తన యింట్లో నడయాడుతూ తనను నాన్నా అని పిలుస్తుంటే తను సహించలేడు. కాని బయటపడలేదు.

చివాలున లేచాడు. ఒక చిన్న సూటుకేసులో బట్టలు పెట్టుకున్నాడు. తన బీరువాలో ఉన్న డబ్బు పర్సులో సర్దుకున్నాడు. సునందా దేవి వైపు తిరస్కారంగా ఒక చూపు విసిరాడు. దేవిడీ దాటి బయటికి అడుగుపెట్టాడు అంతే. మళ్ళీ కాలులోపల పెట్టనని శపథం కూడా చేసుకున్నాడు మనసులో.

* * *

ఉదయమే లేచిన రేఖ కడుపు నొప్పితో చుట్టలు చుట్టుకుపోతున్నది. పక్కమీదినుంచి లేవలేదు. మూలుగుతున్నది. ఆ గదంతా దొర్లి గింతలు పెడుతున్నది. కళ్లనీళ్లు కారిపోతున్నాయి. తల వెంట్రుకలు రేగి కన్నీళ్లతో చెంపలకు అంటుకుపోయాయి.

రేఖ కోసం చపాతి కూర తీసుకు వచ్చిన యాదమ్మ ఆమెను చూసి గాభరా పడ్డది. రేఖ వచ్చినప్పటి నుంచీ మొదట అంటీ ముట్టనట్టుగా ఉన్నా క్రమంగా ఆమె పట్ల వాత్సల్యం అంకురించి పెరగటం మొదలు పెట్టింది. మెల్లగా రేఖను లేవదీసి కూర్చోబెట్టి వేడివేడి టీ తాగించింది. రేఖ కడుపు పట్టుకుని విలవిల్లాడి పోతున్నది. అప్పుడు గ్రహించింది యాదమ్మ రేఖ రజస్వల అయిందని - ఈ కడుపునొప్పి దానికి సంబంధించినదనీ. వెంటనే బజారుకు వెళ్లి నువ్వులు కొబ్బరీ బెల్లం తీసుకువచ్చి, దంచి

ముద్దలు చేసి తినిపించింది. కదలకుండా పడుకోమని చెప్పి పులగం వండి పెట్టింది.

"రేఖమ్మా! ఈ మూడు రోజులూ స్కూలు మానెయ్యి తల్లీ. దీనితో కడుపునొప్పి తగ్గిపోతుంది. తగ్గకపోతే నేను ఆచార్యుల నడిగి మందు తీసుకువస్తా"

"యాదమ్మా! ఇవాళ నాకు పరీక్ష ఉంది. రాత్రంతా కూర్చుని బాగా చదివాను. దానిలో నాకే మార్కులు బాగా వస్తాయని నమ్మకం ఉంది. ఈ కడుపులో నొప్పితో ఎట్లా?" ముఖమంతా బాధతో ముడుచు పోయింది.

"రేఖమ్మా! నొప్పి తగ్గినా నీవు నాలుగు రోజులపాటు పడుకునే ఉండు".

అర్థం సరిగ్గా కాకపోయినా యాదమ్మ మాటలకు కట్టుబడి ఇంట్లోనే ఉండిపోయింది రేఖ. మనసులో తన పరీక్షను తలచుకొని తలచుకొని బాధ పడుతునే ఉంది. కళ్లనీళ్లు కారిపోతున్నాయి.

నాలుగోరోజున యాదమ్మ రేఖకు స్నానం చేయించింది. ఆ మరునాడు స్కూలుకు వెళ్లమని చెప్పింది. రేఖ స్కూల్లో అడుగు పెట్టగానే దమయంతి కామాక్షి ఎదురుగా వచ్చి కౌగలించుకున్నంత పని చేశారు.

"నెల్లాళ్ళనుంచీ చదివి చదివి పరీక్షకు రాకుండా ఇంట్లో కూర్చున్నావేం? చదవకపోయినా మేము పరీక్షకు హాజరయి చేతికి వచ్చింది రాశాము" ఆమెను నఖశిఖపర్యంతమూ చూస్తూ, జడ సవరిస్తూ గుచ్చిగుచ్చి అడగటం మొదలుపెట్టారు.

రేఖకు ఇరుకున పడ్డట్టయింది. ఏం చెప్పాలో తెలియలేదు. "నాకు కడుపునొప్పి విపరీతంగా వచ్చింది. లేవలేకపోయాను. ఏం చెయ్యను?" మళ్ళీ విచారం రేఖ ముఖమంతా అలుముకు పోయింది.

క్లాసులోకి వెళ్ళగానే టీచరు రేఖను పిలిచి ఎందుకురాలేదని ప్రశ్నించింది.

రేఖ తన కడుపునొప్పి సంగతి చెప్పి తలవంచుకుంది.

"ఈ పరీక్ష క్లాసు పరీక్ష నీవెందుకంతగా బాధపడుతున్నావు రేఖా! నేను ఊరికే అడిగాను. పెద్ద పరీక్షలకు బాగా చదువు. నీవు ఈ స్కూలుకు ఫస్టు వస్తావన్న ఆశ నాకు బాగా ఉంది. ఈ సంస్థానాధీశ్వరులయిన శ్రీ రాజాగోపాలకృష్ణరాయల వారు ఈ స్కూల్లో ఫస్టు వచ్చిన వాళ్ళకు పై చదువులు చదువుకోవటానికి స్కాలర్ షిప్పు ఏర్పాటు చేశారు. అది నీకే వస్తుందన్న నమ్మకం నాకు బాగా ఉంది. నా ఆశలు నిరాశలుగా చేయవనుకుంటాను" ఆమె ఇంగ్లీషు పాఠము చెప్పటమే కాదు. హెడ్ మిస్ట్రెస్ కూడాను.

ఆ పాఠశాలను ప్రభుత్వము తన అధికారము క్రింద పాలన చేస్తున్నప్పటికీ శ్రీ రాజావారు ఏర్పరచిన కొన్ని నియమాలను పాటిస్తున్నది. ఆయన తన సంస్థానములో ఒక ఉన్నత పాఠశాల ఉండాలని రెండెకరాల భూమిలో విశాలమయిన భవన మొకటి ఆధునిక సౌకర్యాలతో నిర్మించి తమకు ఆస్తి ఇచ్చిన పెదతల్లి నరసాయమ్మ పాఠశాల అని పేరు పెట్టారు. ఆమె తైలవర్ణ చిత్రమొకటి నిలువెత్తుది హాలులో తగిలించారు. ఆమె పేరు మీద ఆ పాఠశాలలో ఫస్టున ప్యాసయిన వాళ్ళకు ఉన్నత విద్యాభ్యాసానికిగాను నెలకు నూరు రూపాయలు నరసాయమ్మా స్కాలర్ షిప్పుగా ఇస్తారు. ప్రభుత్వాధికారము క్రిందికి వచ్చినప్పటికీ రాజావారు పంపించిన పిల్లల నిద్దరిని ఆ పాఠశాలలో ఫీజు లేకుండా చేర్చుకోవాలి. ఈ నియమాన్ననుసరించే సునందాదేవి రేఖను ఆ స్కూల్లో చేర్పించింది.

ఆ ఊరు ఆరువందల గడపకలది. గోపాలకృష్ణరాయడు మూడు ఎకరాల స్థలాన్ని హాస్పిటల్ క్రింద వినియోగము చేశాడు. దానిలో నాలుగు పడకలుగల హాస్పిటల్ ఒకటి కట్టించాడు. దాని పేరు కూడా నరసాయమ్మదే. ఆ భవనాన్ని కూడా ప్రభుత్వానికి ఒప్పగించింది హైదరాబాదు రాష్ట్రింపైన పోలీసుచర్య జరిగిన తరువాతనే హాస్పిటల్లో ఒక డాక్టరు, ఒక నర్సు, ఒక దాయి ఒక కంపౌండరు - ఇలా ఒక్కొక్క రిని ప్రభుత్వం నియమించింది.

రేఖ అప్పుడప్పుడు తల్లికి జాబులు వ్రాస్తూ ఉండేది. ఒక ఉత్తరంలో "అమ్మా! నన్ను ఒకసారి పంపమని సునందాదేవిగారికి ఉత్తరం వ్రాయవూ? నిన్ను అన్నలనూ చూడాలని ఉందమ్మా! రా త్రిళ్లు మరీ దిగులుగా ఉంటున్నది. యాదమ్మ ఇప్పుడు కాస్తనయం. నన్ను బాగా పలకరిస్తున్నది. బాగా చూసుకుంటున్నది. ఇంకా రెండు నెలల్లో మాకు పెద్ద పరీక్షలు వస్తాయి. అవి కూడా అయిపోతే నేను నీ దగ్గ కి ఎప్పటికీ వచ్చేస్తానమ్మా. నన్నిక్కడ ఎన్నాళ్లుంచుతావు? నేనింక ఉండ లేను. నీ ఉత్తరం కోసం ఎదురు చూస్తుంటా రేఖ.

ఈ ఉత్తరం వ్రాసి స్కూలుకు వెళ్ళేటప్పుడు ఆ సమీపంలో ఉన్న పోస్టుబాక్సులో పడేసింది. పదిరోజులు ఎదురు చూసింది. తల్లి దగ్గరనుండి జవాబు వస్తుందేమోనని రాలేదు. నాలుగు రోజులు గుబులుగుబులుగా తిరి గింది రాత్రిళ్లు కంటిమీదికి కునుకురాక దొర్లిగింతలు పెట్టింది.

"ఏమిటి రేఖమ్మా! నిద్రరావటం లేదా? అమ్మ మీదికి ధ్యాస మళ్లిందా?" యాదమ్మ పక్కపరచుకుంటూ అడిగింది.

ఆ పలకరింపుతో రేఖకు ఉప్పెనలా దుఃఖం పొంగింది.

యాదమ్మకు పిల్లలు లేరు. పెళ్లి అయిందిగాని పెనిమిటి ఎక్కడికో వెళ్లాడని కొందరంటారు. పెళ్ళికాలేదనీ చిన్నప్పటి నుంచి ఈ భవంతిలోనే

ఉంటున్నదనీ కొందరంటారు. రేఖ కన్నీరు చూడగానే యాదమ్మకు గుండెలో కదలిక వచ్చినట్లయింది. ఇన్నాళ్ళ నుంచీ సునందాదేవి ఆజ్ఞమీద రేఖను చూస్తున్నది. పెదవులతోనే పలకరించి డ్యూటీ చేసినట్టు చేస్తున్నది. కాని ఈనాడు యాదమ్మ గుండెలో తలదూర్చి దుఃఖిస్తున్న మామూలుగా చూడలేకపోయింది.

"రేఖమ్మా! నా తల్లివి కదూ? నాతో చెప్పు. అమ్మమీద బెంగ కలిగిందా? స్కూల్లో ఎవరయినా మాటలన్నారా? నాతో చెప్పు" తల నిమిరి కళ్లు తుడిచింది.

తల్లినీ అన్నలనూ చూడాలని ఉన్నట్టు చెబుతూ తన చిన్నప్పటి సంగతులన్నీ ఏకరువు పెట్టింది రేఖ. తన తల్లీ తండ్రీ తనను ఎంత గారాబంగా పెంచిందీ, అన్నలు ఎంత మురిపెంగా చూసుకున్నదీ చెప్పింది.

"ఉత్తరం రాగానే వెళ్లిపోదువు గాని - అంతటితో చదువుకూడా అయిపోతుంది కదా!" అన్నది యాదమ్మ వీపు నిమిరుతూ.

"అమ్మ రమ్మని రాయాలి. సునందాదేవిగారు పంపించాలి" అన్నది బిక్కముఖం పెట్టి రేఖ.

"అమ్మగారు పంపటానికేం? ఉత్తరం రాగానే నేను కూడా వచ్చి పంపుతానుగా? అమ్మగారు అక్కగారి దగ్గరికి నన్ను అప్పుడప్పుడు పంపుతూ ఉంటారు" ధైర్యం చెప్పింది యాదమ్మ.

"నేను వచ్చినప్పటి నుంచీ వెళ్లలేదే?" అనుమానంగా చూసింది రేఖ.

"అవును పంపలేదు. అమ్మగారికి ఈ మధ్య దైవభక్తి ఎక్కువయింది. ప్రతి శుక్రవారం శనివారం గుడికి వెళ్లి పూజలు చేయిస్తున్నారు. ఇంట్లో కూడా పూజలు చేయిస్తున్నారు."

"దేవిడీలో కూడా పూజలు చేస్తారా ? నా స్నేహితులు దమయంతీ వాళ్లు చెప్పారు ఈ ఊళ్లో పెద్దదేవాలయమున్నదని. వాళ్లతో వెళ్లి చూద్దా మనుకున్నాను. గాని - స్కూలు మూసెయ్యగానే ఇంటికి రాకపోతే ఎవరే మనుకుంటారో నన్న భయము."

"నీవింతవరకూ దేవిడీ చూడలేదు కదూ? అమ్మగారు గుడికి వెళ్లినప్పుడు చూపిస్తాలే"

"నాకప్పుడు స్కూలు ఉంటుందిగా !"

"ఏదో సమయం చూసుకుని చూపిస్తాలే రేఖమ్మా !" అన్నది మెల్లగా ఆమెను తనపక్కలో పడుకోబెట్టుకుంటూ.

ప్రతిరోజూ రాత్రి పడుకోబోయేటప్పుడు రేఖ తన స్కూలు సంగతులూ చదువు సంగతులూ, స్నేహితులను గురించి యాదమ్మతో ఒక గంట కబుర్లు చెబుతూ కళ్లు మూసుకుంటుంది.

యాదమ్మ దేవిడీలో నుంచి భోజనం తీసుకు వచ్చేటప్పుడు "రేఖమ్మకు కాస్త కూర వెయ్యి. ఆపిల్ల టీ తాగదు. గ్లాసెడు పాలు పొయ్యి. చల్లబొట్టు నాకు పోసినా కాస్తంత పెరుగు పొయ్యి కప్పులో" అని వంట మనిషితో ఘర్షణపడి అవన్నీ తెచ్చేది.

"అమ్మగారిని అడిగావా ?" వంటమనిషి బెదిరించేవాడు. అతడు సరుకులు బయటికి తీసుకువెళ్లి అమ్మటం యాదమ్మకు బాగా తెలుసు. ఆహారపదార్థాలు తనకిష్టమయిన నౌకర్లకు చేతినిండా పెట్టటం, కొందరితో అక్రమ సంబంధాలు పెట్టుకోవటం కళ్ళతో చూసింది. కాని-ఒకరి మీద నేరాలు తీసుకువెళ్లి అమ్మగారితో చెబితే పగబట్టి తనకు భుక్తి లేకుండా చేస్తాడేమోనన్న భయం యాదమ్మకు మనసులో ఎప్పుడూ మసులుతూ ఉంటుంది. అసలు తను ఆ ఊరి మనిషికాదు. తనమాటా-

పద్ధతి- ఇక్కడి నౌకర్లతో కలవవు. సునందాదేవి కనకదుర్గ గుడికి వెళ్ళినప్పుడు తను విజయవాడ దుర్గకొండ ముందర పూలమ్ముకుంటూ ఉండేది. తల్లితండ్రీలేని పదహారేళ్ళపిల్ల- చూడముచ్చటగా కనబడ్డది సునందాదేవి కళ్ళకు. "నాతో వస్తావా ? మా ఊరు తీసుకువెళ్తాను." అని ముచ్చటపడుతూ అడిగింది.

ఒంటినిండా నగలు, పెద్దజరీ పట్టుచీర - వెంట దాసీజనమూ- ఆమెను చూడగానే దిగ్భ్రాంతురాలయింది. అప్పటి తనపేరు వీరి. ఆమె కూడా వెళ్ళితే తనకేలోటూ ఉండదనుకున్నది. అప్పటివరకు పక్కయింటి ముసలమ్మనే పెద్దదిక్కుగా భావించుకుని జీవిస్తున్న వీరి సునందాదేవి వెంటవచ్చి యాదమ్మగా మారింది. ఆదేవిడీలో అమ్మగారి బట్టలు చాకలికి వెయ్యటమూ,- సరిగా వచ్చాయో లేదో చూసుకోవటమూ-ముత్తి లేనప్పుడు తమలపాకు సరంజామా సునందాదేవికి అందించటమూ-అమ్మగారికి తల్లో పెట్టుకోవటానికి సాయంత్రానికల్లా పెరట్లో పూసిన సన్నజాజులదండ గుచ్చటమూ- ఇవిగాక అమ్మగారేదయినా పనిచెప్పితే చెయ్యటమూను. ఆదేవిడీనౌకర్లతో తానెంత కలివిడిగా ఉన్నా వాళ్ళంతా ఒకటయి తనను వేరుగా చూడటం జరుగుతునే ఉన్నది. అమ్మగారయినా ఎప్పుడోగాని ఆప్యాయంగా పలకరించదని తెలుసుకున్నది యాదమ్మ. అయినా ఆమె తనపోషణకేమీ తక్కువ చెయ్యలేదు. సంవత్సరానికి కావలసిన చీరలు రవికలు కొనిస్తుంది. దీపావళి పండుగకూ కాముడి పున్నమికీ కొత్త చీరెలు కొంటుంది. ఆ విశ్వాసంతోనే ఆదేవిడీలో నౌకర్ల మధ్య జరిగే మంత్రాంగాలూ, రహస్యాలూ తెలిసినా తెలియనట్టే ఉంటుంది. కంటితో చూసినా చూడనట్టే వుంటుంది. అందరితో స్నేహంగా మసలుకుని మంచి తనాన్ని నిలుపుకుంటూ వస్తోంది. ఒక్క డ్రయివరు బాలయ్యతో మాత్రం మనసు కలిపింది. కాని విచ్చలవిడిగా తిరగదు. ఆ సంగతి

అందరికీ తెలిసినదే అయినా వాళ్ళిద్దరినీ సరసాలాడుకుంటూ వుండగా ఎవరూ చూడలేదు.

*　　　*　　　*

సునందాదేవి బద్ధకంగా ఒళ్లు విరుచుకుని నిద్రలేచే సరికి ముత్తి గదిలో లేదు. రెండుసార్లు గట్టిగా పిలిచింది. బయటనుంచి ఒక్క పరుగులో లోపల కాలు పెట్టిన ముత్తి ముఖం చాలా గంభీరంగా ఉన్నట్టు కనబడ్డది. సునందాదేవి ముఖమార్జన చేసుకుని టేబుల్ ముందర కుర్చీలో కూర్చోగానే కాఫీ టిఫిన్ తీసుకు వచ్చి బల్లమీద పెట్టింది. ఆమె ఇప్పుడు ఉదయమూ సాయంకాలమూ తన గదిలో ఉన్న బల్లమీదనే కాఫీ టిఫిన్ తీసుకుంటున్నది.

"ఏమిటట్లా ఉన్నావు?" ఐదు నెలలు నిండిన తన గర్భాన్ని ఒక చేత్తో తడుముకుంటూ ప్రశ్నించింది సునందాదేవి.

"నర్సిమ్ము... నర్సిమ్ము ఏమో అంటున్నాడు." నసుగుతూ దూరంగా నిలబడ్డది.

"ఏమిటి నర్సిమ్ము? నిన్నేమయినా అన్నాడా? వాడికేమయినా చిలిపి బుద్ధులు పుడుతున్నాయా?" కనుబొమలు పైకెత్తి కళ్ళు పెద్దవి చేసుకుని చూసింది సునందాదేవి.

"ముసలిదాన్ని పట్టుకుని నన్నేమంటాడు దొరసానీ. దొరవారు--దొరవా..." నీళ్ళు నమిలింది.

"ఏమయింది? ఇంకా దొరవారు పైనుంచి కిందికి దిగి రాలేదా? అలవాటేగా? రాత్రిళ్ళు నిద్రసరిగా లేకపోతే పదిగంటలకు నిద్రలేవటం మామూలేగా?" తలవంచుకుని ఓరగంటితో చూసి రొట్టె తుంచుకుని తినటం మొదలు పెట్టింది.

"దొరసానీ! పైన దొరవారు లేరట!"

"పైన లేకపోతే దొరవారి గదిలో చూడమను"

"అక్కడా లేరు దొరసానీ!"

"అప్పటి కామె కాఫీ తాగటం కూడా అయింది. చేతులు చిన్న తువాలతో తుడుచుకుని గది బయటికి వచ్చి, ఎప్పుడూ కూర్చునే సోఫాలో కూర్చుని తమలపాకు సరంజామా కోసం ఎదురుచూస్తున్నది.

"అయితే ఎక్కడికి వెళ్లినట్టు దొరవారు?" తనలోతాను గొణుక్కున్నది.

అంతలో పండుతమలపాకు బీడా జరదాతోకూడా తెచ్చినది. పుక్కిటపెట్టుకుని, దిండుమీదికి జరుగుతూ, తన గర్భంకేసి ఒకసారి చూసుకున్నది.

ఆయనకేమయినా అనుమానం తగల్లేదు కదా? ఎట్లా తగులుతుంది? తామిద్దరూ ఒక యింట్లోనే ఉంటున్నారు కదా! దాంపత్యజీవితం చక్కగా సాగిపోతూనే ఉంది. భుజంగం చొరవ తీసుకోవటం ఆయన కంట పడలేదు కదా? అయినా ఆ స్నేహం ఏడాదినుంచీ సాగుతుంటే ఇవాళే అనుమానం కలగవలసి వచ్చిందా?

అమె మనసుకు సమాధానం కలగలేదు. చప్పున మెదడులో ఏదో మెరుపులా మెరిసినట్లయింది. వెంటనే గుమాస్తా శివయ్యను పిలిపించింది.

"దొరవారు ఈ మధ్య డబ్బేమయినా ఎక్కువగా తీసుకుంటున్నారా?" ప్రశ్నించింది ఎటో ఆలోచిస్తూ.

"ఎక్కువేం తీసుకోలేదు" చేతులు కట్టుకుని తలవంచుకుంటూ జవాబు చెప్పాడు.

"నిజం చెప్పండి. రాత్రి చేసిన ఖర్చులకు డబ్బు తీసుకోలేదూ?" నిలవదీసి అడిగింది.

"లేదమ్మా. దైవసాక్షిగా చెబుతున్నాను."

"అయితే రాత్రి ఖర్చులకు పైకం ఎక్కడిది?"

"రాత్రి ఖర్చులకు పైకం చెల్లించమని ఒక చీటీ వ్రాసి నర్సిమ్లు చేతికిచ్చారట. నాచేతి కిప్పుడే ఇచ్చాడు."

ఆమె ఆ చీటి అందుకుని చదువుతున్నది. నాట్యం చేసిన ఆమెకు వెయ్యి రూపాయలు, పక్కవాద్యాలకు ఐదువందలు కాక- వాళ్లకు వెళ్లే టందుకు చార్జీలు మూడువందలు.

ఒకరాత్రికి పద్ధెనిమిది వందల నగదు ఖర్చు. అవిగాక విందులు-పానీయాలూ ఉపరి.

చదువుకుని ఆ చీటీ మడిచి చేతబట్టుకుంది.

"నర్సిమ్లూ!" వెరికేక వేసింది ఆ హాలు దద్దరిలిపోయేటట్టుగా.

భయంతో మోకాళ్లు రెండూ కొట్టుకుంటుండగా- నాలుక తడి ఆరి పోగా- పెదవులు ముడుచుకుంటూ వచ్చాడు నర్సిమ్లు.

"దొరవారు నీకీ చీటీ ఎప్పుడు ఇచ్చారు?" ఖంగుమన్నది ఆమె కంఠం.

"వేకువజామున నాలుగు గంటలకు మంచినీళ్లు తీసుకురమ్మ న్నారు. నా చేతిలోనుంచి గ్లాసందుకుంటూ శివయ్యగారు వచ్చినప్పుడు ఇవ్వమని ఈ చీటీ ఇచ్చారు." చేతులు కట్టుకుని ఆమెకెదురుగా నిల బడ్డాడు నర్సిమ్లు.

"కిందికి ఎప్పుడు వచ్చారు?"

"తమకు సుస్తీ చేసిందని ముత్తి కబురుచేసిన తరువాత-దొరవారు కిందికి వచ్చి ఈ సోఫాలో కూర్చున్నారు. మళ్లీ పైకి పోలేదు. డాక్టరు వచ్చి చూసి, తమకు మందిచ్చి, దొరవారితో మాట్లాడి వెళ్లారు. అప్పుడే పైకి వెళ్లి వెంటనే చేతిపెట్టెతో కిందికి వచ్చారు. అంతే."

"అయితే రాత్రి భోజనాలు పైన జరగలేదా?" ఆశ్చర్యంతో ప్రశ్నించింది కళ్లు వెడల్పు చేసుకుని.

"లేదు దొరసానీ. దొరవారు పైకి పోలేదు. ఒకగంట చూసి ఎక్కడివాళ్లక్కడ సర్దుకున్నారు."

ఆమె అంతులేని ఆలోచనలతో కళ్లు మూసుకుంది.

మరో పావుగంటకు "నాట్యం చేసిన ఆమె ఎక్కడ దిగింది?" కళ్లు తెరవకుండానే అడిగింది.

"భూమయ్యదొర మిద్దెమీద దిగింది."

"వెళ్లిపోయిందేమో చూసిరా."

"ఇంకా పోలేదు దొరసానీ. శివయ్యగారు అక్కడికి వెళ్లి పైకం ఇవ్వాలి కదా!"

ఆమెకు కలిగిన అనుమానం అంతటితో వదలిపోయింది.

మరి దొరవారు ఏమయినట్టు?

చటుక్కున జ్ఞాపకం వచ్చింది ఆమెకు- తన గర్భం సంగతి. తాను ఇంతవరకూ ఆయనకు చెప్పలేదు. ఒకవేళ డాక్టరు చెప్పాడేమో? చెబితే మాత్రం? ఇంతకాలం నుంచీ రాని గర్భం ఇప్పుడెలా వచ్చిందని సంశయమేమయినా కలిగిందా? ఎలా కలుగుతుంది? ఎవరిమీద అనుమానం?

ఆలోచనలు అటూఇటూ ఊపేస్తున్నాయి. అలా ఆలోచిస్తూ సోఫా మీద ఒరిగిపోయింది సునందాదేవి.

మధ్యాహ్నం పన్నెండు గంటలు కావచ్చింది. ఆమె కదలలేదు. నౌకర్లంతా వాళ్ల పనులు వాళ్లు చేసుకుని హాలులో గోడవారగా నిలబడ్డారు. ఆమెను లేపటానికి అందరికీ భయంగానే ఉంది.

ముత్తి చొరవ చేసుకుని "దొరసానీ, లేచి స్నానం చేయండి. వేడి నీళ్లు ఆరిపోతున్నాయి. వేళకు భోజనం చెయ్యకపోతే కడుపు బిగదీస్తుంది. మీరు వట్టిమనిషి కారు" ముందుకు వచ్చి నిలబడ్డది.

కళ్లు తెరచిన సునందాదేవి ఏదో జ్ఞాపకం వచ్చినట్టుగా దిగ్గున లేచింది. స్నానాల గదివైపుకు అడుగులు వేసింది.

ఏమిటది ? ఇలా ఎందుకు జరిగింది ?

ఆలోచనలు సాగుతున్నప్పటికీ ఆమె తన ఆరోగ్యాన్ని గురించి అశ్రద్ధ చేయదలచుకోలేదు. దైవము నిరంతరము ఆమె మనసులో మెదులుతున్నాడు. ఆ ఊరిలో నరసింహస్వామి దేవాలయము ఉన్నది. అది కూడా నరసాయమ్మ ధనంతో నిర్మాణమయిందే. ఆ స్వామి నర్చించటంలో దేవార్చనే కాకుండా పెద్దల ఆశీర్వచనం లభించినట్లనుకుని వరస తప్పకుండా ప్రతి శుక్ర శనివారాలు వెళ్లి సహస్ర నామార్చన చేయించి కొబ్బరికాయలు కొట్టిస్తున్నది.

క్రమం తప్పకుండా డాక్టరు వస్తున్నాడు మందులు ఎటువంటివి వాడాలో వ్రాసి ఇస్తున్నాడు. పళ్లరసాలు తాగమంటున్నాడు. ఆమె ఆరోగ్యానికి భంగం రాకుండా కాపాడుతున్నాడు.

తొమ్మిదవనెల రాగానే సునందాదేవి పట్నం నుండి లేడీడాక్టరును పిలిపించుకున్నది. సునందాదేవి గర్భంలో బిడ్డ సక్రమంగా ఎదుగుతున్న

దని డాక్టరు హామీ ఇచ్చింది. పురిటి సమయానికి తనకు కబురు చేయమని చెప్పింది డాక్టరు.

చలికాలం. జీవులన్నీ ముడుచుకొని పడుకునే వేళ - రాత్రి పదకొండు గంటలకు దేవిడీలో పసిబిడ్డ కేర్ కేర్ మన్న ఏడ్పినట్టు భవనమంతా వినబడ్డది.

సునందాదేవి తన జన్మ సార్థకమైనట్టు భావించింది. పసిబిడ్డ ఏడుపు చెవిన పడగానే ఆమె తనువు పులకరించింది. గత రెండు రోజులుగా పడిన బాధ దానంతట అదే మరుగునపడిపోయింది. ఆమెలో తహతహ-ఆ బిడ్డను-అపురూపంగా తనకు జన్మించిన ఆ బిడ్డను-ఎన్ని అపవాదులయినా భరించి నవమాసాలూ మోసి కన్న ఆ పసిబిడ్డను కంటితో చూడాలన్న ఆరాటం-తొందర విద్యుత్‌లా ప్రసారమవుతున్నది.

లేడీడాక్టరు మహాలక్ష్మి ఆమె చేతిలో మగబిడ్డను సజీవంగా పెట్టగలిగినందుకు తన అదృష్టాన్ని తానే అభినందించుకున్నది. తన చాకచక్యాన్నంతా ప్రదర్శించగలిగినందుకు ఎంతో మురిసిపోయింది.

"అమ్మా. మీ బిడ్డను కళ్లారా చూసుకోండి. ఆరు పౌనులున్నాడు. ఆరోగ్యంగా ఉన్నాడు." అంటూ సునందాదేవి పక్కలో పడుకోబెట్టింది. ఒక్కసారిగా తన బిడ్డను కంటినిండా చూసుకున్న సునందాదేవి డాక్టరు మహాలక్ష్మిని ఒక దేవతలా భావించింది. కృతజ్ఞతతో ఆమెకు రెండు చేతులూ జోడించింది. ఆనందబాష్పాలు ఆమె కళ్లల్లో ఇంద్రుపగింజల్లా నిలిచాయి.

డాక్టరు ఆ పదిరోజులూ వారింటనే బస చేసింది. ఆమె కొరకు మేడపైన రెండుగదులు శుభ్రం చేయించి తగిన ఏర్పాట్లు చేయించింది. సునందాదేవి. పదకొండవరోజు తల్లీబిడ్డల స్నానాలయిన తరువాత ఆవ

సరమయిన మందులు రాసిచ్చి తన బహుమతుల నందుకుని సునందాదేవి కారులో డాక్టరు వెళ్ళిపోయింది.

బిడ్డ పుట్టాడన్న అంత సంతోషములోను సునందాదేవి మనసు వెలితి వెలితిగా ఉంటున్నది. తన జీవితం పంచుకున్న గోపాలకృష్ణరాయడు తన సంతోషంలో భాగం పంచుకోవటం ఇష్టం లేకనే ఇల్లు వదలిపోయినట్టు ఆమెకు రూఢిగా అర్థం కావటం మొదలుపెట్టింది. ఆయనకు తన మీద అనుమానము కలిగిందనటానికి నిదర్శనము చెప్పాపెట్టాకుండా ఉత్తర మ్ముక్కయినా రాసి పెట్టకుండా ఇంటినుంచి వెళ్లిపోవటమే.

ఇప్పుడు తన కర్తవ్యం ?

సంసారాన్ని త్యజించి వెళ్లటం తప్ప ఆయన తననేమీ అవమాన పరచలేదు. కించపరచే మాటలేమీ అనలేదు. తనే ఇంటినుండి వెళ్లి పోయాడుగాని తనను వెళ్లగొట్టలేదు. స్థిరచరాస్తులన్నీ అట్లాగే ఉన్నాయి. ఈ బిడ్డను పెంచి పెద్దవాడిని చేసి ఈ ఆస్తికి వారసుడినిగా చేయటమే తన కర్తవ్యము. తన శక్తివంచన లేకుండా బిడ్డను పెంచి విద్యావంతు డిని చేయటం తన బాధ్యత. బిడ్డకు సకల విద్యలూ నేర్పించాలి. వాడి జీవితంలో ఏ విధమయిన లోపమూ ఉండకూడదు. దృఢంగా నిశ్చయం చేసుకున్నది సునందాదేవి. ఇరవై ఒకటవ రోజున దేవాలయంలో పేరు పెట్టటానికి నిశ్చయించుకున్నది. ఏం పేరు పెట్టాలన్న ఆలోచన చేయ లేదు. గోపాలకృష్ణరాయడి తండ్రి పేరు గిరిధరరాయలు. ఆ పేరుపెట్టి– ఆ మరునాటినుండీ ఆస్తి వివరాలు, డబ్బు లెక్కలు స్వయంగా చూసు కోవటం మొదలుపెట్టింది.

గిరిబాబు సునందాదేవి ప్రాణంలో ప్రాణంగా ఆ యింట పెరుగు తున్నాడు. బిడ్డ అందరికీ అపురూపం– కాని నర్సిమ్ము మాత్రం ఓరగంట నయినా చూడడు.

* * *

కాలచక్రం తిరుగుతున్నది. గిరిబాబుకు విద్యాభ్యాసము చేసే సమయము ఆసన్నమయింది. ఒక టీచర్ని పెట్టి ఇంట్లోనే ఏర్పాటు చేసింది సునందాదేవి. మేడమీది గదులు పిల్లవాడి పడకకూ చదువుకూ ఆటలకూ ఏర్పాటు చేసింది. వయసుకు తగిన తెలివితేటలుగల పిల్లవాడు. ఆమెకు తృప్తికరంగా చదువుతున్నాడు. పదిపన్నెండు సంవత్సరాల వరకూ ఇంట్లోనే చదువు చెప్పించి, అక్కడికి పదిహేను మైళ్లదూరంలో ఉన్న పట్నంలో తమ హోదాకు తగిన పాఠశాలలో చేర్పిద్దామని సంకల్పించింది సునందాదేవి.

పదవ సంవత్సరము వచ్చిన గిరిబాబు చదువుతున్నాడుగాని, వయసుకు తగిన పొడుగులేడు. దేహము వయసుకు తగినట్టు నవనవలాడుతూ లేదు ముక్కు పాదాలు చేతులు ఎదగటం ఆగిపోయినట్లనిపిస్తాయి. ఎదగకుండానే ముదురుతున్నట్టు కనబడుతున్నాయి. ఒంటినిండా బట్టలు ఉండటంచేత- ముఖం మాత్రం అసాధారణంగా కనబడటం నౌకర్లు గమనించినా నోరెత్తలేక పోయారు. అనుమానించిన సునందాదేవి వెంటనే డాక్టర్ని పిలిపించింది.

పిల్లవాడిని బాగా పరీక్షచేశాడు డాక్టరు. ఆరోగ్యంగానే ఉన్నాడు- వయసుకు తగిన మనోవికాసము ఉన్నది. చురుకుదనము ఉన్నది.

"ఏమి లోపం డాక్టరుగారూ!" ఆవేదనతో అల్లాడిపోతున్నది సునందాదేవి. డాక్టరు ఏమి చెప్పబోతాడోనని ఆమె దేహము కంపించటం మొదలుపెట్టింది.

"అమ్మా. ఆరోగ్యంలో ఏమీ లోపంలేదు" అన్నాడు మెల్లగా.

"వయసుకు తగినట్టు ఎదగటంలేదని నాకనిపిస్తోంది. మీ అభిప్రాయం చెప్పండి."

"ఇప్పుడితడు మూడు అడుగులపైన ఉన్నాడు. ఇంకొక అరడుగు

గాని ముప్పావు అడుగుగాని పెరగవచ్చు. క్షమించండి. నాకు తెలిసి నంతవరకూ చెబుతున్నాను. దేహనిర్మాణము ఎత్తుకు తగినట్టే ఉంటుంది. ఆరోగ్యానికేమీ లోపం ఉండదు. కాని- పొడుగు పెరగకపోవచ్చు."

పిడుగు తలమీద పడినట్లయింది సునందాదేవికి. ఇవ్వక ఇవ్వక ఈ మరుగుజ్జును నాకు ప్రసాదించి కన్నీళ్లు తుడిచావా పరమేశ్వరా!" అన్నది పైకే- ఆమెకు ముచ్చెమటలు పోశాయి.

కొంతసేపటికి తెప్పరిల్లి "చర్మము ఎట్లా ఉన్నదో చూడండి" అన్నది.

"చర్మము కూడా వయసునుబట్టే ఉంటుంది కాని- దేహపరిమాణాన్నిబట్టి ఉండదు" డాక్టరు గిడసబారినట్టు ఉంటుందని చెప్పాలనుకున్నాడు కాని- సునందాదేవితో ఆ మాట అనలేక- "దిగులు పడకండి. అబ్బాయి చాలా చురుకైనవాడు" అన్నాడు. ఆమె విచారాన్ని పోగొట్టటానికి ఇతర విషయాలమీద సంభాషణ సాగించాలని చూస్తున్నాడు.

సునందాదేవికి ఆశాభంగమే అయింది. తన కడుపున మగబిడ్డ పుట్టాడనగానే ఎంతో సంతోషించింది. గోపాలకృష్ణరాయడు ఇంటినుంచి వెళ్లిపోయినా పిల్లవాడిని చూసుకుంటూ కాలము గడుపుతున్నది. కాని- చివరకు పరమేశ్వరుడు ప్రసాదించినది ఒక మరుగుజ్జని తెలియగానే ఆమె క్రుంగిపోయింది. ముచ్చెమటలు పోశాయి. తెలివి తప్పిపడిపోతుందేమోనని భయపడ్డాడు డాక్టరు.

"చూడండి, పిల్లలకు పది పదహారు సంవత్సరాల మధ్య పెరుగుదల ఉంటుంది. మనకు తెలియకుండానే పొడుగు పెరుగుతారు. ఇతడికి అదొక ఛాన్సు ఉన్నది. పొడుగు పెరిగితే పెరగవచ్చు మీరు ఇప్పటినుంచీ దిగులుపడకండి. మీరు అతడి చదువును గురించి శ్రద్ధ కనబరచండి"

ఈ సంభాషణలు పిల్లవాడు వినకుండా పక్క గదిలోకి తీసుకు వెళ్లి డాక్టరికి కాఫీ టిఫిన్ ఏర్పాటు చేసింది సునందాదేవి.

గిరిబాబుకు స్నేహితులు లేరు. అతడెక్కడికీ వెళ్లటానికి వీలు లేదు. బొమ్మల పుస్తకాలు తిరగేస్తూ - ఒక్కడూ ఆడుకుంటూ టీచరు ముందు కూర్చుని పాఠాలు చదివి హోమ్‌వర్కు చేసి విసిగిపోతాడు. నౌకర్లు తనను అదొక మాదిరిగా వింతచూపులు చూస్తుంటే కోపం తెచ్చుకుంటాడు, అలుగుతాడు. నౌకర్లమాట వినడు. కేకలు పెడతాడు.

ఉన్నట్టుండి-నౌకర్లను ఏమార్చి ఒకనాడు మధ్యాహ్నం వేళ దేవిడీలోనుంచి బయటికి పరుగెత్తాడు. వీధుల్లో నడుస్తుంటే అతడికి ఉల్లాసంగా ఉంది. వీధుల్లో నడిచే జనంలో కలిసి వాళ్లతో మాట్లాడుతూ తన ఈడుపిల్లలతో ఆడుతూ గెంతుతూ తిరగటం మొదలుపెట్టాడు. కండపుష్టి కలవాడు కనుక ఆడుతూ ఆడుతూ ఇద్దరు పిల్లలను పడేశాడు. వాళ్లు లేచి పట్టుకుందామనుకునే లోపల పరుగు తీశాడు.

"ఓరి మరుగుజ్జువాడా!" కిందపడ్డ పిల్లలు అరవటం మొదలు పెట్టారు

ఆ మాటకు రోషం వచ్చింది గిరిబాబుకు. వెనక్కు తిరిగి వచ్చి వాళ్లిద్దరినీ చితకబాదాడు.

ఆ అరుపులకు వీధిలో పదిమందీ పోగయ్యారు. "ఈ మరుగుజ్జుగాడెవరు?" అంటూ అతడిని పట్టుకున్నారు.

గిరిబాబు ఇంట్లో ఎక్కడా కనబడటం లేదని నౌకర్లు వాళ్లల్లో వాళ్లు గుసగుసలాడుకుంటూ కిందికీ పైకీ తిరుగుతుంటే సునందాదేవి "ఏమిటది?" అంటూ ఒక్క కేక పెట్టింది.

నౌకర్లు సీళ్లు నమిలి తలలు దించుకుని నిలబడ్డారు.

"ఏమయింది? ఏం జరిగింది చెప్పండి? ఎందుకట్లా తప్పు చేసి చేసినట్లు తలలు దించుకున్నారు?" గద్దించింది.

"గిరిబాబు కనబడటం లేదు."

అదిరిపోయింది సునందాదేవి "మీరంతా ఏంచేస్తున్నారు? వెంటనే నాకెందుకు చెప్పలేదు? పరుగెత్తండి. నాలుగు వీధులా వెదకండి" గర్జించింది. ఆదుర్దాతో నౌకర్లను పరుగెత్తించింది. తమ కారులో బయలుదేరింది. ఆమెకు కళ్లు తిరిగిపోతున్నాయి. గుండె దడదడలాడిపోతున్నది.

ఆమె కారులో వీధులన్నీ తిరిగి వస్తుండగా గిరిబాబు ఒకచెట్టుకింద పిల్లలను కొడుతూ కనబడ్డాడు. వాళ్లు నోటికి వచ్చినట్టు తిడుతున్నారు.

కారు ఆపి గిరిబాబును తీసుకురమ్మని డ్రైవరుతో చెప్పి కళ్ళు మూసుకుని చేతులతో చెవులు రెండు మూసుకుంది సునందాదేవి.

గిరిబాబు రానని కొంతసేపు పెనగులాడి, వచ్చి కారులో కూర్చున్నాడు. ఇంటికి వచ్చిన తరువాత కాళ్లు నేలకేసి బాదుతూ పైకి వెళ్లాడు. అతడికి ఒంటరితనం, తోటిపిల్లలతో ఆడుకోవాలన్న ఆరాటం. బయటికి వెళ్ళటానికి తిరిగి తిరిగి ప్రయత్నాలు చేస్తూ ఉంటాడు. అది విఫలము కాగానే నౌకర్లమీద తిరుగుబాటు చేస్తాడు.

సునందాదేవికి ఇదొక పెద్ద సమస్యగా ఏర్పడ్డది. బిడ్డను గురించిన దిగులు క్రుంగదీస్తుండగా అతడి ప్రవర్తన ఆమెకు కంపరం కలిగిస్తున్నది. వీధిలో ఆనాడు పిల్లలు తన గిరిబాబును అన్నమాట గుండెను పిండివేస్తున్నది. మరుగుజ్జు! ఆమాట తూటాలా ఆమె ఎదలో దిగబడిపోతున్నది.

* * *

ఆదిలక్ష్మీదేవి, కామేశ్వరీదేవి, సునందాదేవి, రాజావేంకటరాయడు గారి కుమార్తెలు. ఆయనకు మగబిడ్డలు లేని కారణంచేత ఈ ముగ్గురు

కూతుళ్ళనూ ఆ కాలంలో ఆడపిల్లల పైచదువులకు అనువుగా ఉన్న మదరాసులోని క్వీన్ మేరీస్ కాలేజిలో చేర్పించి హాస్టల్లో ఉంచాడు. వాళ్లు ముగ్గురూ ఆ కళాశాలలోనే పట్టభద్రులయ్యారు. రాజావేంకటరాయడుగారు తన హోదాకు తగిన సంస్థానాధిపతులతో వియ్యమంది, తన ఆస్తిని ముగ్గురకీ సమానంగా పంచి ఇచ్చాడు. ఈ ముగ్గురు అక్కచెల్లెళ్ళకు తెలుగు భాషలో కంటె ఆంగ్లభాషా పరిచయమే ఎక్కువ.

సునందాదేవికి కాన్వెంటు స్కూళ్ళు ఎక్కడున్నాయో బాగా తెలుసు. బొంబాయి కలకత్తా మదరాసు నగరాలలోని కాన్వెంటు అధికారులకు తన సమస్యను గురించి రాస్తూ ఎవరయినా సుశిక్షితురాలైన టీచరు ఉంటే తన దగ్గరికి పంపమని కోరింది. తన పిల్లవాడికి చదువు చెబుతూ, ఆటలాడిస్తూ ఉల్లాసాన్ని కలిగిస్తూ గవర్నెస్‌గా ఉండాలని వివరించింది. అటువంటి టీచరు ఉన్నట్టు తెలిపితే రైలు చార్జీలు పంపుతాననీ కోరినంత జీతమిచ్చి ఇంట్లోనే ఉంచుకుంటాననీ ఏడాదికొకసారి తనవాళ్లను చూడదలచుకుంటే పంపుతాననీ, ఖర్చులు కూడా తానే భరించగలదనీ ఉత్తరంలో వివరన షరతులుగా రాసింది.

పదిరోజుల తరువాత కలకత్తా మదరాసు నగరాలనుండి వచ్చిన సమాధానాలు సునందాదేవికి తృప్తి నివ్వలేదు. కాని బొంబాయిలో ఉన్న స్టెల్లా కాన్వెంటునుంచి ప్రిన్సిపల్ రాసిన జాబు ఒకవిధంగా నచ్చింది. వెంటనే ఆమెను పంపమని డబ్బు పంపింది రైలు చార్జీల క్రింద.

రైల్వే స్టేషనుకు దూరంగా ఉన్న తమ ఊరికి మొట్టమొదటిసారిగా అమెరికా దేశస్థురాలయిన టీచరు బస్సులో ప్రయాణం చేయటమెందుకని సునందాదేవి కారు తీసుకుని స్వయంగా బయలుదేరింది.

బంగారు వన్నెగల తలవెంట్రుకలతో- తెలుపులో ఎరుపు పాలెక్కువ కలిసిన దేహచ్ఛాయతో- అదొక విధమైన నీలిరంగు కళ్లతో

ప్రౌఢమైన ముఖంతో- కిందికి వాలిన ముక్కుతో- సన్నటి పెదవులతో- మోకాలి వరకూ తెల్లటి గౌను- తెల్లటి మేజోళ్లు- తెల్లటినిత్తు మడమల కాలిజోళ్లతో ఒక చేతిలో చిన్నగొడుగు- మరోచేత్తో సూట్‌కేసుతో కంపార్టుమెంటులో నుంచి ప్లాట్‌ఫారమ్ మీదికి దూకింది జోసఫిన్.

ఆమెను చూడగానే సునందాదేవి తనకు వచ్చిన ఉత్తరంలోని ఫోటోతో పోల్చి చూసుకుని గుర్తుపట్టి, తనను పరిచయం చేసుకుని, ఆమె కోసమే తను కారు తీసుకుని వచ్చినట్టు చెప్పింది జోసఫిన్ కృతజ్ఞత కళ్లతోనూ మాటలతోనూ చెప్పింది. ఇద్దరూ కారులో బయలుదేరారు.

సునందాదేవి ఆమె ప్రయాణం సుఖంగా జరిగిందో లేదో అడిగి తెలుసుకుంది. తన కుమారుడి పేరూ, అతడి పరిస్థితి, అతడి స్వభావమూ అతడి భవిష్యాన్ని గురించిన తన ఆందోళన మధ్య దారిలోనే వివరించింది.

"నేను పిల్లల మనస్తత్వశాస్త్రంలో పట్టభద్రను. పరిస్థితులను అర్థం చేసుకుని అతడిని చదివించగలను" పళ్లను పైకి కనబరుస్తూ నవ్వి తల ఊపింది జోసఫిన్.

హాల్లో ప్రవేశించగానే ఆమెను సోఫాలో తన సరసన కూర్చొబెట్టుకుని కాఫిటిఫిన్ తెప్పించింది సునందాదేవి. కంటితో చూసే ఆయింటి వైభవాన్నీ ఐశ్వర్యాన్నీ అంచనా వెయ్యగలిగింది జోసఫిన్. తాను ఎంత కాలం ఉండగలిగితే అంతకాలమూ సుఖంగా ఉండవచ్చునని తృప్తి పడ్డది. తనపట్ల ఆమెకు అంతలోనే కలిగిన గౌరవాన్ని విశ్వాసాన్ని గమనించి అబ్బుర పడ్డది.

ఇద్దరూ మెల్లగా మెడమెట్లు ఎక్కుతూ ఉండగా సునందాదేవి మేడ మీద ఉన్న గదులనూ పెద్దహాలునూ గురించి గొప్పగా వర్ణించి చెప్పింది.

"హలో మైడియర్ గిరిబాబూ!"

హాలు తరువాత వీధివైపుకు ఒక వరండా ఉంది. ఎందుకు కట్టారో గాని పిట్టగోడ ఎత్తుగా కట్టారు. ఒక చిన్న పెట్టెమీదకెక్కి కాళ్ళు పైకెత్తి గోడమీదుగా వీధిలోకి చూస్తున్న గిరిబాబు ఆ పిలుపుకు వెనక్కు తిరిగి చూశాడు. ఎవరూ తనను తన పేరు పెట్టి పిలుస్తున్నది? కంఠధ్వని కొత్తగా ఉంది?

బూట్ల చప్పుడు వినబడుతున్న వైపుకు తలతిప్పి చూశాడు.

అంతలో జోసఫిన్ అతడి చేయందుకుని "గిరిబాబూ! ఐయామ్ యువర్ టీచర్" అంటూ ప్రేమతో దగ్గరికి తీసుకున్నది.

ఆశ్చర్యంతో కళ్ళు పెద్దవి చేసుకుని చూశాడు గిరిబాబు.

"నిజమా?" అన్నాడు తెలుగులో.

అది ప్రశ్న కావచ్చుననుకొని "యస్.యస్. ఐయామ్ యువర్ టీచర్ ఫ్రమ్ టుడే" అన్నది అతటి బుగ్గలు మృదువుగా నిమురుతూ జోసఫిన్.

గిరిబాబు ఆమెను చూసి విస్మయపడి పోతున్నాడు.

ఆ వెంకట్రావు టీచరు తనవైపు సరిగ్గా చూడనైనా చూసేవాడు కాదు. ముఖం పక్కకు తిప్పుకుని మాట్లాడేవాడు. కుర్చీలో కూర్చున్నంత సేపూ అతడి ముఖం ఎంత వికృతంగా పెట్టేవాడో? ఈ టీచరు చాలా మంచిదిలా ఉంది. అనుకున్నాడు.

సునందాదేవి జోసఫిన్‌కు ఒకగది మేడమీదనే ప్రత్యేకించింది. ఆమెకు నచ్చినట్టుగా కోరిన ఏర్పాట్లన్నీ చేసింది.

నాలుగు రోజుల్లోపలే ఆంటీ ఆంటీ అన్న పిలుపులూ, పకపక నవ్వులూ కిందికి వినబడసాగాయి. మెట్ల దగ్గరగా ఉన్న సోఫామీదనే పగలంతా గడపటం మొదలుపెట్టింది సునందాదేవి.

జోసఫిన్‌కూ గిరిబాబుకూ కిందికి రానవసరం లేకుండా అన్ని ఏర్పాట్లు పైననే జరిగాయి.

ఒకనాటి సాయంకాలం ఐదుగంటలవేళ సునందాదేవి గుడికి వెళ్లాలని సోఫా మీదినుంచి లేవబోతుండగా మేడమీదినుంచి వచ్చిన ధ్వనులకు విభ్రాంతురాలయి పదిమెట్లు ఎక్కి ఆశ్చర్యంతో అక్కడే నిలబడి పోయింది

ఏవో పాటలు వినపడుతున్నాయి.

మరో రెండు మెట్లు-మరో రెండు మెట్లు - ఎక్కుతూ పొంచి చూస్తూ ద్వారం దగ్గరే నిలబడిపోయింది సునందాదేవి.

జోసఫిన్ ఇంగ్లీషు పాటపాడుతూ గిరిబాబు చేతగూడా పాడిస్తున్నది. ఇద్దరూ చేతులు పట్టుకుని హాల్లో అటునుంచి ఇటూ-ఇటునుంచి అటూ మెల్లగా అడుగులు వేస్తున్నారు నవ్వు ముఖాలతో.

విప్పారిన ముఖంతో సునందాదేవి మెల్లగా మెట్లు దిగి దైవదర్శనానికి వెళ్లింది.

* * *

నాలుగురోజుల సెలవుమీద వచ్చిన మాణిక్యం కూతురుని చూడాలన్న తహతహతో యాదమ్మతో మాట్లాడుతూ కూర్చున్నది.

"ఇంత కాలానికి బిడ్డను చూడవచ్చారా!" అన్నది యాదమ్మ.

"అవునని" తలూపుతూ "చూడు యాదమ్మా! నేనొక యింట్లో ఒదిగి ఒదిగి ఉన్నదానిని. కామేశ్వరీదేవిగారికి ప్రైవేటు సెక్రటరీ ననుకో, ఆమె డబ్బు లెక్కల దగ్గర్నుంచి బట్టల లెక్కలవరకూ చూడాలి. ఇంటి మేనేజిమెంటంతా నేనే ఆమె కొడుకు దూరదేశంలో ఉన్నాడు. ఆమె దిగులు పడకుండా చూడాల్సిన దానను నేనే. నా

బాధలన్నీ అణచిపెట్టుకుని ఆమె మనశ్శాంతికోసం ప్రయత్నించాలి. నాదొక విచిత్రమైన జీవితం రేఖ ఉత్తరాలకు సంతోషిస్తూ ఉండటమే గాని వెంటవెంట జవాబులు రాయటానికి కూడా నోచుకోలేదు" అన్నది కంటతడి బెడుతూ.

"రేఖమ్మ బాగా చదువుతున్నది. నాలుగు నెలలక్రిందటివరకూ నాతోపాటే ఈ గదిలో ఉండేది. కాని-దొరసాని ఇప్పుడు దేవిడీలోనే ఒకగది ఇచ్చారు. కాని-రేఖమ్మ ఒంటరిగా ఉండలేక నన్నే రాత్రిళ్లు తనగదిలో పడుకోబెట్టుకుంటున్నది. వెర్రిపిల్ల, రాత్రిళ్లు పడుకోబోయే టప్పుడు నా చెయ్యి గట్టిగా పట్టుకుంటుంది. మెట్రిక్ ప్యాసయిందట. ఇవాళ స్కూలుకు వెళ్లింది-ఏదో బహుమానమిస్తారట".

రేఖ సెలవుల్లో తల్లిని చూడటానికి బయలుదేరాలని ప్రయత్నించింది. సునందాదేవి ఇష్టపడలేదట. తను రేఖకు పెళ్లి చేయాలనుకుంటోంది. కామేశ్వరీదేవిని సంబంధాలు చూడమని చెప్పింది. ఇప్పుడెందుకో సునందాదేవి తనను ఒకసారి వచ్చి వెళ్లమని ఉత్తరం రాసింది. తనతో పంపిస్తుందేమో తను కోరినట్టుగా. పెళ్లికేదయినా సహాయము చేయమని అర్థించాలి తనకు రేఖ పెళ్లయితే చాలు. మగ పిల్లలు వాళ్లే చేసుకుంటారు తన జీవితం కామేశ్వరిదేవి దగ్గరే గడిచి పోతుంది.

తన కూతుర్ని ఇంతకాలం పోషించి చదువు చెప్పించినందుకు ఆమెకు తమ కృతజ్ఞతలు తెలపుకోవాలి. సునందాదేవి కొద్దిగా రాజసంతో మాట్లాడుతుంది. ఆమె వల్ల తను సహాయం పొందింది. కనుక అహం చంపుకొని అతి వినయముతోనే మాట్లాడాలి. ఇంతకాలం నుంచీ కామేశ్వరీదేవి దగ్గరకూడా తను తనుగా మెలగటంలేదు. ఆమెచేత

పోషింపబడుతున్నట్టుగానే సంచరిస్తున్నది. అంతకంటె పది రెట్లుగా సునందాదేవి దగ్గర తలవంచాలి.

మాణిక్యం కాలానికి తగినట్టుగా తనకున్న అవకాశంతోపాటు సర్దుబాటుకూడా అలవరుచుకున్నది. కాని-మనసు అప్పుడప్పుడు వశం తప్పుతూ ఉంటుంది. బాధకొద్ది కళ్లు మూసుకుని అలికిడికి కళ్లు తెరిచింది మాణిక్యం.

తన కెదురుగా నడచివస్తున్నది రేఖా? బాగా పొడుగు ఎదిగింది. కాని-సన్నగా రివటలా అట్లాగే ఉంది. ఒంటికి చాయ వచ్చింది. దేహం మిసమిసలాడుతున్నది. తల వెంట్రుకలు మాత్రం ఎదిగినట్టే లేవు. బుద్ధిమంతురాలి తల వెంట్రుకలు భుజాలు దిగవన్నట్టు అట్లాగే కురుచగా ఉన్నాయి. అచ్చం ఆపోలిక-ఆనడక-తండ్రి నడచి వస్తున్నట్టుగా ఉంది.

"నీవుటమ్మా ఇక్కడ కూర్చున్నది? ఇంకా ఎవరో నను కున్నాను. నా ఉత్తరాలకు జవాబయినా రాయకుండా హఠాత్తుగా ఇప్పుడు వచ్చావా?" తల్లి చేతుల్లో ఇమిడిపోయింది రేఖ ఆనందాశ్రువు లతో.

అది ఆనందమో దుఃఖమో తెలియని ఉద్వేగంలోనుంచి ఇద్దరూ తేరుకునేటప్పటికి అరగంటకు పైగా పట్టింది.

అప్పటికి తన కర్తవ్యం స్ఫురించింది రేఖకు. "అమ్మా, సునందాదేవిగారు హాల్లో కూర్చుని ఉన్నారు. రా-పోదాం".

సునందాదేవికి నమస్కరించి ఆమె చూపిన కుర్చీలో ఎదురుగా కూర్చుంది మాణిక్యం. రేఖ మెల్లిగా తనకని ప్రత్యేకించిన గదిలో పరదా చాటున నిలబడ్డది.

జరదాబీడా పుక్కిట పెట్టుకుని "అక్కా నిన్ను వెంటనే పంపించిందే? ఇంత తొందరగా పంపుతుందనుకోలేదు నేను" అన్నది సునందాదేవి వీధివాకిలి వైపు చూస్తూ.

"కామేశ్వరీదేవిగారికి ఈ మధ్య కడుపునొప్పి తరచుగా వస్తున్నది. అబ్బాయిగారు మరి రెండేళ్ళకుగాని అమెరికానుండి బయలుదేరనంటున్నారు. ఆమెకు కొంత బాధ-కొంత బెంగ. ఆమెను వదిలిపెట్టి రావటం కష్టమైన పనే- కాని- మొన్న మా అబ్బాయి నన్ను చూడటానికి వచ్చాడు. వాడిని ఆమె దగ్గర ఉంచి వచ్చాను. నేనయినా రేపు బయలుదేరి వెళ్లిపోవాలి. ఆ మాటమీదనే నన్ను రానిచ్చారు కామేశ్వరీదేవిగారు" చాలా నమ్రతతో చెప్పింది మాణిక్యం.

"అలాగా! అక్కకు కడుపునొప్పి చిన్నప్పుడు ఉండేది. ఇప్పుడదే తిరగబెట్టింది కాబోలు. అయినా అక్కకు పిల్లవాడిమీద అంత దిగులెందుకు ? పిల్లవాడు లక్షణంగా పై చదువులకని అమెరికా వెళ్లితే-వెళ్లిన మరునాటినుంచీ ఎప్పుడు వస్తావంటూ ఉత్తరాలు రాస్తుంటే-వాడు అక్కడ నిశ్చింతగా ఎలా చదువుకుంటాడు ? ఎంత తల్లయినా కాస్త ఆలోచన ఉండక్కరలేదూ? ఏం మనుష్యులో? ఒకటుంటే ఒకటి లేదని ఏడుస్తారు" అన్నది ముక్కుపుటాలెగురవేస్తూ సునందాదేవి.

మాణిక్యం ఆమె మాటలకు విస్తుపోయింది. ఏదో సమాధానం చెప్పబోయి నిగ్రహించుకున్నది.

కొంత సేపయిన తరువాత సునందాదేవిగారి కొడుకును గురించి కుశల ప్రశ్నలు వేయాలనుకుంది. పెదవులు విప్పబోయి అంతలోనే ముడుచుకున్నది. తన అంతస్తుకూ సునందాదేవి అంతస్తుకూ గల

తేదాను జ్ఞప్తికి తెచ్చుకుని ముభావంగా కూర్చుంది కాస్త సర్దుకుని మాణిక్యం.

"ఆఁ. అయితే రేఖ సంగతి ఏం చెయ్యాలనుకున్నావు ?"

మాణిక్యం ఉలిక్కిపడ్డది ఆ ప్రశ్నించిన తీరుకు. వెంటనే సర్దుకుని "మీ దయవల్ల మెట్రిక్ దాటింది కదా! మీమీ సహాయంతో పెళ్లి చేద్దామని ఉంది. అంతకంటే ఎక్కువ ఆశించే అధికారం నాకు లేదమ్మా" చేతులు జోడించిరది మాణిక్యం.

సంభాషణ ఎటు తిరుగుతుందో- ఎలా ముగుస్తుందో నని కుతూహలంతో చెవులు దోరగిల పెట్టుకుని వింటున్నది రేఖ.

"ఊఁ. మెట్రిక్కే చాలునంటావు నీ కూతురుకి" అదోక మాదిరిగా మాణిక్యం ముఖంలోకి చూసింది సునంచాదేవి.

విషాదంగా నవ్వింది మాణిక్యం. "ఈ చదువు మాత్రం దీని అదృష్టంలో ఉన్నదని నేను అనుకున్నానా ? మీ ఔదార్యం గొప్పది. నా యాచన- మీ అక్కగారి సూచన మీ కడుపులో దయను పుట్టించాయి. నాకు గొంతెమ్మ కోరికలు లేవు. ఈ ఋణాన్ని నేను ఈ జన్మలో తీర్చుకోలేను. రేఖను ఇంతకాలం పోషించి చదివించారు. అంతే చాలు. రేపు ఇద్దరం వెళ్తాము. ఉదయం ఏడుగంటలకే బస్సు ఉన్నదని చెప్పారు. సెలవిప్పించండి" మాణిక్యం ఆనందబాష్పాలు తుడుచుకుంటూ అన్నది.

"మాణిక్యం ! మా అక్కకూడా రేఖను తీసుకుని వచ్చెయ్యమనే చెప్పిందా ?"

"అవునమ్మా. ఒక సంబంధమేదో ఆమె దృష్టిలో ఉందట. పెళ్లి చెయ్యమన్నారు".

"చూడు. ఎంతగతిలేనిదానవైనా మెట్రిక్ చదువు ఒక చదువనుకుంటున్నావా ? బి.ఏ. వరకయినా చదవనీ. ఏదో ఒక ఉద్యోగం చేసుకుని బ్రతుకుతుంది. అక్క కుదర్చబోయే సంబంధం ఎటువంటిదో అడిగావా ?"

"టీ కంపెనీలో కమీషన్ ఏజంటు. జీతం కాక అమ్మకం మీద కమీషను ఉంటుందట. కనీసం నెలకు నాలుగు వందలు వస్తాయని చెప్పారు. నా స్థితిగతులు విచారించే తగిన సంబంధం చూశారు".

"ఇన్నాళ్లూ పెంచి, వాడికా రేఖను అంటగట్టడం ? వాడు శక్తి ఉన్ననాడు టీ ప్యాకెట్లు అమ్ముతాడు. కాస్త తలనొప్పి వస్తే అవి అమ్మలేకపోతాడు. ఆనాటి గతి ఏమిటి ?" కాస్త కాఠిన్యం మాటల్లో కనబరచింది సునందాదేవి.

"దానికంతకంటె మంచిది ఎక్కడినుంచి వస్తుందమ్మా ? నా స్థితికి అది ఘనంగానే తోచింది. నా దగ్గరేమున్నదని కట్నకానుకలు ఇవ్వగలను ? ఆ ఒక్కపూట పెళ్లికయినా మీ అందరి సహాయం కావలసిందే కదా ?"

"ఆఁ. అయితే విను. మా సహాయం నీకు ఎలాగూ కావాలంటున్నావు కదా? బి. ఏ. వరకూ చదవనీ రేఖను. ఇప్పుడు చేసే సహాయం అప్పుడే చేస్తాము. కాదనటం లేదు నేను".

"అమ్మా. ఇంకా నాలుగేళ్లు చదవాలి కదా !"

"అవును. చదవాలి మరి".

"ఈ ఊళ్లో పై చదువులకు వీలులేదు కదా ?"

"అవును. ఇక్కడ కాలేజి చదువు లేదు. కాని పదిహేను మైళ్ల దూరంలో ఉంది. అక్కడికి వెళ్లి చదువుకోవచ్చు. బస్సులు

నడుస్తూ ఉంటాయి. అదీగాక ఆ కాలేజీకి హాస్టలుకూడా ఉంది. నేను అన్నీ విచారించాను. దానిలో చేర్పిస్తాను. సరేనా? నాలుగేళ్లు కళ్లు మూసుకుంటే నీ కూతురు రేఖ బి.ఏ. అయిపోతుంది" సూటిగా మాణిక్యం కళ్లల్లోకి చూసింది సునందాదేవి.

మాణిక్యానికి తన కూతురు బి. ఏ. అవుతుందంటే ఆశ పుట్టింది. **కాని చేతిలో** ఉన్న సంబంధంపోతే మళ్లీ దొరకదేమోనన్న భయం కలిగింది. అప్పటికి రాజెవరో-రెడ్డెవరో ? ఈ మాటలు అప్పుడుకూడా అక్కచెల్లెళ్ల మనస్సులో ఉండాలి. అది నెరవేరాలి. అంతవరకూ తాను కాచుకుని కూర్చోకలదా ? అంతా సందిగ్ధంగా ఉంది. మాణిక్యం మౌనంగా కూర్చుండిపోయింది.

"నన్ను అనుమానిస్తున్నావా మాణిక్యం ? అయినా నీ కూతుర్ని అడుగు. ఇంతటితో చదువు చాలించి, నీతో వచ్చి, వాడి నెవరినో కట్టుకుంటుందో లేక ఇక్కడే ఉండి బి. ఏ. వరకూ చదువుతుందో తేల్చుకో.

పిలవగానే రేఖవచ్చి ఎదురుగా నిలిచింది.

మాణిక్యం కూతుర్ని కిందినుంచి పైవరకూ చూసింది.

"రేఖా ! నీవు చదువు చాలించి మీ అమ్మతో వెళ్లి ఆమె చూపించినవాడిని పెళ్లి చేసుకుంటావా ? లేకపోతే ఇక్కడే ఉండి బి. ఏ. వరకూ చదువుకుంటావా ? సునందాదేవి రేఖను కూర్చోమని కుర్చీ చూపించింది.

రేఖ విస్మయానికి అంతులేకుండా పోయింది. యాదమ్మ గదిలో నుంచి తనను దేవిడీలోకి ప్రవేశపెట్టిననాడూ-తను అడగకుండానే పది వాయిల్ చీరెలూ జాకెట్లూ ఇచ్చిననాడూ ఎంత ఆలోచించినా తనకు ఆమె అర్థం కాలేదు. ఈనాడు తనను బి ఏ. వరకూ చదవమన్న

ప్రోద్బలం కూడా అర్థం కావటం లేదు. వీటన్నిటికీ తను ఊహించలేని అర్థమేదయినా ఉందేమో ? శ్రీమంతులకు ఆగ్రహం ఎప్పుడు వస్తుందో అనుగ్రహం ఎప్పుడు కలుగుతుందో ఎవరయినా ఇంతవరకూ చెప్ప గలిగారా ? కాని-సునందాదేవి అన్నమాట ఇంతవరకూ చెల్లించుకుంది. ఇంతవరకు ఆమె వాగ్దానం చేస్తే అయిందన్నమాటే. ఏ మాత్రం సందే హించవలసినపని లేదు.

"ఏం రేఖా! మాట్లాడవేం ?"

"చదువు చెప్పిస్తే చదువుకుంటానమ్మా !" జంకుతూనే జవా బిచ్చింది.

"మీ అమ్మనుకూడా ఒప్పించు. నీ మాట ఒక్కటే చాలదుగా?" సునందాదేవి కచ్చితమైన జవాబు కోరినట్టుగా అడిగింది.

తల్లి వైపు చూసింది రేఖ. మాణిక్యం తలవంచుకుని పైట చెంగులోని దారాలను లాగుతూ శూన్యంలోకి చూస్తున్నది.

"అమ్మా !" అన్నది రేఖ అదురుతున్న పెదవులతో.

"తల్లీ ! నా పరిస్థితులను బట్టి నేనొక పథకం వేసుకుని నిన్ను తీసుకుని పోవటానికి వచ్చాను. నీకింకా చదువుకోవాలన్న కోరిక ఉంటే సునందాదేవిగారు చదివిస్తానంటే మీ మధ్య నేను అడ్డుపడను. కాని- మన స్థితిగతులు ఆలోచిస్తే మాత్రం నీవు వెంటనే పెళ్లి చేసు కుంటేనే మంచిదని నా ఉద్దేశ్యము" తేల్చి చెప్పినట్టుగా అన్నది మాణిక్యం.

"మీ అమ్మ గట్టిగా రమ్మంటున్నది వెళ్లు రేఖా ! పై చదువు చదువుకుని బాగుపడతావని నేనన్నాను గాని- బలవంతం ఎలా చెయ్య

గలను ? మీరిద్దరూ బాగా ఆలోచించుకుని నాకు చెప్పండి" చివాలున లేచి తన గదిలోకి వెళ్లిపోయింది సునందాదేవి.

ఇద్దరి మధ్యా నిశ్శబ్దం కొంత సేపు సంచరించింది.

సునందాదేవి మధ్యలో లేచి వెళ్లటంతో రేఖకు ముందు చదువు పట్ల ఆసక్తి రెండింతలయినట్లయింది. ఈ సదవకాశాన్ని చేతులారా పోగొట్టుకోదలచలేదు

"అమ్మా ! నాలుగంటే నాలుగేళ్లు ఓపిక పట్టమ్మా. నీ కంతగా కామేశ్వరీదేవిగారి దగ్గర ఉండటం ఇష్టం లేకపోతే అన్నయ్య దగ్గరికి వెళ్లి ఉండు" ప్రాధేయపడ్డది రేఖ.

"ఈ వయసులో- ఈ పరిస్థితులలో నాకు కష్టమూ ఇష్టమూ అనేవి ఉన్నాయా ? అసలివి నా జీవితములో నేను చవి చూసి ఎరుగను. పరిస్థితుల వలలో చిక్కిన పిట్టను నేను. బాల్యమూ యౌవనమూ అలాగే గడిచాయి. ఈదశా అంతే" పెదవి విరుస్తూ అన్నది మాణిక్యం.

"నీమనసంత కష్టపెట్టుకోకు-కష్టపెట్టుకోవలసినంత క్లిష్ట పరిస్థితులు ఇప్పుడేమీ లేవు. నీవు నిశ్చింతగా ఉండు. తొందరపడితే తరువాత చింతించవలసి వస్తుంది. గడచిన రోజు మళ్లీ రాదు. చెయ్యిజారిన అవకాశం మళ్లీ చేతికి చిక్కదు" రేఖ కొంచెం విసురుగా అన్నది.

"అయితే సరే. నీ అదృష్టాన్ని నీ కున్న అవకాశాలనూ పాడు చేశానన్న పేరు నాకు వద్దు. రేపు పొద్దున్నే నేను వచ్చిన దారిన వెళ్తాను. ఈ నాలుగేళ్లల్లో మనము తిరిగి కలుసుకోలేకపోవచ్చు. నిన్ను సునందాదేవిగారు పంపరు. నన్ను కామేశ్వరీదేవిగారూ పంపరు. నేను మాటిమాటికీ ఉత్తరాలు వ్రాయటాన్ని సునందాదేవిగారు హర్షించరు. నీవే నీ క్షేమసమాచారం రాస్తూ ఉండు" మాణిక్యం ముఖమ్మీద నిర్లిప్తత పొడచూపింది.

తల్లి ముఖంలోకి చూసిన రేఖ మనసులో బాధపడినా తన మనో నిశ్చయాన్ని మాత్రం సడలించదలచక తన గదిని చేరుకున్నది.

ఆ రాత్రి భోజనంచేసి తమలపాకు సేవిస్తున్న సునందాదేవి రేఖ నిశ్చయాన్ని విని మందహాసం చేసింది.

"బాగుపడతావు" అన్నది రేఖ వైపు ఒక వింతచూపు చూస్తూ.

* * *

"మీ చదువుకు నేను అడ్డం రావటం లేదు కదా?"

"లేదు లేదు. మీరు రెండు రోజుల కొకసారయినా పైకి వచ్చి మమ్మల్ని పలకరించిపోతూ ఉండండి" లేచి నిలబడ్డది జోసఫిన్, సునందా దేవిని చూడగానే.

హాల్లో కిటికీకి దగ్గరగా ఉన్న బల్లకు చెరొకవైపు కుర్చీలు వేసుకుని కూర్చున్నారు గిరిబాబు జోసఫిన్‌లు.

"మీరెందుకు లేచారు? నేనిలా కూర్చుంటా"నని సునందాదేవి ఆ దగ్గరలో ఉన్న మరొక కుర్చీలో కూర్చున్నది.

"గిరిబాబుకు సంగీతంలో మంచి అభిరుచి ఉన్నది. పాటలు రాగంతో నేర్చుకుని నాతో కూడా పాడగల్గుతున్నాడు. ఒక ఆర్గన్ కొనిపెట్టాలి. మీరు ఫిడేలు కూడా పనిలో పనిగా కొనండి, మరొక సంగతి. ఇతడికి చిత్రకళలో కూడా మంచి అభిరుచి కలిగింది. దానికి తగిన ఏర్పాట్లు చెయ్యాలి. మనం కొన్న బైపు రైటర్ని బాగా ఉపయోగిస్తున్నాడు గిరిబాబు. స్పీడ్ కూడా హెచ్చింది". జోసఫిన్ ఒక్కొక్క విషయం చెబుతున్న కొద్దీ సునందాదేవి ఆశ్చర్యపోతున్నది.

"పిల్లవాడికి తెలివితేటలున్నాయి. ఒకసారి చెబితే వెంటనే గ్రహించే శక్తి ఉంది. లలిత కళలపట్ల సహజమైన-పుట్టుకతో వచ్చిన

అభిరుచీ నైపుణ్యమూ ఉంది. వాటిని మనము గ్రహించి వెలికితీసి దోహదమివ్వాలి" జోసఫిన్ టీచరుగా తన బాధ్యత అనుకుని చెప్పు కుంటూ పోతున్నది.

సునందాదేవికి ఆనందసాగరంలో మునకలు వేస్తున్నట్టుంది. జోస ఫిన్ వచ్చిన నాలుగేళ్లలో పిల్లవాడు చాలా ప్రగతిని సాధించాడు. కరె స్పాండెన్సు కోర్సులో బి.ఏ.కు గిరిబాబును తయారు చెయ్యాలని యూని వర్సిటీతో సంప్రతింపులు జరుపుతున్నది జోసఫిన్. తన కళ్ల ఎదుటనే ఇంట్లోనే ఉండి గిరిబాబునేర్వని విద్యలేదన్నట్టుగా అన్నివిద్యలూ లలితకళ లతో సహా కైవసం చేసుకుంటున్నాడు.

తాంబూలంచేత ఎరుపెక్కిన సునందాదేవి పెదవులమీద సంతోషం వెల్లువై ప్రవహించినట్టూ- దానిని అతికష్టమ్మీద నిగ్రహించుకున్నట్టూ చిహ్నాలు పొడచూపాయి.

కాని-అంతలోనే విచారరేఖలు ముఖమంతా అలుముకుపోయాయి.

ఎన్ని విద్యలు నేరిస్తే ఏం లాభం? తన బిడ్డ నలుగురితోపాటు బహి రంగంగా విహరించలేడు! నలుగురిలో తన ప్రజ్ఞలు చూపించలేడు! పది మందిలో తల ఎత్తుకొని తిరగలేడు!

ఆమె ఆలోచనలను జోసఫిన్ కనిపెట్టింది.

"మీరు అనవసరంగా బాధపడుతూ గిరిబాబును కూడా బాధ పెడు తున్నారు. ఇందులో అభిమానపడవలసిందీ - కించపడవలసిందీ ఏమీ లేదు. అతడి శారీరకమైన వైపరీత్యాన్ని కాదు మనం చూడవలసింది. అతడి మానసికమైన పెరుగుదలను గురించి మనం ఆలోచించాలి. అతడు మేధావి. అతడు వేసే ప్రశ్నలకు జవాబులు నా మనస్తత్వ శాస్త్ర గ్రంథాలలో కొన్ని కనబడటం లేదు. డబ్బు ఖర్చయినా అతడికి మీరు

కొనిపెట్టిన గ్రంథాలనన్నింటినీ క్షుణ్ణంగా చదివి తనకు కలిగిన సందేహాలను నాతో చెబుతూ ఉంటాడు".

సునందాదేవి ఆఁ ? అంటూ నోరు తెరిచింది.

"నా కంటె ముందు చదివించిన టీచరు మీ భాషను బాగా నేర్పించినట్టున్నారు. దానిని అభివృద్ధి చేయటం నా వల్లకాదు కదా ? కాని-నేను గిరిబాబు వద్ద మీ భాష మాట్లాడటం-కొద్దిగా వ్రాయటం నేర్చుకుంటున్నాను. ఉన్న మాట మరొకటి చెబుతున్నాను. మీ దేశీయులు ఆంగ్లభాష నేరుస్తారు. పండితులవుతారు. కాని ఉచ్చారణ మాత్రం స్వచ్ఛంగా ఉండదు. ఇతడు స్వచ్ఛమైన ఉచ్చారణతో ఇంగ్లీషు మాట్లాడగలడు".

సునందాదేవి తన ఆంగ్లభాష ఉచ్చారణను గురించిన పరిశీలన చేసుకుంటున్నది. అవునేమో ! ఎవరిలోపాలు వారికి తెలియవు కదా? తనకెంత ఆత్మ విశ్వాసం ఉండేది తన చదువుపట్ల సంస్కృతి పట్ల? జోసఫిన్ మాటల ప్రభావం గిరిబాబు మీద బాగా పడ్డదనుకున్నది సునందాదేవి. అతడికి సంస్కృతాంధ్ర భాషల్లో చక్కని విజ్ఞానాన్ని కలిగించాలి. తమ ఆస్థానంలో పండిత సన్మానాలు ఉన్నంతవరకూ పండితులు కంటికి కనబడుతూ ఉండేవారు. మరి ఇప్పుడు? కవి పండిత సన్మానాలు గోపాలకృష్ణరాయడు గృహత్యాగంతో తను మాను కున్నది. అందరి ఎదుట తన దురదృష్టం బయటపడి పోవటాన్ని ఆమె సహించలేదు.

సరిగ్గా పదిహేను రోజులక్రిందట ఒకనాడు ఆమె డాక్టరు సదాశివరావును పిలిపించింది.

"మీరు అనుమతిస్తే నేను ఒకపని చేయాలనుకుంటున్నాను. ఎంతకాలం నుంచో నేను ఈ అవకాశం కొరకు ఎదురుచూస్తు

న్నాను. ఏమంటారు ?" అడిగాడు సునందాదేవి ఆయన ముందుంచిన బ్రూకాఫీ తాగుతూ.

ఏమిటన్నట్టు చూసిందామె కనుబొమలు పైకెత్తి.

"హైదరాబాదులో జరిగే మెడికల్ కాన్ఫరెన్సుకు ముగ్గురు వైద్య నిపుణులు వస్తున్నారు. ఒకరు విండొక్రైనాలజిస్టు. రెండవవారు న్యూరో సర్జన్, మూడవ ఆయన న్యూరాలజిస్టు. ఈ ముగ్గురుకూడా అంతర్జాతీయంగా ప్రఖ్యాతి గలవారు. వాళ్లను నేను కారులో ఇక్కడికి తీసుకువచ్చి గిరిబాబును చూపించి తిరిగి వాళ్ళను హైదరాబాదుకు చేర్చే ఏర్పాటు చేస్తాను. అందుకు మీరు అనుమతించి సహకరిస్తే మనకు మంచి నిపుణుల సలహా లభిస్తుంది" అన్నాడు ఆమెవైపు ఆశగా చూస్తూ.

"ఆ నిపుణులు ఇంతదూరం వస్తారా ?" సందేహించింది సునందా దేవి.

"ఎందుకు రారు ? వారంతా నా స్నేహితులు. నా అదృష్టం వక్రించి ఈ ఊళ్లో ఉండిపోయాను. వాళ్లకు మంచి అవకాశాలు లభించాయి. వాటిని ఉపయోగించుకుని లాభం పొందారు. విదేశాలలో పరిశోధనలు చేశారు. డిగ్రీలపైన డిగ్రీలందుకున్నారు. తమ వాళ్లంద రినీ చూసినట్టుందని ఈ కాన్ఫరెన్సుకు ఆహ్వానం పోగానే అంగీకరించి వస్తున్నారు. నేను ఈ కేసు విషయంలో వాళ్లను సంప్రతించి తీసుకు వస్తాను. అసలు పరిశోధకుల కేమి- డాక్టర్లకేమి ఒక అసాధారణ విష యమేదయినా కంటికి కనుపిస్తే లేక తెలిస్తే వెళ్లి చూడాలన్న కుతూహలం సామాన్యంగా పుడుతుంది కదా! మీరు సందేహించకండి. ఆ భారం నా పైన పెట్టండి. నేను తీసుకువస్తానుగా!" నమ్మకంగా నెమ్మదిగా ఆమెతో చెబుతున్నాడు డాక్టరు.

అసాధారణం ! కుతూహలం !

ఈ రెండు మాటలు చెవిన పడగానే గుండె కలకబారింది. కళ్లు నీటికుండలయ్యాయి వెంటనే అభిమానం తలెత్తింది. తన కుమారుడి పట్ల వాళ్లకు సానుభూతి లేదు. కాని-కుతూహలం ఉంది. ఎంత క్రూరం? భరించలేక కళ్ళు మూసుకుంది. కన్నీటి బిందువులు చెంపల మీదుగా జాలువారాయి. బాధకొద్దీ తల అడ్డంగా తిప్పింది.

ఆమె పరిస్థితి గ్రహించాడు డాక్టరు. వైద్యంతోపాటు వైద్యులు మనస్తత్వ శాస్త్రాన్నికూడా రోగులపైన ప్రయోగించి చూస్తారు. అందులో శ్రీమంతుల ఇళ్లల్లో వైద్యం చేయాలంటే మనస్తత్వ శాస్త్రమే ఎక్కువగా ఉపకరించి మంచి ఫలితాలను ఇస్తుంది. డాక్టరు సదాశివరావు పరీక్షలలో అపజయం పొందుతూ ఆలస్యంగా కోర్సు పూర్తి చేసినా మానసనైజాన్ని బాగా కాచి వడపోసిన వాడు.

"మీ ఆంతర్యాన్ని నేను గ్రహించగలిగాను. మీ సమస్యను తీర్చగలిగిన శక్తి వాళ్ళకు ఉన్నదా లేదా? అంతర్జాతీయంగా కీర్తిగల వాళ్ళమని ఊరికే డబ్బా వాయించుకుంటున్నారా? ఇది తెలుసుకుందామన్న కుతూహలం కంటె వాళ్ళ అనుభవ పూర్వకమయిన సలహా మీకిప్పిద్దామన్న ఆశే నా కధికంగా ఉంది. నాకు తోచనిది వాళ్ళకు తోచవచ్చుకదా. సెకండ్ ఒపినియన్ తీసుకోవటము మా సంప్రదాయమే" చాలా నమ్రతతో ఆమెకు నమ్మకం కలిగించేటట్టుగా అన్నాడు.

సునందాదేవి ఆ మాటలకు మెత్తపడ్డది. "మీరింతగా చెబుతున్నారు కనుక నేనందుకు అంగీకరిస్తున్నాను - అదీ ఒక షరతుపైన. రోగిని పరీక్షచేసినట్టు వాళ్ళు గిరిబాబును పరీక్ష చెయ్యకూడదు. వాళ్ళందరూ తనను చూడటానికే వస్తున్నారని గిరిబాబుకు తెలియకుండా చెయ్యాలి. మీరు వెంబడి పెట్టుకువస్తే వాడు గ్రహించేస్తాడు. మీరెలా వస్తారో ఆలోచించండి" అన్నది అధికారపూర్వకంగా.

ఆలోచనలో పడిపోయాడు డాక్టరు. ఆ ఊరిలో ఆయన ప్రైవేటు ప్రాక్టీసుకు ఆమె సహాయ సహకారాలెక్కువ. శ్రీమంతులకు అన్నిటిలో అధికారము లభిస్తే ఎట్లా ఉంటుందో చవి చూసినట్లని పించింది.

కొంత సేపటికి సరే అన్నాడు. ఇంతదూరమూ చర్చించి వైద్య మంటే ఏమీ తెలియని ఆమె ముందర తల ఒంచదలచలేదు.

డాక్టరు వెళ్ళటానికి లేస్తూ ఉండగా "డాక్టరు గారూ! మా కారు పెద్దది. పదిమందయినా కూర్చోవచ్చు మంచి కండిషన్‌లో ఉంది. కనుక మీరు ఆ కారు తీసుకువెళ్ళండి మీరు వచ్చేసరికి నేను భోజనం ఏర్పాట్లు చేస్తాను. వాళ్ళను భోజనాల వేళకు తీసుకురండి" అంతలో డాక్టరికి ఆశ్చర్యం కలిగేటట్టుగా శాంతం వహించి జమీందారిణికుండే సహజమైన వితరణ బుద్ధితో అన్నది సునందాదేవి.

ఆ సాయంకాలం డాక్టరు కారులో వెళ్లాడు. మరునాడు మధ్యాహ్నం ఒ టిగంటవరకూ ముగ్గురు వైద్య నిపుణులతో డాక్టరు సదాశివ రావు దేవిడీ ముందర దిగాడు.

డాక్టరు దారి పొడుగునా ఆలోచించిన విధంగా సునందాదేవితో చెప్పాడు; తాను కిందనే ఉంటాడనీ-వచ్చిన ముగ్గురు వైద్యనిపుణులూ జోసఫిన్ స్నేహితులుగా గిరిబాబుకు పరిచయం చేయవలసినదనీ- ఈ సంగతి ముందుగా జోసఫిన్‌కు తెలియజేయవలసినదనీను.

సునందాదేవికి ఈ ఉపాయము నచ్చింది. జోసఫిన్‌తో సంగతంతా చెప్పింది. విందు భోజనం పైననే ఏర్పాటు చేసింది.

అంతకుముందే షరతులన్నీ సదాశివరావు ద్వారా విన్నందువల్ల ముగ్గురు వైద్య నిపుణులూ అందుకు తగినట్టే గిరిబాబుతో కబుర్లు చెబుతూ-జోసఫిన్ను కుశల ప్రశ్నలు వేస్తూ పందారగిస్తూ అతడిని గమ

నిస్తున్నారు. మొట్టమొదట జోసఫిన్ గిరిబాబును పరిచయం చేయగానే
షేక్ హేండిస్తూ చర్మపరీక్ష ముట్టుకుని చూశారు.

అతడి కాస్థితి ఎందుకు వచ్చినట్టు ?

హీన పోషకాహారంవల్ల వచ్చిందనుకుందామా ? డాక్టరు సదాశివరావు
గిరిబాబు పుట్టినప్పటినుంచీ తీసుకుంటున్న ఆహారాన్ని గురించి వివరంగా
ముందుగానే చెప్పాడు. పైగా ఆ లక్షణాలు కనబడటం లేదు పిల్లవాడిలో.
కనుక ఆ కారణంకాదు. ఇతర కారణాలేమిటో వెదకాలి. వాళ్ళకు
తోచిన కారణాలవల్ల అయినట్లయితే గిరిబాబు ఇంతటి మేధావిగా ఉండ
టానికి వీలులేదు. అది అసంభవము. అతడికి వయసువల్ల ముఖం
ముదిరినట్టు కనబడుతున్నది అతడి వయసుకు తగినట్టుగా కాక-అతడి
ఎత్తుకు తగినట్టుగా అవయవ నిర్మాణమున్నది. చర్మము మృదువుగా
కాక బిరుసుగా ఉంది.

నవ్వులతో కబుర్లతో భోజనాలు ముగిశాయి. అందరూ కిందికి
దిగి వచ్చారు. ఏం చెప్పనున్నారో ననుకుంటూ సునందాదేవి తన
సహజకుతూహలాన్ని పైకి కనబడనీయకుండా ఎదురుచూస్తున్నది.

సదాశివరావు భుజంపైన చెయ్యివేస్తూ "దీనికి మెదడులో పిట్యూ
టరీ గ్లాండ్ తన విధిని సక్రమంగా నెరవేర్చలేకపోవటమే కారణంగాని
మరొకటి కాదు. దానిని బాల్యం నుంచీ గమనించి తగిన వైద్యం చేస్తే
ఈ పరిస్థితి కలిగేది కాదేమో ? కాని-బాల్యంలో దీన్ని తెలుసుకోవటం
కష్టం". అన్నాడు ఎండొక్రైనాలజిస్టు. మిగతా ఇద్దరూ తలలూపారు.

చివ్వున తలెత్తి చూసింది సునందాదేవి. కళ్ళల్లో నీటిపొర తేలి
యాడింది. "అయితే ఇప్పుడు చేయగలిగింది ఏమయినా ఉందా ?"
దీనంగా ఉంది ఆమె ముఖం.

కథా నిలయం
864
శ్రీకాకుళం

"ఇప్పుడు మనమేమీ చెయ్యలేము. కాని-ఇప్పుడు అతడికి లోప మేమున్నది ? బాగా చదువుతున్నాడు. మహాచురుకుగా ఉన్నాడు. తెలివితేటలూ వివేకమూ మేధ గలవాడు. వయసుకు తగిన పొడుగు లేడు అంతేగా ?" అన్నాడు న్యూరాలజిస్టు.

ఆమె ఇంక పట్టలేకపోయింది. "అయ్యో ! నా దురదృష్టాన్ని మీకెలా చెప్పను ?" అంటూ కన్నీళ్లు కారుస్తూ తన పరిస్థితంతా ఏకరువు పెట్టింది. తనను పీడిస్తున్న సందేహాన్ని తీర్చుకోవటంకోసం "గిరి బాబుకు పెళ్లి చెయ్యవచ్చునా ? అడిగి నాలుక కరచుకున్నది.

"ఓ ! దానికేం ? తప్పకుండా పెళ్లి చేయండి. సంతానం కూడా కలగవచ్చు" ముగ్గురూ ఒక్కసారే అన్నారు.

సునందాదేవికి మనసులో ఉన్న ఆలజడి కొంతవరకూ తగ్గింది. వాళ్లను సోఫాలలో కూర్చోమని చెప్పి కాఫీ తయారు చేయించి తెప్పించింది. వాళ్ళను తన కారులోనే పంపుతూ ఇంతదూరం వచ్చి నందుకు కృతజ్ఞతలు తెలిపింది. కారు కనుచూపుమేర దాటేవరకూ మెట్ల మీదనే నిలబడ్డది.

వాళ్ళు వెళ్ళగానే ఆమె కెదురయిన ప్రశ్న "గిరిబాబుకు పెళ్లి ఎట్లా అవుతుంది ?"

ఈ ప్రశ్న పదిహేనురోజుల క్రిందట ఉదయించిందే కాని-ఇప్పుడు వెయ్యిరెట్లు అధికంగా బాధించటం మొదలుపెట్టింది. ఆ రాత్రంతంగా సునందాదేవి ఈ విషయాన్ని గురించి ఆలోచిస్తూనే ఉన్నది. తెల్లవారే సరికి ఒక పరిష్కారమార్గం లభించినట్టుగా ప్రశాంతతను పొందింది.

ఉదయం లేవగానే ముత్తిచేత కబురు పంపించి రేఖను తన గది లోకి పిలిపించుకున్నది.

"రేఖా! ఇవాళ శుక్రవారము. తలంటి నీళ్ళు పోసుకుని కొత్త చీర కట్టుకో. దేవాలయానికి వెళ్ళి స్వామిదర్శనం చేసుకుని కొబ్బరి కాయ కొట్టి వద్దాము. చూడు ఇవాళ్టి నుంచీ నీవు నా గదిపక్కన ఉన్న గదిలో ఉండు. ఈడు వచ్చిన పిల్లవు. ఎక్కడో దూరంగా యాదమ్మ గదిలో ఉండటం నాకు బాగుండలేదు" అన్నది ఎంతో ఆప్యాయంగా.

రెండు గుడ్లూ ఒప్పగించి నిలబడిపోయింది రేఖ ఆశ్చర్యంతో.

*　　　*　　　*

అప్పుడే కాలేజీలో అడుగుపెట్టిన రేఖను చూడగానే దయయంతి కళ్ళు గుండ్రంగా తిప్పుతూ "ఓహో" అన్నది.

"ఏమోయ్ రేఖా! ఏమిటి విశేషం? ఇవాళ ఈ వేషంలో వచ్చావు? మీ అమ్మగారు కొత్త చీరెలు కొని పంపించారా?" అన్నది కామాక్షి. రేఖ తల్లి పరిస్థితులెటువంటివో కామాక్షికి బాగా తెలుసు. అయినా నిజమేమిటో చెప్పించాలని ఒక బాణం విసిరింది.

రేఖ మనసు ఉడికినట్లయింది. తన పరిస్థితులు తెలిసే వాళ్ళిద్దరూ అలా అంటున్నారని గ్రహించింది. కన్నీళ్ళు రాలబోతుంటే అణుచుకుంటూ అన్నది- "నాకు కన్నీళ్ళు తెప్పించారు. మీ సరదా తీరిందా? ఇంకా ఉందా?" జాలి గొలుపుతున్న చూపులతో ఇద్దరినీ పోనీయకుండా చేతులతో ఆపింది.

"చీరె చూడటానికి బాగుంది. ఈ చీరె కట్టుకున్న నీవు ఇంకా అందంగా ఉన్నావు స్నేహం కొద్దీ సరదాకు అంటే అప్పుడే కన్నీరు కార్చాలా?" వీపుమీద తట్టింది కామాక్షి.

"ఎట్లాగూ అడిగి చెడ్డవాళ్ళమనిపించుకున్నాం గాని- ఎక్కడిది చెప్పమ్మా?" అన్నది దమయంతి.

"సునందాదేవి గారిచ్చారు" అన్నది తలవంచుకుని రేఖ.

"అవునులే. కాలేజీకి పంపుతూ ఈ మాత్రం చీరెలయినా కొని పెట్టకపోతే ఎలా ? ఎలాగయినా పెద్ద యింటినుంచి వస్తున్నావు కనుక ఆ యింట గౌరవానికి తగినట్టుగా ఉండాలి కదా అన్నీ ?" మళ్లీ అందుకున్నది దమయంతి-కామాక్షి వద్దని కళ్లతో సైగచేసినా లెక్కచెయ్యకుండా.

ముగ్గురూ బస్సులో పొరుగూరు వెళ్లి కాలేజి చదువు చదువుతున్నారు. చదువుకోవటం తప్ప మిగతా ఆలోచనలకు రేఖ తన మనసులో జొరబడకుండా జాగ్రత్త పడుతున్నది. దమయంతి కామాక్షిల మాదిరిగా సరదాలకూ వినోదాలకూ చోటివ్వటం లేదు. ఇరవై నాలుగు గంటలూ తాను చదువుకోసమే ఆ ఊరిలో - ఆ ఇంట్లో ఉంటున్నదన్న విషయాన్ని మనసులో పెట్టుకునే మసలుకుంటున్నది.

కాలేజీలో మామూలుగా ఉండే విద్యార్థినీ సంఘాలు - వాటి ఎన్నికలు - వాటి సాంస్కృతిక కార్యక్రమాలు మొదట రేఖను ఆకర్షించలేదు. కాని- విద్యార్థినులు రేఖను విడిచిపెట్టలేదు. నాటకాలు వేయటానికి రమ్మనీ, వ్యాస పోటీలలో వక్తృత్వ పోటీలలో పాల్గొనమనీ, పాటలు పాడమనీ వేధించటం మొదలుపెట్టారు. అంతమంది విద్యార్థినులు ఏకమై ఒత్తిడి చేస్తుంటే ఒప్పుకోక తప్పింది కాదు రేఖకు. ఉపాధ్యాయినుల ఆజ్ఞలను మీరలేకపోయింది. ఆ కళాశాలలో ఒక అధ్యాపకురాలు లలిత సంగీతంలో నిధి. విద్యార్థినులు చాలామంది ఆమెవద్ద ప్రైవేటుగా శిక్షణ పొందటం మొదలుపెట్టారు. శాస్త్రీయ సంగీతం కొంత వచ్చిన రేఖకు లలిత సంగీతం కష్టమనిపించలేదు. వార్షికోత్సవాలలో రాణి సంయుక్త నాటక ప్రదర్శనలో రేఖ రాణి సంయుక్త పాత్రకు ఎన్నికయింది. ప్రేమ వివాహాలు మంచివా లేక పెద్దలు ఏర్పాటు

చేసిన వివాహాలు మంచివా అన్న విషయం పైన వక్తృత్వ పోటీలో పాల్గొనటానికి విద్యార్థినీ వర్గంతోపాటు ఉపాధ్యాయవర్గం కూడా రేఖను ఎన్నిక చేశాయి. బలవంతం మీ్మద ఎన్నికయిన రేఖ తన శక్త్యనుసారం కృషి చేయక తప్పలేదు

స్కూలులో గడిచినట్టుగా కాలేజిలో రోజులు భారంగా గడవటం లేదు రేఖకు. దేనిలోనో ఒకదానిలో పోటీ-దానిలో ఎవరో ఒకరు బలవంతంగా చేర్పటం-రేఖ గెలుపొందటం జరుగుతోంది. దానివల్ల సహజంగా ఉత్సాహం పెంపొందటం మొదలు పెట్టింది రేఖలో. నలుగురితో పాటు నవ్వటం-నలుగురిలో ముఖం ముడుచుకొని కూర్చోకుండా వినోదకాలక్షేపం చేయటం క్రమంగా రేఖకు అలవాటు కాసాగింది. ఇప్పుడు దమయంతీ కామాక్షులకు తానే ఆటలు పట్టించేవరకూ వచ్చింది.

కాలేజి చదువులో ప్రవేశించి చూస్తూ చూస్తూ ఉండగానే మూడవ సంవత్సరం ఆరంభమయింది.

రేఖలో కలుగుతూ వచ్చిన నూతనోత్సాహాన్నీ, క్రమవికాసాన్నీ సునందాదేవి గ్రహించింది. రేఖకు తెలియకుండా ఆమె చదువును గురించీ మిగతా విషయాలను గురించీ మంజరీదేవి రిపోర్టులను తెప్పించుకుంటూనే ఉన్నది. అప్పుడప్పుడు రేఖ కాలేజినుంచి రాగానే ఆమెను పలకరించి మాట్లాడించాలన్న ఉద్దేశ్యంతో సంభాషణలోకి దింపి, కాలేజి కబుర్లు అడుగుతూ ఉంటుంది. ఇద్దరిమధ్యా కొద్దిగా చనువు ఏర్పడటము ఆ దేవిడీ నౌకర్లను కూడా ఆశ్చర్య పరుస్తున్నది. అయినా రేఖ కాలేజి నుంచి రాగానే తన గదిలో తలుపులు తీసుకుని కుట్టుపని చేస్తూనో చదువుకుంటూనో కాలక్షేపం చేస్తుంది.

"మమ్మల్ని ఒక్కసారయినా మీ యింటికి రమ్మని పిలవవెందుకు రేఖా?" దమయంతికి ఆరోజు విరామం దొరికింది రేఖను ఏడ్పించటానికి.

గంభీరంగా ఉన్న రేఖ అదొకమాదిరిగా ఆమె ముఖంలోకి చూసి మందహాసం చేసింది.

"మీ దేవిడీలో ఉండే చిత్రపటాలూ బొమ్మలూ అందమైన వస్తువులూ మాకు చూపించవా ? మంచి పూలతోట ఉన్నదని విన్నాము. ఒకపక్క ఈతకొలను ఉన్నదట. ఈ ఆదివారం శకుంతలనూ రమనూ కూడా తీసుకురా మా దేవిడీకి ? అన్నీ చూపిస్తావుకదూ?" ముద్దు ఉడి గింది దమయంతి .

"అవన్నీ నాకే తెలియవు. ఇంతవరకూ ఆగది తప్ప నేనేదీ చూడ లేదు. ఇంక మీకేం చూపించను ?" మాట తప్పించాలని చూసింది రేఖ.

"కాదులే. మాకవన్నీ చూపించటం ఇష్టంలేదనరాదూ ? ఎంతయినా నీవు మాతో కలియని రేఖవే!"

"అంటే ?" కళ్లు పెద్దవిచేసి చూసింది రేఖ.

"అంటేనా ? కొంటే ! రేఖంటే గీత. వంకరలేని నిడుపైన గీత. అటూ ఇటూ వంగని కడ్డీ. "వెక్కిరించింది దమయంతి. అంతలో మరో పదిమంది వచ్చి చేరారు. దమయంతి మాటను ఆ పదిమంది బలపరచారు.

రేఖ ఎంత తప్పించుకోవాలని చూసినా లాభంలేకపోయింది.

"ఒక షరతు. ఆ దేవిడీలో ఏమేమున్నిదో నన్ను ముందునుచూడ నీయండి. నేను చూసిన తరువాత సునందాదేవి గారిని అడిగి మిమ్మల్ని తీసుకువెళ్తాను. ఆమె ఇష్టపడకపోతే మాత్రం నన్ను నిందించకండి.

"నీకే అభ్యంతరం ఉంటుంది గాని ఆమెకు ఉండ దనుకుంటాను. అంతే కదూ?" భుజమ్మీద చెయ్యివేస్తూ అడిగింది శకుంతల.

"యజమానురాలిని అడగవద్దా ? నా శక్తికి మించి నేను వాగ్దానాలు చెయ్యను. మీకు కోపము వచ్చినాసరే నేను మీ అందరి మాదిరిగా తల్లి దండ్రుల దగ్గర ఉండి అధికార పూర్వకంగా ఆదరణలతో బ్రతుకు తున్నాననుకుంటున్నారా ? యజమానురాలి దానదయా భిక్షంతో చదువుకుంటున్నాను. వారింట ఉంటున్నాను. ఇంతకంటె నాచేత ఏమీ

చెప్పించకండి." చిన్నబోయిన ముఖంతో తలపక్కకు తిప్పుకుంటూ అన్నది రేఖ.

"పోనీలేవోయ్! నీకంత కష్టంగా ఉంటే వద్దులే. రండర్రా పోదాం. ఊరికే రేఖ వెంబడి పడుతున్నారేమిటి అందరూ?" అప్పుడే అక్కడికి వచ్చిన కామాక్షి అందరినీ వారించింది.

"ఇందులో తప్పేముంది? చూపించమని అడిగితేనే తప్పా?" మూతి మూడు వంకరలు తిప్పింది రమ.

ఇది జరిగి పదిరోజులయింది. రేఖ అటువంటి ప్రయత్నమేమీ చెయ్యలేక పోయింది.

భోజనాలు చేసే హాలుకు పక్కగా పూజగది ఉంది. మంజరీదేవి ఆగదిలో ఉన్న దేవుడి పటాలకూ విగ్రహాలకూ ప్రతి శుక్రవారమూ పూలదండలు మార్చి కొత్త వాటితో అలంకరిస్తూ ఉంటుంది. ఈ పూల దండలు కట్టేపని ముత్తిది. కాని-ఈ మధ్య ఆమె ఆరోగ్యం చెడటం వల్ల యాదమ్మ చేస్తున్నది.

ఆ శుక్రవారం నాడు కృష్ణాష్టమి కలిసి వచ్చింది. సునందాదేవి సూర్యోదయానికి పూర్వమే తలార స్నానం చేసి కొబ్బరికాయలూ మందారపుష్పాలూ తీసుకుని కారులో దేవాలయానికి వెళ్లుతూ దండలు కట్టమని యాదమ్మకు చెప్పింది. యాదమ్మ పూలు కొయ్యటానికి వెళ్లు తుంటే రేఖకూడా ఒక చిన్న బుట్ట తీసుకుని తోటలోకి వెళ్ళింది. రకరకాల పూలు-రంగురంగులపూలు కోసి బుట్టనింపుతూ పోయింది. ఇంకా ముందుకు వెళ్లి నందివర్ధనం పూలు కోయాలని మెల్లగా దేవిడీకి దక్షిణభాగం వైపుగా ఉన్న చెట్ల దగ్గరికి వెళ్లింది. పూలు కనబడుతున్న కొద్దీ ఇంకా ఇంకా కొయ్యాలనే ఆశతో తొందర తొందరగా కోస్తున్నది.

ఎక్కడి నుంచో పాటలు వినబడుతున్నాయి.

అటూ ఇటూ చూపి తలపై కెత్తింది రేఖ.

ఒక ఆడగొంతు-ఒకమగ గొంతు కలిసిపాడుతున్న ఇంగ్లీషుపాట మధ్య మధ్య పియానో వాద్యం!

అక్కడే నిలబడి తన్మయురాలై వినటం మొదలు పెట్టింది.

"రేఖమ్మా! ఓ రేఖమ్మా!"

యాదమ్మ పిలుపుతో ఉలిక్కిపడ్డది రేఖ. బుట్టతీసుకుని గబగబా అడుగులు వేస్తూ గదిని చేరుకున్నది.

"దొరసాని వచ్చేవేళయింది. తొందరగా దండలు గుచ్చాలి" యాదమ్మ తొందరపడుతున్నది.

"నేను గుచ్చిపెడతాలే. కోప్పడకు" పళ్లెంనిండా పూలు పోసుకొని దారంతో మాలలు కడుతూ, కొంతసేపు అడగనావద్దా అని మధనపడిన రేఖ "యాదమ్మా" అని పిలిచింది మెల్లగా.

"దొరసాని వస్తుంది. తొందరగా కట్టు" అన్నది సన్నగా యాదమ్మ.

"దండలు కడుతున్నాలే. నీకంటె తొందరగానే కడతాగాని-నేనొక మాట అడుగుతాను. చెబుతావా? ఏమనుకోవుకద?"

ఏమిటన్నట్టు చూసింది యాదమ్మ.

"మేడమీద ఎవరున్నారు? సంగీతం వినబడుతున్నది?"

గతుక్కు మన్నది యాదమ్మ. "ఈపూలు ఎక్కడినుంచి కోసుకు వచ్చావు?" భయంతో కళ్లు పెద్దవి చేసి కనుబొమ్మలు పైకెత్తింది యాదమ్మ.

"అటువైపు-అంటే ఎడమచేతి వైపుగావెళ్లి ఈనందివర్ధన పూలన్నీ

క్రోశాను. మరి ఇటు వైపు చాలా లేవు కదా?" గబగబా దండలు కట్టి చూపించింది రేఖ.

"ఎడమ చేతి వైపుకు ఎందుకు వెళ్లావు? దొరసానికి తెలిసిందంటే పీక నులిపేస్తుంది ఏమనుకుంటున్నావో? బెదరించింది యాదమ్మ.

"నాకాసంగతి తెలియదు యాదమ్మా! నీవైనా అటువెళ్లద్దని చెప్ప లేదు. అటు వెళ్లకూడదా?" భయపడుతూ అడిగింది రేఖ.

"వెళ్లకూడదు. దొరసాని ఆజ్ఞ" ఇంచు మించుగా గర్జించింది యాదమ్మ.

ముఖం చిన్న బుచ్చుకొని దండలు కట్టి పళ్లెంలో చుట్టలు చుట్ట లుగా అమర్చింది రేఖ.

రాత్రిళ్లు గది తలుపులు లోపలి గొళ్లెంపెట్టుకుని పడుకుంటారు యాదమ్మ రేఖా. పడుకోబోతూ మెల్లగా అడిగింది రేఖ-"యాదమ్మా! మేడమీద ఎవరుంటారో చెప్పవా చాలా బాగా పాడుతున్నారు. ఆ సంగీతం వింటే వా ప్రాణం లేచివచ్చి నట్లయింది. ఎంతో బాగుంది. ఎవరున్నారో చెప్పవా?" బ్రతిమిలాడుతూ అడిగింది.

"మనకెందుకు రేఖమ్మా ఆ సంగతులన్నీ? మన మానాన మనం పనులు చేసుకోవాలిగాని-అవన్నీ ఎందుకు మనకు?" ముసుగు పెట్టుకుని పక్కకు తిరిగి పడుకుంది యాదమ్మ.

కుతూహలం రేఖను పడుకోనివ్వలేదు. మంచమ్మీద లేచి కూర్చుని "యాదమ్మా! చెప్పవూ?" మళ్లీ అడిగింది.

యాదమ్మ కళ్లు నులుపుకుంటూ లేచి కూర్చుంది. "మేడమీద దొరసాని కొడుకు ఉంటాడు. ఇంక పడుకో" అని తిరిగి ముసుగు పెట్ట బోయింది.

"ఆడగొంతుక కూడా వినబడ్డదే? ఆమె ఎవరు? ఆయనకు పెళ్లి అయిందా?"

"ఆయనకు పెళ్లా? ఎంత ఉంటాడో తెలుసా? మూరెడు! ఆమె ఆయన టీచరు. ఇంగ్లీషు దొరసాని" ముసుగు పెట్టుకుంది యాదమ్మ. మళ్లీ అంతలోకే ముసుగుదీసి "చూడు రేఖమ్మా ఎవరితోనయినా అనేవు సుమా! ఏమీ తెలియనట్టే ఉండాలి. ఏమనుకున్నావో?" కళ్లుమూసుకుంది.

వాళ్లనెప్పుడైనా చూడాలి. మూరెడు మనుష్యులుంటారా ఎక్కడైనా? ఊరికే తోటంతా ఇల్లంతా తిరగకుండా యాదమ్మ భయపెడుతున్నదేమో? లేక-ఉన్నాడేమో? చూస్తే? ఎవరూ చూడకుండా మళ్లీ ఒక్కసారి దక్షిణపు దిశగా ఉన్న తోటలోకి వెళ్లాలి అనుకుంటూ నిద్రలోకి జారుకున్నది రేఖ.

*　　　*　　　*

ఆదివారం ఉదయం పదిగంటల వేళ - మార్చి నెల ఎండలను ప్రజానీకానికి చవి చూపిస్తున్నది. రేఖ పరీక్షలకు దీక్షగా చదువుతున్నది. అప్పటికి స్నానం చేసి తలవెంట్రుకలు రిబ్బనుతో బంధించుకుని కిటికీ దగ్గరగా కూర్చున్నది. దేవిడీ చుట్టూ పెద్ద పెద్ద చెట్లు ఉండటంచేత చల్లగా ఉన్నది. పిల్లగాలులు అప్పుడప్పుడు వచ్చి రేఖను పలకరించి పోతున్నాయి. రేఖ పుస్తకం చేత బట్టిందంటే తానాపూట పూర్తిచేయ దలచుకున్న భాగాలను క్షుణ్ణంగా చదివిగాని కూర్చున్న చోటినుండి లేవదు. అప్పటికి రెండు పేజీలు మాత్రమే మిగిలాయి చదవటానికి.

అయిదారు మాసాలనుండి సునందాదేవి ఉదయం పదిగంటల నుండి పన్నెండు గంటల వరకూ దేవాలయంలో పూజచేసే అర్చకుడిని ఇంటికి పిలిపించుకుని భాగవతము చదివించుకుంటున్నది. ఈ భాగవత కథా కాల

క్షేపము పూజగదిలోనే జరుగుతున్నది. రామానుజాచార్యులు దేవిడీలో ప్రవేశిస్తూనే శ్రీ రామానుజాయనమః అంటాడు. అదివిని సునందాదేవి గదిలో నుంచి బయటకివచ్చి ఆయనకుచేతులు జోడించి లోపలికి తీసుకువెళ్లుతుంది.

సునందాదేవి పూజగదిలో ప్రవేశించే సమయానికి సరిగ్గా రేఖ చదవదలచుకున్న అధ్యాయము పూర్తిచేసింది. ఒకసారి ఒళ్లు విరుచుకుని ఆ బల్ల మీద ఆ పుస్తకాన్ని పడేసి గదిలో అటూ ఇటూ పచారుచేసింది.

రేఖను మళ్లీ గతరాత్రి కలిగిన కుతూహలం మనసులో అలజడి మాదిరిగా రేగింది. కుర్చీలో కూర్చున్నదల్లా చివ్వున లేచింది. కాళ్లకు చెప్పులు వేసుకుని గది తలుపులు చేరవేసి తిన్నగా దక్షిణపు వైపుగా ఉన్న పూలతోటలోకి మెల్లగా అడుగులు వేసుకుంటూ వెళ్లింది. దక్షిణపు వైపున ఆ దేవిడీకి రెండు కొబ్బరి చెట్ల మధ్యవున్న విశాలమైన మెట్లు-వాటిమీద రంగు రంగుల క్రోటన్ మొక్కల కుండీలు వరసగా పైనుంచి కిందవరకూ రెండుపక్కలా పెట్టి ఉన్నాయి. ఆమెట్లు ప్రతిరోజూ కడిగి ముగ్గులేస్తున్న గుర్తులు స్పష్టంగా కనబడుతున్నాయి. ఒక విశాలమైన ఎత్తైన వరండాకు అవి మెట్లు. ఆవరెండాలో నుంచి లోపలికి వెళ్లటానికి ఒక అందమైన రెక్కలు గల దర్వాజా-మేడమీదికి వెళ్లటానికి మెట్లూ ఉన్నాయి.

రేఖ వచ్చేటప్పుడు చేతబట్టుకుని వచ్చిన పుస్తకాన్ని ఒక చెట్టు చాటుకు కూర్చుని, పేజీలు తిప్పుతున్నది. కాని-ఆనాడామెకు ఎదురు చూసిన సంగీతము గాని వాద్యంగాని వినబడలేదు. ఇంక ఆనాటికి వినబడదేమో ననుకుంటుంబగా పెద్ద కారొకటి వచ్చి మెట్ల దగ్గర నిలిచింది. డ్రైవరు హారన్ మోగించాడు వచ్చినట్టుగా.

తాను కనబడకుండా రేఖ చెట్టుచాటున ఒదిగి కూర్చున్నది. కాని అదే చూస్తున్నది.

పెద్దశబ్దంతో వరండా తలుపులు తెరుచుకున్నాయి. వంటమనిషి

రెండు పెద్దపెద్ద బుట్టలు డ్రైవరు కందించాడు. అతడు వాటిని కారు డిక్కీలో సర్ది, కారు తలుపులు తెరచి పట్టుకుని నిలబడ్డాడు.

అయిదు నిమిషాల తరవాత ఇంగ్లీషులో మాట్లాడుకుంటూ పైనుంచి కిందికి దిగి వరండా దాటి మెట్లమీదికి వచ్చి నిలబడ్డారిద్దరు.

డ్రైవరు రహ్మాన్ ఆఇద్దరికీ సలామ్ చేశాడు.

రేఖ ఆయిద్దరినీ కనురెప్ప లార్పకుండా చూసింది.

అతడు చాలా చిన్నపిల్లవాడిలా ఉన్నాడు. ఐదు సంవత్సరాల పిల్లవాడిగా ఊహించుకుంది రేఖ. ప్యాంటు-దానిపైన బుష్‌షర్టూ-ఎడమ ప్రక్కన పాపిడి గల క్రాపూ-కళ్లకు నల్లరంగు అద్దాలూ-కాళ్లకు మెరుస్తున్న నల్లటి బూట్లూ చాలా హుందాగా ఉన్నాడు.

ఆమె చాలా పొడుగ్గా ఉంది. భుజాల వరకూ కత్తిరించిన తలవెంట్రుకలు-అమెరికా దేశస్థుల ఒంటి రంగూ-గళ్లగౌను-ఎత్తుమడమల కాలిజోళ్ళూ విదేశీయిరాలిగా కనబడ్డది రేఖ కళ్ళకు.

"ఆంటీ! ముందు కారెక్కు"

అది యౌవనంలో ఉన్న పురుష కంఠధ్వనిగా రేఖ గుర్తించింది. నాలుగూ ఐదు సంవత్సరాల చిన్నపిల్లవాడి గొంతులా లేదు. అతడు స్వచ్ఛంగా ధారాళంగా మాట్లాడుతున్నాడు. ఈ రెంటినీ సమన్వయం చేయట మెట్లా?

"నీవు ముందుగా ఎక్కు గిరిబాబూ?" ఆమె అతడి చేతిని అందుకుని కారెక్కించింది. డ్రైవర్ను సామాన్ల సంగతి కాబోలు అడిగి, కారెక్కి తలుపు మూసింది. కారు మెల్లగా కదిలిపోయింది.

గిరిబాబు! ఈమాట-ఈపేరు యాదమ్మ చెప్పలేదే? ఆమెకు తెలియదా? యాదమ్మ చెప్పినట్టు మూరెడు కాదుగాని-చిన్నపిల్ల వాడిలా

ఉన్నాడు. కాని - ఆ కంఠధ్వని ?

కారు వెళ్ళగానే విస్మయంతో అక్కడినుంచి లేచి తనగదికి ఆలోచిస్తూ చేరుకున్నది.

పన్నెండు గంటలయింది. సునందాదేవి భోజనం చేసిన తరువాతనే సెలవు రోజుల్లో రేఖ భోజనం చేస్తుంది. ఆరోజున పూజ గదిలోనుంచి వస్తూనే "భోజనం చేశావా రేఖా ? అడిగింది.

లేదని రేఖ తలతిప్పగానే "రా. భోజనం చేద్దాము" తన సరసన కూర్చోబెట్టుకున్నది రేఖకు ఆమె పక్కన కూర్చోవటం అదే ప్రథమం. బిడియ పడుతూ భోజనం ముగించి లేచింది.

ఆ రాత్రి పడుకోబోయే ముందు రేఖ "యాదమ్మా ! మేడమీద — — —"

"అదిగో ! మళ్లీ 'మేడ మేడ' అంటున్నావా ? మరచిపొమ్మని రాత్రేగా చెప్పింది ? రేఖమ్మా ! మనకా జోలి వద్దమ్మా ! నీవు చదువుకో, చదువుకుంటే పడుకో" కసిరినట్టుగా మాట్లాడింది యాదమ్మ.

"యాదమ్మా ! యాదమ్మా! ఒక్కటంటే ఒక్కటేమాట. ఆయన- అంటే సునందాదేవిగారి కొడుక్కు ఎన్నేళ్లు ? పేరేమిటి?" రేఖ యాదమ్మను బ్రతిమిలాడింది.

"నాకదంతా తెలియదు తల్లీ ! అక్కర్లేని ప్రశ్నలడిగి నన్ను విసిగించకు" చివాట్లు పెడుతున్నట్టుగా అన్నది యాదమ్మ.

రేఖ చిన్నబుచ్చుకుంది. ఆలోచనలు అల్లిబిల్లిగా అల్లుకుంటుండగా నిద్రపట్టింది.

మరుసటి ఆదివారం కూడా రేఖ మళ్లీ అదేచెట్టు చాటున చిన్న రాతిమీద పుస్తకం చేతబట్టుకుని కూర్చున్నది.

కొంత సేపటి వరకూ నిశ్శబ్దము. ఆ తరువాత ఫిడేలు వాద్యము కొంతసేపు- ఫ్లూట్ వాద్యము కొంతసేపూ వినిపించాయి. కొంతసేపు టకటక మంటూ టేబుల్ టెన్నిస్ ఆడిన శబ్దము వినిపించింది. మధ్య మధ్య గొల్లున నవ్వులు.

రేఖ ధ్యాసంతా మేడమీదనే ఉన్నది. పేరుకే పుస్తకం చేతిలో ఉన్నది. అప్పుడప్పుడు ఆలోచిస్తూ పేజీలు తిరగవేస్తున్నది.

మధ్యాహ్నం పన్నెండు గంటలు కాగానే లోపలికి వెళ్లిపోయింది.

పరీక్షలు ప్రారంభమయ్యాయి. రేఖ తొందర తొందరగా బయలు దేరుతుంటే సునందదేవి వెనక్కు పిలిచింది.

"రేఖా! ఇవాళ నీవు కాలేజికి చేరుకునేటప్పటికి ఆలస్యమవు తుంది. వాకిట్లో కారుంది. కారులో వెళ్లు. నీవు తిరిగి వచ్చే వరకూ కారు అక్కడే ఉంటుంది. వెళ్లు. పరీక్ష బాగా రాయి" సునందాదేవి ఆజ్ఞాపించి నట్టుగా అంది.

మారు మాట్లాడటమంటే రేఖకు భయం. మంచయినా చెడయినా ఆమె చెప్పినట్టు నడుచుకోక తప్పదు పరీక్షలు జరిగిన వారం రోజులూ రేఖ కారులోనే వెళ్లింది.

"ఏమోయ్ రేఖ! ఏమిటి విశేషం? కారులోగాని కాలేజికి రావా ఇంక?" స్నేహితురాళ్లందరూ ఆమె చుట్టూచేరి ఆటలు పట్టించారు.

"చెప్పవేం? అప్పుడే శ్రీమంతురాలి వయినట్టుగా పలుకే బంగారం చేశావే?" గంట కొట్టటం చేత హాస్యాలు చాలించారు.

పరీక్షలు కాగానే సెలవుల్లో అందరూ మాట్లాడు కోవటం మొదలు పెట్టారు. దమయంతీ కామాక్షి బంధువుల ఇళ్లకు వెళ్లాలని ఉబలాట పడు తున్నారు. కాని-రేఖకు సెలవుల్లో ఏంచెయ్యాలో తోచలేదు. తల్లిదగ్గరికి

పోలేదు. ఒకరోజున అన్నకు ఉత్తరం రాసింది-తనకు బొంబాయి నగరం చూడాలని ఉన్నట్టుగా. అతడు తల్లికి సంగతి రాశాడు. రేఖను చివాట్లు పెడుతూ "బుద్ధిగా చదువు ముగించుకుని రా. తేనిపోని కోరికలు - మన వంటి వాళ్లకు తగని కోరికలు పెట్టుకుని చదువు పాడుచేసుకోకు. ఈ ఒక్క సంవత్సరం ఉంటే-నీ-నాకష్టాలు గట్టెక్కినట్లే!" అంటూ మాణిక్యం పెద్ద ఉత్తరం రాసింది. రేఖ గుండె రాయి చేసుకుంది.

"పుస్తకాలేవయినా ఉంటే ఇవ్వండి-చదువుకుంటాను. ఏమీ తోచటం లేదు" బిడియపడుతూ అడిగింది ఒకనాడు రేఖ సునందాదేవిని భోజనాల సమయంలో.

కొంత సేపటి వరకూ సునందాదేవి సమాధానం చెప్పలేదు. ఆమె సందేహిస్తున్నట్టు గ్రహించిన రేఖ ఆమాట మళ్లీ ఎత్తలేదు.

మరునాడు సునందాదేవి తనంతట తానే రేఖను పిలిచి "ఆగదిలో బీరువానిండా పుస్తకాలున్నాయి. చూసుకుని తీసుకో. చదివి జాగ్రత్తగా తీసిన చోటనే తిరిగి పెట్టు" అన్నది.

ఆ గదిలో అడుగు పెట్టిన రేఖ గోడలకున్న నిలువెత్తు ఫోటోలను ఒక్కొక్కటే చూడ నారంభించింది. తలమీద జరీటోపీలు-పొడుగుచెమ్కీ కోట్లు-ఒంటికి అతుక్కుపోయిన పైజామాలు చూసి అవి జమీందార్ల వేషధారణ కాబోలు ననుకుంటూ బీరువా తలుపులు తెరచి పుస్తకాలు చూస్తూ తనకు పనికి వచ్చేవేవయినా ఉన్నాయేమోనని వెదకటం మొదలు పెట్టింది రేఖ. పుస్తకాలన్నిటి మీద గోపాలకృష్ణ రాయడి పేరు తెలుగుపుస్తకాల మీద తెలుగులోను ఇంగ్లీషు పుస్తకాలకు ఇంగ్లీషుభాషలోనూ వ్రాసిఉంది.

ఆ గ్రంథాలున్న గదిలో ప్రవేశించిన రేఖ భోజనానికి నిద్రకూ మాత్రమే బయటికి వస్తూ ఉండేది. విసుగుపుట్టినప్పుడు తోటలో తిరుగుతూ పైనుంచి వినవచ్చే సంగీతాన్ని ఆలకిస్తూ ఉండేది. సెలవులు ఎలా

గడపాలా అని దిగులుపడ్డ రేఖకు రోజులు ఎన్ని గడిచాయో తెలియకుండానే గడిచిపోయాయి.

కాలేజీలు తెరిచారు.

*   *   *

దసరాలకు సునందాదేవి దేవీనవరాత్రులు మహావైభవంగా జరిపించింది. ఆమె చేయదలచుకున్న దానాలు విరివిగా చేసింది. అమ్మవారి పూజలు దగ్గర నిలబడి చేయించింది. ఒక సెలవు రోజున రేఖను కూడా దేవాలయానికి తీసుకువెళ్లింది.

రేఖకు బాల్యం నుండి విగ్రహాలను పూజించటం - దేవాలయాలకు వెళ్లటం తెలియదు. కాని- గోపాలకృష్ణరాయుడి గ్రంథాలయంలో అన్ని రకాల గ్రంథాలను చదవటంచేత కొంత కొంత గ్రహించగలుగుతోంది. భారతదేశా గురించీ మతాన్ని సంస్కృతిని గురించీ దేశదేశాలలో చాటిన స్వామి వివేకానంద సాహిత్య మంతా చదివింది. భారతదేశములో 'హిందూ మతం నశిస్తుందా ?' అన్న గ్రంథం చదివిన తరువాత "హిందూమతానికి పట్టిన బూజు దులపాలి" అన్న గ్రంథం చదివింది. కాలేజి తెరచేముందరే హిందూ మతమంటే ఏమిటి? అది ఒక మతం కాదు-భారతీయులు నడచుకోవటానికి ఏర్పడిన మార్గాలు-జీవనపథం- (Hindu way of Life). ఇదే విశ్వశాంతికి తెలుగుబాటలు వేసిన మతం అని పండిత రాధాకృష్ణ అన్నారట. ఈ గ్రంథాల తరువాతనే భక్తిమార్గాలు అన్నం గ్రంథం చదివింది. ఆ మార్గాన పయనించే వారికి విగ్రహారాధన - భజనలు మొదటిసోపానాలు - అంటూ వివరణతో శాండిల్య భక్తి, శబరిభక్తి-మార్జాల కిశోరన్యాయం - మర్కట కిశోరన్యాయం మొదలైన అంశాలను తెలుసుకున్నది. కాని అంతలోనే-ఇవన్నీ చదివింది గాని వీటిని గ్రాహ్యం చేసుకునే శక్తివయసూ తనకు లేవని తెలుసుకున్నది. ఆ గ్రంథాలయంలో ఆమెకు తాను చదివిన

గ్రంథాలే కాకుండా వీటన్నిటినీ వ్యతిరేకించే గ్రంథాలుకూడా ఉన్నట్టు చూసిందొకనాడు. వాటన్నిటినీ చాల ఉత్సాహంతో కుతూహలంతో గబగబా చదివేసింది. కాని-ఏదిసత్యం-ఏదినిత్యం-ఏవాదన నిలుస్తుంది? అనేవిషయాలను తేల్చుకునే శక్తి తనకులేదని తెలుసుకుంది. పండితనెహ్రూ స్వాతంత్ర్యసమరంలో చెరసాల శిక్షననుభవిస్తూ తన ఏకైకకుమార్తె ఇందిరాప్రియదర్శినికి వ్రాసిన ఉత్తరాలు చదివింది. ఆ తరువాత దేశ చరిత్రలన్నీ చదివింది. రోమ్‌దేశం అభివృద్ధి చెందటం తరువాత క్రమంగా పతనం చెందటం చదివింది. హిందూదేశ చరిత్ర చదివిన రేఖకు దేశమ్మీద దాడులు జరిగిన తరువాత జరిగే మార్పులూ మసీదులు దేవాలయాలు కావటం-దేవాలయాలు మసీదులు కావటం-వైష్ణవాలయాలు శివాలయాలుగా మారటం-బౌద్ధస్తూపాలన్ని శివలింగాలుగా మారటం విచిత్రమనిపించింది. కాని హిందూ మతం నశించలేదు. వేదవేదాంగాలూ రామాయణ భారతాలూ ఆవిశ్వాసాలు ఏ కొందరికో లేక పోయినా అందరిలోనూ నశించలేదు. మహమ్మదీయులు రాజపుత్ర స్త్రీలను వివాహమాడినట్టుగా చరిత్ర చెబుతోంది. ఒక్కొక్క మహమ్మదీయ మహారాజుకూ హిందూ సామ్రాట్టుకూ అనేక మంది భార్యలట. చదివిన కొద్దీ చిత్రవిచిత్రాలుగా కనపడుతున్నాయామెకు. ఆ గదిలో ఉన్న ఆత్మకథలన్నీ పూర్తి చేసింది. ఆత్మకథలన్నీ చాలా గొప్పగా ఉన్నాయి. అంతటి ఉన్నతులే ఆత్మకథలు రాసుకోవాలి. ఈ గ్రంథాలను సేకరించి భద్రపరచిన గోపాలకృష్ణరాయలు వారు ఎక్కడికి వెళ్లారు? వారు మరణించలేదా? వారు సజీవులుగా ఉన్నట్టు సునందాదేవి నుదుట కుంకుమబొట్టు ఋజువు చేస్తున్నది కదా? అయితే ఎక్కడికి వెళ్లారు? వారి ప్రశంస ఇంట్లో ఏ ఒక్కరి నోటివెంటా వినలేదే?

యాదమ్మా! మొన్న నేనడిగిన ప్రశ్నకు జవాబు చెప్పనన్నావు సరే. మరచి పొమ్మన్నావు. కాని-చూడు! ఈ దేవిడి యజమాని పేరేమిటి? ఇదయినా చెప్పు?" రేఖకు రాత్రిళ్ళే యాదమ్మతో మాట్లాడటానికి

తగిన సమయం. దాన్ని వృథా చెయ్యకుండా ఏదో ఒక ప్రశ్న అడుగుతూ ఉంటుంది.

"ఆ దొర పేరు గోపాలకృష్ణరాయడు" రేఖ దీని తరవాత ఇంకేం ప్రశ్న వేస్తుందోనని పక్కకు తిరిగింది.

"అయితే వారు ఇప్పుడు ఎక్కడ ఉన్నారు?" పడుకున్న రేఖ తలఎత్తి అడగనే అడిగింది.

"ఇప్పుడులేరు" ముసుగులో నుండి జవాబు వచ్చింది.

రేఖ మంచమ్మీది నుంచి చెంగున లేచి యాదమ్మ ముసుగు తీసి "మరి-మరి - అమ్మగారు కుంకుమబొట్టు పెట్టుకుంటున్నారు కదా?" ఆశ్చర్యాన్ని వ్యక్తంచేసింది.

"అవును. లేరు అంటే ఇంట్లో లేరన్నమాట! ఇంకపడుకో-రేఖమ్మా!" మళ్లీ ముసుగు పెట్టుకున్నది.

"అప్పుడే పడుకోనా? చదువుకో వద్దా? ఇది ఆఖరి సంవత్సరం. బాగా చదివి మంచి మార్కులతో ప్యాసు కాకపోతే అందరూ కోప్పడతారు"

"అయితే చదువుకో. కాని-నన్ను మాత్రం ప్రశ్నలతో వేధించకు. నీవు వేసే ప్రశ్నలన్నీ నీకక్కర లేనివి. అవన్నీ ఎందుకు చెప్ప నీకు?" ముసుగులోనుంచే జవాబిచ్చి నిద్రలోకి జారుకున్నది. మరోరెండు నిమిషాలలో గుర్రుపెట్టేసింది.

రేఖ ఆలోచనలో పడ్డది యాదమ్మ అన్నమాట నిజమే. ఈ ఇంటి సంగతులు తనకెందుకు? కాని-పొట్టిగా ఉన్న ఆయువకుడు-ఆదొరసాని-కనబడని గోపాలకృష్ణరాయడు- వాళ్ల ప్రశంస పొరబాటుగానైనా ఎత్తకుండా గంభీరంగా మెసిలే సునందాదేవి రాత్రిళ్లు రేఖ మనసులోకి వస్తారు.

ఆలోచింప చేస్తారు. ఆమెలో జిజ్ఞాసని రేకెత్తించి ఆలోచనలను వలయాకృతిలో తిప్పించి తిప్పించి ఆమెను పల్టీలు కొట్టించి అలసి పోయేటట్టు చేస్తారు. గాని-ఆరహస్యమేదో విడదు. క్రమంగా ఈవిషయాలను గురించి రాత్రిళ్లేకాదు-ఏకాస్తవిరామం దొరినాపగలే ఆలోచనా వలయంలో చిక్కుకు పోతున్నది రేఖ

ఆమెలో అంతలో నిర్లిప్తత- అంతలో కుతూహలం చోటుచేసుకుంటున్నాయి.

సునందాదేవి సాయంకాలం వేళ- చల్లటి పానీయం తరువాత తమలపాకు విడెము జరదాతో సేవించుతూ హాల్లో ఉన్న సోఫాలో కూర్చున్నవేళ ముత్తి ఒక ఉత్తరం తెచ్చి యిచ్చింది.

కవరు విప్పి చదువుకున్నది సునందాదేవి. ఆమె కనుబొమలు ముడిపడ్డాయి. వెంటనే ఆఉత్తరాన్ని ముక్కలు ముక్కలు చేసి పక్కనే ఉన్న బుట్టలో వేసింది. అక్కడితో కోపం చల్లారక చివాలున లేచి తన గదిలోకి వెళ్లింది. అరగంటకుపైగా పడుకుని లేచింది. స్నానంచేసి జరీ అంచులపసుపు వన్నె చీరె కట్టుకుని కారులో దేవాలయానికి వెళ్లిపోయింది.

నౌకరులంతా గజగజ వణుకుతూ గోడల కంటుకుని నిలబడి పోయారు.

ఆరాత్రి భోజనమయిన తరువాత అక్కకు ఉత్తరం రాసింది సునందాదేవి.

ప్రియమైన అక్కగారికి-

నమస్కారాలు. మీ ఉత్తరం చదువుకున్నాను. మీరు పంపిన నాటినుండీ రేఖను జాగ్రత్తగా చూస్తున్నాను. ఇప్పుడు బి.ఏ ఆఖరి సంవత్సరంలో వచ్చింది. పరీక్షలు రెండంటే రెండే

నెలలు ఉన్నాయి. పొరుగూరిలో ఉన్న కాలేజికి రేఖను కారులో పంపి చదివిస్తున్నాను. ఆడపిల్లను ఎట్లా కాపాడాలో నాకూ తెలుసు. ఆ అమ్మాయిని నాపక్క గదిలోనే ఉంచాను. నా దగ్గర ఉన్న యాదమ్మ కూడా ఆ గదిలోనే పడుకుంటుంది. ఆ అమ్మాయిని మీరు పంపారన్న గౌరవంతో చాలా ప్రేమతో జాగ్రత్తగా పెంచుతున్నాను. డబ్బు ఖర్చు చెయ్యటానికి కూడా వెనకాడటం లేదు. ఈ పరీక్షలయితే బి.ఏ తప్పకుండా ప్యాసవుతుందన్న నమ్మకం నాకున్నది. అమ్మాయి చాలా తెలివి కలది. నేను ఇంతచేసిన దాన్ని మంచి సంబంధం చూసి పెళ్లి చెయ్యలేనని సంశయిస్తున్నారా ? మంచిపిల్లకు మంచి సంబంధమే చూడాలి. నామీద నమ్మకం లేక కాబోలు మీరు ఒక ఉద్యోగిని మాట్లాడారు. అప్పుడే నిశ్చయం చేయకండి. మాణిక్యం ఇక్కడికి వచ్చినప్పుడు నేను ఈ విషయాలన్నీ విపులంగా చెప్పాను. ఎవరి సహాయాన్నీ అపేక్షించకుండా నేనే మంచి సంబంధం చూసి ఎంత డబ్బయినా ఖర్చుచేసి, పెళ్లి చేస్తానని వాగ్దానం చేశాను. మాణిక్యం పిల్లకు పెళ్లంటూ రోజూ మిమ్ములను వేధిస్తున్నదా ఏమిటి ?

అక్కా ! మీరు రేఖ విషయంలో నిశ్చింతగా ఉండండి.

ఇట్లు
మీ ప్రియమైన చెల్లెలు
సునందాదేవి.

మరుసటిరోజు సాయంకాలం "అమ్మా ! పిలిచారట" అంటూ రేఖ వచ్చి సునందాదేవి ఎదుట నిలబడ్డది.

"రేఖా ! నేనంటే నీకింకా భయమేనా ? అంత దూరంలో అలా నిలబడ్డావేమిటి ? ఇలా వచ్చి కూర్చో" మందలించినట్లుగా అన్నది సునందాదేవి.

బిడియంతో సందేహిస్తునే ఆమె పక్కన సోఫాలో కూర్చున్నది రేఖ.

"ఈ మధ్య అమ్మ ఏదయినా ఉత్తరం రాసిందా?" తానే స్వయంగా తమలపాకులతో బీడా తయారు చేసుకుంటూ ప్రశ్నించి రేఖ ముఖంలోకి చూసింది సునందాదేవి.

"రాయటంలేదు" చేతివేళ్లు చూసుకుంటూ జవాబిచ్చింది.

"పోనీ నీవు రాస్తున్నావా?"

"లేదమ్మా లేదు. ఏదయినా విశేషముంటేనే రాయమని అమ్మ చెప్పింది. అంతే" భయంతోనే సమాధాన మిచ్చింది రేఖ.

"మీ అమ్మ పోరు పెట్టింది కాబోలు-మా అక్కగారు ఒక ఉత్తరం రాశారు. పరీక్షలు పూర్తి కాగానే నిన్ను పంపమన్నారు. అక్కడ నీకు ఒక పనికి మాలిన సంబంధం చూసి నిశ్చయం చేశారట. వెళ్లి ఆ సంబంధాన్ని చేసుకుంటావా? నీకు చూపించకుండానే వాళ్లు నిశ్చయం చేశారట. చూస్తే నీవు మెచ్చవని కాబోలు!" పెదవి విరిచింది సునందాదేవి.

తలమీద మొత్తినట్లయింది రేఖకు. నెలరోజుల క్రిందట మాణిక్యం కాలేజి ఎడ్రసుకు ఒక ఉత్తరం రాసింది. దానిలో ఒక యువకుడి ఫోటో ఉంది. అత డొక సినీపత్రికలో విలేఖరట. పీలగా ఉంది ముఖం. కళ్లు ముక్కు తప్ప మిగతా ముఖాన్ని తలవెంట్రుకలు కప్పివేశాయి- గడ్డమయిందీ మీసమయిందీ తెలియకుండా ముఖమంతా మూసుకుపోయింది. పేరు జయపాల్‌ట. తనఫొటో చూసి అంగీకరించాడట. ఒక ముఖ్య విషయమేమిటంటే "ఇద్దరమూ ఉద్యోగాలు చేసుకుంటాము. నాకామే కట్నం" అన్నాడట. సందేహించకుండా ఒప్పుకుని పరీక్షలు కాగానే బయలుదేరి

రమ్మన్నదా ఉత్తరం చివరన. అప్పటి నుంచీ రేఖ జవాబివ్వకుండా ఆలోచిస్తునే ఉన్నది.

ఈ సంగతే కామేశ్వరీదేవి గారు చెల్లెలికి కూడా రాశారేమో ?

ఏమంటావు? నీకిష్టమేనా వాళ్లు చూపించిన సంబంధం చేసు కోవటానికి ? చెప్పు ? వాళ్లకు సమాధానం రాయాలి నేను."

ఐదు నిమిషాల తరువాత కూడా జవాబు రాకపోయేసరికి "అయితే రేఖ ఒప్పుకుందని వ్రాయనా ?" అన్నది సునందాదేవి గంభీరంగా.

చివ్వున తలెత్తింది రేఖ. కళ్లల్లో నీటిపొర తేలియాడుతున్నట్టుగా కనిపెట్టింది సునందాదేవి.

"అయితే రేఖకు పెళ్లి వద్దట అని రాయనా ?" రెట్టించినట్లన్నది.

"నేనా విషయం ఇంకా బాగా ఆలోచించుకోలేదమ్మా. నేను పెళ్లి చేసుకుంటేనే గాని అమ్మకు మనశ్శాంతి లేని పక్షంలో చేసుకుంటాను. ఆమె నాకు బుద్ధి తెలిసినప్పటి నుంచీ అన్నీ కష్టాలేపడ్డది. నాపెళ్లితో కష్టాలంతమవుతా యనుకుంటే చేసుకోక తప్పదు" తలవంచుకుని అన్నది రేఖ.

"అయితే అతడినే చేసుకుంటావా ?"

ఈ ప్రశ్నకు రేఖ చప్పున సమాధానం చెప్పలేక పోయింది. బూచిలా ఉన్న ఆఫోటోను ఎప్పుడో చించి పారేసింది ఉత్తరంతో పాటు. ఆ ఫొటోను తిరిగి చూడనవసరం లేదనుకుంది.

పావు గంటసేపు నిశ్శబ్దం ఆవరించుకున్న దా హాలులో.

"నీకంతగా ఇష్టమున్నట్టు లేదు చూస్తే. ముందు పరీక్షలు కానీ-తరువాత ఆలోచిద్దామని మా అక్కగారికి ఒక ఉత్తరంరాసి పడేస్తాను. సరేనా? ఇదంతా మనసులో పెట్టుకుని పరీక్షలు పాడుచేసుకునేవు !

జాగ్రత్తగా చదువుకో" చివాలున కూర్చున్న చోటినుంచి లేచింది సునందాదేవి.

తలవంచుకుని మాట్లాడకుండా గదిలోకి వెళ్లిపోయింది రేఖ. ఈ విషయాలను మనసులోకి రానివ్వకుండా చదువుసాగించాలన్న పట్టుదలతో కృషి చెయ్యటం మొదలు పెట్టింది.

రోజులు ఆమెకు తెలియకుండానే గడిచి పోవటం చూసి రేఖ తనలో తానే ఆశ్చర్యపడ్డది. ఎట్లా చదివిందో- పరీక్ష ఎట్లా రాసిందో ఆమె ఊహించలేనంతగా కాలం గడచింది. పరీక్షల తరువాత వార్షికోత్సవాలు తలపెట్టారు వాళ్ల కాలేజీ ప్రిన్సిపల్. విద్యార్థినులు నాటకాలు వేశారు. వినోదకరమైన పాత్రలు ధరించి ప్రేక్షకులను విస్మయపరచారు. లలితసంగీతంలో ప్రావీణ్యం కలవారు గానం చేసి శ్రోతలను తన్మయులను చేశారు.

ఆ మరుసటి రోజే ప్రిన్సిపల్ సెలవులు ప్రకటించారు.

* * *

ఎప్పుడూ రానివాళ్లు తనకోసం దేవిడీలోకి వచ్చేసరికి రేఖకు విస్మయమూ భయమూ కూడా కలిగాయి. కాని- అంతలోకే సర్దుకుని "హాలో! దమయంతీ! కామాక్షీ! ఏమిటి ఇలా వచ్చారు?" అంటూ చేతులు పట్టుకుని గదిలోకి తీసుకువెళ్లి తలుపులు దగ్గరగా వేసింది.

"ఏంలేదు రేఖా! సెలవు లిచ్చారు. నీవు హైదరాబాదు వెళ్లిపోతానన్నావు ఒకసారి జ్ఞాపకం ఉందా? అందుకని వచ్చాం. మళ్లీ మనం కలుస్తామో లేదో?" అన్నారు ఒక్కసారే.

"అవును వెళ్లాల్సిందే. కాని - -" నసిగింది రేఖ.

"కాని-అంటున్నావు? ఏమిటి సంగతి? ఇంకా పైచదువు చదువు తావా?" దమయంతి కళ్లు వెడల్పు చేసుకుంటూ అన్నది.

అబ్బే. అటువంటిదేమీ లేదు. ఇంక వెళ్లిపోతాను. అమ్మకు ఉత్తరం రాసి బయలు దేరటమే. అంతే." అన్నదిరేఖ.

తల్లిదగ్గరికి చాలా కాలానికి వెళ్లుతున్న సంతోషంగాని ఉత్సాహం గాని రేఖలో కనబడక పోవటం గమనించారు ఇద్దరూ.

అనాసక్తంగా ఉన్న రేఖ ఒక పావుగంట తరువాత కాస్త తేరుకుని ఉత్సాహాన్ని తెచ్చుకుంటూ వాళ్లతో కబుర్లకు దిగింది. "నీకు క్లాసు వస్తుందంటే నీకు వస్తుందని కొంత సేపు ముగ్గురూ వాదులాడుకున్నారు.

"రిజిల్ట్సు వస్తే - వస్తేఏమిటి వస్తాయి. తరువాత ఏంచేద్దామని?" దమయంతిని రేఖ అడిగింది.

"నేనింకా ఆలోచించుకోలేదు. టీచరు ఉద్యోగం చేయాలంటే ట్రైనింగు కావాలి" టక్కున జవాబిచ్చింది దమయంతి.

"కామాక్షి నీవో? నీకింకా చదవాలని ఉందా!" దమయంతి దృష్టి కామాక్షి వైపుకు మళ్లింది.

"నా సంగతే అడిగావూ? నాకు ఒక ఇష్టమంటూ లేదు. ఈపాటికి నాసంగతి మాఅమ్మా నాన్నా నిశ్చయం చేసే ఉంటారు మాయింట్లో."

"ఏంచేసి ఉంటారోయ్? పెళ్లేనా?" దమయంతి హేళనగా నవ్వేసింది.

వాళ్లతో మాట్లాడుతూ నవ్వుతూ గడుపుతున్నప్పటికీ రేఖ ఆలోచనలు ఎక్కడెక్కడో విహరిస్తున్నాయి. ముఖమ్మీద ఆందోళన కొట్టివచ్చినట్టుగా కనబడుతోంది. వాళ్లు ఎప్పుడు వెళ్తారా అని మనసులో తలపోస్తున్నది.

"నీవు మాతో కులాసాగా కాలాక్షేపం చేస్తావని వచ్చాం. నీ మన సెక్కడో విహరిస్తోంది. ఇంక మేము వెళ్తాం" వాళ్లిద్దరితోపాటు రేఖకూడా వీధి వాకిట్లోకి వచ్చింది.

దమయంతి చెప్పాలా వద్దా అనుకుంటూ గేటు దగ్గరికి రాగానే అనేసింది. "రేఖా! సునందాదేవిగారు నీకు పెళ్లి ఏర్పాట్లు చేస్తున్నారట కదా? నగలు చేయిస్తున్నారట. బట్టలు కొంగున్నారట. మరి- - - పెళ్లి కొడుకు ఎక్కడివాడు? ఏ ఊరు? ఏంపేరు? ఇవన్నీ తెలుసుకోవాలనే వచ్చాం. నీవేమో మమ్మల్ని నిరుత్సాహపరచి పంపేస్తున్నావు. ఆ సంగతులన్నీ మాకు చెప్పటం నీకిష్టమున్నట్టు లేదు" గబగబా అన్నది నిష్ఠూరంగా.

రేఖ ముఖం పాలిపోయింది. పెద్దపులి ఎక్కడైనా ఉందేమో అని భయం భయంగా చూస్తూ అడుగులు వేసే మేకలా ఉంది రేఖ.

"దమయంతీ! నీవు చాలా క్రూరంగా మాట్లాడుతున్నావు. రేఖ ముఖం చూడు? ఎలా అయిపోయిందో? మనం వెళ్దాం పద" ఇంచుమించుగా చెయ్యి పట్టుకుని లాక్కుపోయింది కామాక్షి.

వాళ్లను పంపించి లోపలికి వచ్చిన రేఖ మంచ మ్మీద బోర్లా పడుకుంది. ఆమె సహించలేని భావమేదో మెదడులో సంచారం చేస్తున్నట్టున్నది. మధ్యమధ్య తల తిప్పుతున్నది. అనూహ్యమైన భయం ఆమెను వెంటాడుతున్నట్టుగా ఉన్నది ముఖం చూస్తే.

పదిహేను రోజులనాడు సునందాదేవి రేఖను పిలిచి దగ్గర కూర్చోబెట్టుకుని "రేఖా! వీటిలో నీకు నచ్చిన నగలేమయినా ఉన్నాయేమో చూడు!" అంటూ ఒక పెట్టె తెచ్చి రేఖ ముందర పెట్టింది.

వాటిని చూస్తూనే తుళ్లి పడ్డది రేఖ. రకరకాల నగలు, మెడలో

ధరించేవి, చేతులకు పెట్టుకునేవి, చెవులకు పెట్టుకునేవి, వేళ్ళకు పెట్టుకునేవి కొత్తవీ పాతవీ చాలా రకాలు ఉన్నాయి.

కంటితో చూసి ఉదాసీనంగా కూర్చుంది రేఖ వాటిమీది నుండి చూపులు మరల్చుకుని.

"చేతులకూ, చెవులకూ, మెడలోకీ నీకు కావలసినవి ఏరుకో. ఉంగరాలు నీ వేళ్లకు ఆది ఎక్కువవుతుందేమో? మళ్లీ చేయిస్తాను" రెండు మూడు చేతిలోకి తీసుకుని చూపించింది సునందాదేవి.

"నాకెందుకమ్మా నగలు?" తలవంచుకుంది రేఖ.

"ఏం? నగలంటే ఇష్టం లేదా? ఇవి నీకు నచ్చలేదా? నచ్చకపోతే చెప్పు?"

"నగలకేం? చాలా బాగున్నాయి. కాని నాకెందుకు? నగలు కోరటం నా తాహతుకు మించిన కోరిక కదా?" నిర్లిప్తత కనబరిచింది రేఖ.

"లేకపోతే కోరటం గొంతెమ్మ కోరికే అవుతుంది. నీకు మంచి సంబంధం చూసి పెళ్ళి చేస్తానని మీ అమ్మకూ మా అక్కగారికీ వాగ్దానం చేశానుకదా! ఆ ప్రకారం మంచి సంబంధం చూశాను. మీ అమ్మకు రాశాను కూడా. పెళ్ళికి కావలసిన నగలు వీటిలో నుంచి ఏరుకున్నా సరే- లేక కొత్త నమోనాలు కేటలాగులో చూసి ఎన్నిక చేసుకో. చేయించి తెప్పిస్తాను. బనారసు కంచి పట్టుచీరెలు తెప్పించాను. వాటిని కూడా చూసి సెలక్టు చేసుకో. నీ ఎన్నిక అయిన తరువాతనే మిగిలినవి తిప్పి పంపుతాను"

తుళ్ళి పడ్డది రేఖ. తనకు సంబంధం నిశ్చయమైందా? తను చూడకుండానే నిశ్చయమయిపోయిందా? అప్పుడే అమ్మకు కూడా ఉత్తరం

వెళ్ళిందా ? కంపరం పుట్టుకొచ్చింది రేఖకు.

"అమ్మా, నేను మా అమ్మ దగ్గరికి వెళ్ళిపోతాను. పంపించండి" లేచి నిలబడ్డది రేఖ.

"నేను పెళ్ళి అన్ని లాంఛనాలతో జరిపిస్తానని మీ అమ్మకు మాట ఇచ్చాను. మాట తప్పేదాన్ని కాదు నేను. మీ అమ్మను ఇక్కడికే పిలిపిస్తున్నాను. అది నీస్వంప ఇల్లా, ఇది కాకపోయిందా? అలా భయపడతావేం? భయమా లేక సంకోచమా ? రేఖా నీకు నా దగ్గర ?" రెండు చేతులూ పట్టుకుని కూర్చోబెట్టింది.

"ఏరుకో మరి ? నీకు నచ్చినవే ఏరుకో, సందేహించకు" ఒక్కొక్కటి విడదీసి చూపించింది సునందాదేవి.

రేఖను ముఖమాటం తలెత్తనివ్వలేదు. పైగా ఏవేవో సందేహాలు మనిషిని కదలనివ్వటం లేదు. అయిష్టంతో ఒక సన్నటి గొలుసు మీద వేలు ఆనించింది.

సునందాదేవి పగలబడి నవ్వింది. "రేఖా ! నీవు ఈ కాలపు పిల్లవు కావు- పైగా ముఖమాట మెక్కువ. ఈ కాలపు పిల్లను దృష్టిలో పెట్టుకుని నేను సెలక్టు చేస్తాను చూడు. ఈ రాళ్ల నెక్లేసు- దానికి తగిన గాజులజత- చెవులకు కమ్మలు- చూడు- ఎంత బాగున్నాయో ? ఇంకో సెట్టుకూడా ఆర్డరు చేసానులే. నాలుగు రోజుల లోపల వస్తాయి. నేను ఎన్నిక చేసిన చీరెలు నీకు నచ్చితీరుతాయి." అంటూ నాలుగు చీరెలు గడివిప్పి చూపించింది.

రేఖకు వాటిని చూడగానే కళ్లు జిగేలు మన్నాయి. ఇంతకు ఖరీదు గల నగలూ చీరెలూ సునందాదేవిగారు తనకిస్తున్నారా ? ఎందుకు ? ఇవన్నీ తనకిచ్చేటంత అభిమానం తనపైన ఆమెకు ఉన్నదా ?

అసలింతకు ఆపెళ్లికొడుకు ఎవరు? ఎక్కడున్నాడు? ఎలా ఉంటాడు? తనకు చూపించదా? ఆమెను తనెలా అడుగుతుంది? ఆరాత్రి తల్లికి ఉత్తరం రాసింది. పరీక్షలయి ఇరవై రోజులకుపైగా అయిందనీ సునందాదేవిగారు ఇక్కడే పెళ్లి ప్రయత్నలు చేస్తున్నారనీను.

మాణిక్యం దగ్గర్నించి సునందాదేవికి పెద్ద ఉత్తరం వచ్చింది. సునందాదేవి స్వయంగా పూనుకొని పెళ్లిప్రయత్నాలు చేస్తున్నందుకు తను చాలా చాలా సంతోషపడుతున్నదనీ- ఈపెళ్లితో తన బాధ్యతలు తీరిపోతాయనీ రాసింది. ఆసందర్భంలోనే పెళ్లికొడుకు ఏంచేస్తున్నాడు? ఎలా ఉంటాడు? కుటుంబ విషయాలూ మొదలైన వివరాలు రాయమని కోరింది మాణిక్యం.

సునందాదేవి అందరితో రేఖపెళ్లి శ్రావణ మాసంలోనని చెబుతోంది. మాణిక్యానికి ఇంకా వరుడి వివరాలు వ్రాయలేదు సునందాదేవి మాణిక్యానికి పెళ్లికొడుకును గురించి రాస్తే తల్లి ద్వారా తనకు తెలుస్తాయని రేఖ ప్రతిరోజూ ఉత్తరం కోసం ఎదురు చూస్తున్నది.

మధ్యాహ్నం భోజనాల వేళకు ముందు- రేఖ గదిలోనుంచి బయటికి వస్తుండగా సునందాదేవి ఇంగ్లీషు భాషలో ఎవరితోనో మాట్లాడటం వినిపించింది. ఆ సమయంలో తాను ఎదటబడటం మంచిది కాదేమోననుకుంటూ లైబ్రరీ గదిలోకి వెళ్లింది.

"అమ్మకు కొంచెం తగ్గగానే మాఆంటీకి ఒప్పగించి వచ్చేస్తాను. ఉత్తరం వచ్చిందనీ-అమ్మకు జబ్బుగా ఉందనీ వెళ్లతున్నాను. కాని అక్కడికి వెళ్లటం నిజంగా నాకిష్టంలేదు. నామనసు మీయింటికి వచ్చిన తరువాత ఎంతో తేలికగా ఉంది. ఈ పదిరోజులు వెళ్లటానికే నాకెంతో బాధగా ఉంది." అది భారతీయులు మాట్లాడే ఆంగ్లభాషోచ్చారణ జాదు.

ఆ కంఠధ్వని ఎక్కడో విన్నట్లనిపించింది రేఖకు.

ఎప్పుడు? ఎక్కడ?

ఆలోచిస్తోంది రేఖ.

"తప్పకుండా పదోనాటికి ఇక్కడ ఉండాలి. నీవుచేసే పని ఈ యింట్లో ఉన్న నౌకర్లు ఎవరూ చెయ్యలేనిది. నీవు వచ్చిన తరువాత నా మనసు ఎంతో నిశ్చింతగా ఉంది. అబ్బాయి భారమంతా నీకొప్పగించి నా మనసును పూజల మీద దేవాలయం మీద కేంద్రీకరిస్తున్నాను." బాధపడుతూ మాట్లాడుతున్నది సునందాదేవి.

కొంతసేపటికి సునందాదేవితోపాటు గౌను వేసుకున్న ఆమెకూడా బైటికి రావటం రేఖ కిటికిలోనుంచి చూసింది. ఆమె మేడమెట్లు దిగి ఆ చిన్న అబ్బాయితో కారెకుతూ ఉండగా నాలుగైదు సార్లు చూసింది రేఖ ఇదివరలో.

మరో అరగంటకు రేఖకు పిలుపు వచ్చింది సునందాదేవి దగ్గర నుంచి. వెళ్లి భోజనం చేసింది.

తల్లి దగ్గరనుండి ఉత్తరం రాలేదు. సునందాదేవిని అడిగే ధైర్యం లేదు ఖఖకు. మనసు కలవరపడి పోతున్నది

"అమ్మా. నేను మా అమ్మ దగ్గరికివెళ్లి పదిరోజులుండి వస్తాను." అన్నది రేఖ ఒకనాడు గద్గద స్వరంతో.

జోసఫిన్ వెళ్లిన తరువాత సునందాదేవి ఆమె తిరిగి ఎప్పుడు వస్తుందా అని రోజులు లెక్కబెట్టుకుంటున్నది. ఆమె మనసులో ఇది అని తెలియరాని ఆందోళన చోటు చేసుకున్నది. నౌకర్ల మీద ఊరికేనే చికాకు పడుతున్నది.

రేఖను చూడగానే ఏదో కంపరం పుట్టుకు వచ్చింది సునందాదేవికి.

రేఖా ! ఎన్నిసార్లు చెప్పాను నీకు ? పెళ్లినాటికి మీ అమ్మే ఇక్కడికి వస్తుందని చెప్పలేదూ ? ఊరికే వెళ్తా వెళ్తానని గోలచేస్తున్నావేమిటి ?

నీవు ఈ ఇల్లుదాటి వెళ్లటానికి వీలులేదు తెలిసిందా? నిన్ను నేను ఎవరి కిచ్చి పెళ్లిచేస్తే వాళ్లను చేసుకుని తీరాలి. నీ మనసులో ఏముందో నేను కనిపెట్టాను. నీ సందేహాలు నాకు తెలుసు. మీ అమ్మ కాదన్నా నేను తీసుకు వచ్చిన వాడిని నీవు చేసుకుని తీరాలి." గర్జిస్తూ గదిలోకి వెళ్లిపోయింది సునందాదేవి.

హాల్లో గోడదగ్గరగా నిలబడ్డ రేఖ కుప్పగా కూలిపోయింది. తల మీద చేతులు పెట్టుకుని రేఖ కుళ్లి కుళ్లి ఏడుస్తున్నది.

సునందాదేవి ముత్తిని తీసుకుని దేవాలయానికి కారులో వెళ్లిపోయింది.

నౌకర్లందరూ వాళ్లవాళ్ల గదుల్లోకి చేరుకున్నారు బుగ్గలు నొక్కుకుంటూ.

భూచక్రమంతా తలక్రిందులైనట్టూ- పర్వతాలు తనమీద విరుచుకు పడ్డట్టూ- సప్తసముద్రాలు పొంగి తనను ముంచివేసినట్టూ భయకంపితురాలై మోకాళ్ల మీద తలఆనించుకుని వెక్కి వెక్కి ఏడుస్తున్నది రేఖ. తనకిక్కడ మరణం తప్ప వేరే శరణ్యం లేదు. ఉరి పోసుకుని చావాలి. లేదా తోటలో ఉన్న బావిలోపడి ప్రాణాలు తీసుకోవాలి. తనను ఎవరూ రక్షించలేరు.

రేఖ తల గోడకేసి కొట్టుకున్నది. ఫాలభాగమంతా బొప్పికట్టింది. ముఖమంతా కందిపోయింది. కన్నీటిధారలతో చెంపలు మాసినట్లయ్యాయి. దిక్కుతోచని దానిలా తలబాదుకుంటున్నదల్లా అక్కడొక చిన్న తలుపు తెరచుకుని గడపమీద నిలబడ్డ మనిషిని చూసి కెవ్వున అరచింది రేఖ. తలవెంట్రుకలు చేతులతో సర్దుకుని దూరంగా జరిగి నిలబడ్డది. దేహం కంపిస్తోంది.

"నీ వెవరు ? ఎందు కలా ఏడుస్తున్నావు ? ఏమయినా ఆపద వచ్చిందా ?" తలుపు దగ్గర నిలబడే అడిగాడు.

అతడు పొట్టిగా ఉన్నాడు. కాని- దాదాపు పాతిక సంవత్సరాలకు తగిన ముఖమూ ముక్కూ కళ్లూ ఉన్నాయి. చేతులు పొడుగ్గా లేవుగాని ఆ దేహానికి తగినట్టుగా ఉన్నాయి. కంఠధ్వని పౌరుషోచితంగా గంభీరంగా ఉంది. పచ్చటి చేతివేలికి రవ్వల ఉంగరం తళుక్కు తళుక్కు మంటూ మెరుస్తున్నది. తలుపుమీద చెయ్యి ఆనించి నిలబడ్డాడు.

గజగజ వణుకుతూ ఓరగంట అతడిని చూస్తోంది రేఖ.

నీ సంగతేమిటో నాకు చెప్పు ? నేనిక్కడ నిలబడటం బాగుండదు నీ వెందుకేడుస్తున్నావో చెప్పు ? నాచేతనైన సహాయం చేస్తాను. నీ సంగతంతా చెప్పటానికి నాతో పైకిరా." ఆ మాటలు చాలా స్నేహపూరితంగానూ, ఆపదలో ఉన్న వాళ్ళకు సహాయం చేసేటట్టుగానూ ఉన్నాయి. ఈ మాటలను పలికించేదొక సహృదయమై ఉండాలనిపించింది రేఖకు.

"పైకి వెళ్లటమా ?" రేఖ ఇంకా విస్మయావస్థలో నుంచి తేరుకో లేదు. భయం తగ్గలేదు. మోకాళ్లు రెండూ ఇంకా కొట్టుకుంటూనే ఉన్నాయి.

"నీకేం భయంలేదు. నన్ను నమ్ము. నీకు అపకారం చెయ్యను. నీ ఏడుపు చూస్తుంటే నాకళ్లకు నీళ్లు వస్తున్నాయి. నాతో చెప్పు నీసంగతి!" అతడు అభయమిస్తున్నట్టే కాదు- జాలికూడా కలుగుతోంది ఆ మాటలు వింటుంటే రేఖకు.

కళ్లు పైట చెంగుతో ఒత్తుకుని- ముఖమంతా ఒకసారి తుడుచుని మెల్లగా కదిలింది రేఖ. ఆమె తనవైపు రావటం చూసి వెనక్కు చూస్తూ ముందు మెట్లెక్కుతున్నాడు అతడు. రేఖ బరువుగా అడుగు ఒక్కొక్క మెట్టు మీదనే పెడుతూ పైకి ఎక్కింది.

"అలా ఆకుర్చీలో కూర్చుని చెప్పు. ఆఁ. . అలా కూర్చుని-బల్లమీద ఉన్న ఫ్లాస్కులో కాఫీ ఉంది- కప్పులో పోస్తాను. ముందు కాఫీ తాగి తరువాత చెప్పు" ఒక కప్పు ఆమె చేతికిచ్చి తానొకటి తీసుకున్నాడు.

కాఫీ తాగి కప్పు అలాగే చేతబట్టుకుని లేడిలా బెదిరిపోతూ ఇటూ ఆటూ చూసింది రేఖ.

"నీకేం భయం లేనని చెప్పానుగా! కాఫీతాగు" వేడుకుంటున్నట్టుగా ముఖం పెట్టాడు.

కాఫీతాగి గోడవారగా కప్పుపెట్టి వచ్చి కూర్చుంది. రేఖ.

అయ్యోయ్యో! అంత వినయమా? అక్కర్లేదు. సరే-నాకు పళ్లు కోసే అలవాటు లేదు. నాగవర్ధన్ ఊరికి వెళ్ళింది. ఆ ఏపిల్ పండు కోసి నీవు కొన్ని తీసుకుని నాకొక ముక్క నీచేత్తో ఇస్తే తీసుకుంటాను."

ఇదెక్కడి బాధ అనుకుంటూ కనుబొమలు చిట్లిస్తూ లేచి ఏపిల్ పండు చాకుతో ముక్కలు కోసి ఒక ప్లేటులో పెట్టి అతడి ఎదుటపెట్టింది రేఖ

"నీవు కొన్ని ముక్కలు తీసుకోవాలి. అప్పుడు గాని నేను తినను" అంటూ మూతి బిగించుకుని కూర్చుంటే చేసేదిలేక రెండంటే రెండే ముక్కలు తీసుకుంది రేఖ.

"నీవు ఇంకా కొన్ని ముక్కలు తీసుకోవాలి. అప్పుడు గాని నేను తినను."

గత్యంతరం లేక మరికొన్ని ముక్కలు తీసుకుంది రేఖ.

"నీకేం బాధలేనట్టుగా ఒక్కసారి నవ్వు."

ఆ మాటకు మళ్ళీ ఏడుపు ముచుకొచ్చింది రేఖకు. పైట చెంగు కళ్ళమీద పెట్టుకుని వెక్కటం మొదలుపెట్టింది రేఖ.

అతడు కుర్చీమీద కూర్చోలేకపోయాడు. అతడి గుండె బీటలు వారి నట్లనిపించింది.

"అమ్మాయీ! నీవిట్లా ఏడుస్తుంటే నేను చూడలేకుండా ఉన్నాను నాకెంతో బాధగా ఉంది. అలా స్థిమితంగా కూర్చుని నీ సంగతంతా చెప్పు" బ్రతిమిలాడాడు.

రేఖ వెక్కుతూనే తానా ఊరు ఎందుకు వచ్చిందీ-ఎలా వచ్చిందీ - వివరంగా చెబుతూ తన చదువు - అకస్మాత్తుగా లభించిన సునందాదేవి ఆదరణ - తన పెళ్ళి ప్రసక్తి - తల్లి వచ్చి వెళ్ళటమూ - తాను బి. ఏ. పూర్తి చేయటమూ సునందాదేవి ఆనాటి మాటలూ పూసగుచ్చినట్లు చెప్పింది.

అతడు బరువుగా నిట్టూర్చాడు.

"అయితే వరుణ్ణి నీకు చూపించకుండానే పెళ్ళి చేస్తుందా మా అమ్మ ?" కనుబొమలు పైకెత్తి ఆశ్చర్యంతో నోరు తెరిచాడు.

"నేనూ ఆ కోరికే కోరాను. నన్ను ఈ ఆవరణం దాటటానికి వీలు లేదని ఆంక్షపెట్టారు. చావు తప్ప మరొక మార్గం కనబడటం లేదు." మళ్ళీ వస్తున్న ఏడుపును ఆపుకోవటానికి చేసిన ప్రయత్నం విఫల మయింది.

"ఏడవకు నేను అమ్మతో మాట్లాడతాను. నీకు అన్యాయం జరగ కూడదు నేనది చూడలేను. నామీద నమ్మకం కుదిరిందా మరి ?"

తల ఊపింది రేఖ నమ్మకం ఉందన్నట్టుగా.

అతడలా అడుగుతుంటేనే నవ్వు వచ్చింది రేఖకు.

"సరేగాని - నేనొక్కడినీ ఈ ప్రాణంలేని వస్తుజాలంతో కాల క్షేపం చెయ్యలేక నానా అవస్థా పడుతున్నాను. రోజూ ఒకసారి ఇలా వచ్చి కబుర్లు చెప్పకూడదూ? ఎవరితోనయినా కాసేపు మాట్లాడితే మనసు కెంతో హాయిగా ఉంటుంది." అర్థిస్తున్నట్టుగా అడిగాడు.

"మీరీ ఇంటి యజమానుల్లా ఉన్నారు- అవునా?" ఒక పక్క భయపడుతూనే తన సందేహాన్ని నివృత్తి చేసుకోవాలని ప్రశ్నించింది రేఖ.

హుఁ అంటూ బరువుగా నిట్టూర్చాడతడు.

కొంత సేపటికి "నాబాధేమిటో నీకు చెప్తాను. మరి- రేపు నిజంగా వస్తావా?" మౌనంగా తల తిప్పింది రేఖ.

"జాగ్రత్తగా కిందికి దిగి వెళ్లు తలుపులు దగ్గరికి లాగితే లాక్ దానంతటదే పడుతుంది. మరచిపోకు ఈ వేళనే రావాలి." అతడు లేచి నిలబడగానే రేఖ తలవంచుకుని గబగబా మెట్లుదిగి తలుపులు దగ్గరికి లాగింది.

ఆరాత్రి ఆమెకు కళ్లు మూత పడలేదు. ఎంత ప్రయత్నించినా లాభం కనబడలేదు. ఆ గంభీరమైన కంఠధ్వని- అభయమిచ్చే ఆ చూపులు- ఆప్యాయమైన ఆపలకరింపు ఆమె మనసులో బలమైన ముద్రలు వేశాయి. అతడా ఈ యింటి యజమాని! ప్రశ్నిస్తే కాదనలేదే? ఆ మాటకు బరువుగా నిట్టూర్చాడు. అతడి గుండెలో ఎన్ని అగ్నిగోళాలు భగభగమంటున్నాయో? అతడిబాధలు చెప్పుకోవటానికి దిక్కులేని తనను రమ్మంటున్నాడు. అది ఆశ్చర్యమో- సంశయమో తెలియని అవస్థలో పక్కమీద దొర్లి దొర్లి తెల్లవారు ఝామున నిద్రలోకి జారుకుంది రేఖ.

* * *

సునందాదేవి ఆరోజంతా మౌనంగానే ఉంది. పక్కన కూర్చున్నా

రేఖతో ఒక్కమాటయినా మాట్లాటలేదు. సాయాంకాలం ఐదు గంటలు కాగానే ముత్తిని తీసుకుని దేవాలయానికి వెళ్లిపోయింది.

రేఖ ముఖం కడుక్కొని బొట్టుపెట్టుకుని తెల్లటిచీరె కట్టుకుని మెల్లగా తలుపు తీసి ఒక్కొక్క మెట్టే ఆగి ఆగి ఎక్కుతూ పైకి చేరుకున్నది. అతడు హాలుకెదురుగా ఉన్న వరండాలో నిలబడి బయటికి చూస్తున్నాము. అడుగుల సవ్వడికి వెనక్కు తిరిగి చూసి "హలో!" అన్నాడు.

పెదవుల మీద హాసరేఖ ఒకటి తొంగి చూసింది రేఖకు.

"వచ్చావా? కూర్చో. అన్నట్టు రాత్రి నిద్రపోయావా? పోయినట్టు లేదే!" అన్నాడు చిరునవ్వుతో.

నవ్వి ఊరుకుంది. రేఖ.

"పరీక్షలు బాగా రాశావా?" అనుకోకుండా అడిగాడీ ప్రశ్న.

రాశానన్నట్టు తల ఊపింది.

"చూడు? నీవు చాలా అదృష్టవంతురాలివి!"

"దేనికి?" విస్మయం కలిగింది రేఖకు.

"దేనికా! చదువుకున్నదానవు! పదిమందిలో కూర్చుని పరీక్ష రాసిన దానవు. నీకెంతమందో స్నేహితులుండే ఉంటారు. చక్కగా-ఆహ్లాదకరంగా అందరితో కబుర్లు చెప్పుకుంటూ నీ ఈడువాళ్లతో తిరగవచ్చు. పదిమందిలోకి వెళ్లవచ్చు. ప్రపంచాన్ని స్వేచ్ఛగా చూసి- తిరిగి-ఆనందించవచ్చు. ఇంతకంటె అదృష్టం వేరే కావాలా?" అతడి పచ్చటి ముఖం విచారంతో ముడతలు పడి వికృతంగా కనబడ్డది.

అతడి బాధ ఏమిటో అర్థంకాక వింతచూపు చూసింది రేఖ.

"నా బ్రతుకు చూడు. ఎంత నికృష్టమైనదో? నీవన్నట్టు నేనీ యింటికి వారసుణ్ణే. కాని- ఈ ఇంట్లో నేను స్వేచ్ఛగా తిరగలేను. ఈ మేడ దాటి బయటికి రాలేను. యజమానిగా- హుందాగా నలుగురిలోకీ రాలేను. చివరకు ఈ యింటి నౌకర్లలో ఒక్కడికి తప్ప నా ముఖం ఎవరికీ కనబడదు. నా చదువు ఈ హాల్లో ఈ బల్లముందర కూర్చుని చదివిన చదువు. నాకు స్నేహితులు లేరు. నా మనసులోని మాట నా మనసులో లయం కావాల్సిందే. నా జీవితంలో ఒక వెలుగురేఖ జోసఫిన్. ఆమె వచ్చిన తరువాత నాకు వ్యాపకా లెక్కువయ్యాయి. ఈ లలిత కళలన్నీ ఆమె నేర్పినవే. ఇవన్నీ కాలక్షేపానికీ- నా ఒంటరితనంలోని వ్యధను మాన్పుకోవటానికీ- దానిని మర్చిపోవటానికీ. ఆమె వచ్చిన తరువాతనే అప్పుడప్పుడు బయటికి తీసుకువెళ్లుతూ- సినిమాలు చూపిస్తూ పాటలు పాడిస్తూ- నవ్వుతూ నవ్విస్తూ- నాచేత ఆదలు ఆడిస్తూ నన్ను సంతోషంగా ఉంచటానికి ప్రయత్నిస్తుంది. అయినప్పటికీ నాది నత్తగుల్ల జీవితమే కదా! ఇప్పుడు చెప్పు- నీవా నేనా అదృష్టానికి నోచుకున్నది?"

కన్నీటిధారలు చెంపల మీదుగా కారిపోతున్నాయి రేఖకు. అలా అతడి ముఖంలోకి చూస్తున్నది జాలిగా.

"అదేమిటి- ఆ కన్నీళ్లు? నా సంగతి చెబుతుంటే నీవేడుస్తున్నా వెందుకు? ఈ ప్రపంచంలోకల్లా నేనొక దురదృష్ట జీవిని. నేనిలా పుట్టటం నాకు శిక్ష అయినట్టా- మా అమ్మకు శిక్ష అయినట్టా? నేను ఊహించలేకుండా ఉన్నాను. ఆమెకు నా ముఖం చూపించటానికే నాకు భయంగా ఉంటుంది. నావల్ల ఆమెకు ఏ విధమయిన సంతోషమూ కలగటం లేదు. ఆమె ఎంతో వ్యధపడుతోంది. ఈ పాపిష్టివాడికి ఆయువు మాడకూడదూ? నా ఆరోగ్యం కోసం అమ్మ ఇంకా ఎంతో డబ్బు ఖర్చు చేస్తోంది. శ్రద్ధ చూపుతోంది. ఈ ప్రపంచానికి నేను ఉన్నా లేకపోయినా

ఒకటే! కాని- కాని- ఈ కురూపికి ఏదయినా వస్తే అమ్మ గుండె బద్ద లవుతుంది. నేను- నాకోసం కాదు- కురూపిగా నయినా బతికి అమ్మకు దుఃఖం కలగకుండా చేయాలని ఈ చదువు- ఈ వ్యాసంగమూ మొదలు పెట్టాను. ఇప్పుడు నా బాధ అర్థమయిందా? నా బాధ ముందర నీ బాధ ఎంతటిదో ఊహించి చెప్పు?"

రేఖ తల వంచుకుంది.

గ్లాసెడు మంచినీళ్లు కూజాలోనుంచి ఒంపుకుని తాగాడు. గాలికి తలుపులు కొట్టుకుంటుంటే గబగబా వెళ్లి గాలి గడియలు పెట్టివచ్చాడు.

అతడి చర్యలను వింతగా చూస్తున్నది రేఖ.

జేబురుమాలుతో కళ్లూ ముఖం తుడుచుకుని పియానో దగ్గరికి వెళ్లి ఒక మార్నింగ్ సాంగ్ వాయించాడు.

"నాకు మనసులో వ్యథ కెరటంలాగ పొంగి పైకి పైకి వచ్చినప్పుడు- మరీ నిరుత్సాహంగా ఉన్నప్పుడు - ఇటువంటి పాటలు వాయిస్తాను. ఉత్సాహం కలుగుతుంది పిల్లలు ఆడుతున్నట్టూ పరుగులు తీస్తున్నట్టూ - పెద్దవాళ్లు ఫుట్‌బాల్, టెన్నిస్ క్రికెట్ ఆటలు ఆడుతున్నట్టూ ఉన్న రీళ్లు తెప్పించి ఆప్రొజెక్టరుతో సినిమాలు చూపిస్తుంది జోసఫిన్. వాటితో కలిగించుకున్న సంతోషం - ఆనందమే నాకు. అవి చూసే సంతోషిస్తూ చప్పట్లు కొడుతూ ఉంటాను. ఆఁ...అప్పటి నుంచీ నాసోదే చెబుతున్నాను. నీకు సంగీతం వస్తే ఒకపాట పాడి వినుపించు" అర్థించాడు.

మాటలు నోటోంచి రావటమే కష్టమైపోతుంటే పాట ఎలా పాడుతుంది రేఖ? జవాబు ఇవ్వటానికి తడి ఆరిపోయిన పెదవులను నాలుకతో తడుపుతుంది.

ఆమె అవస్థ గమనించిన అతడు "గ్లాసెడు మంచినీళ్లు తాగు. అంత భయపడి పోతున్నావేమిటి?" మంచినీళ్ల గ్లాసు చేతికందించాడు.

భయంతో నోటమాట సరిగ్గా రాకపోయినా ఒకపాట పాడానని పించుకున్నది రేఖ.

అతడి ముఖం వికసించినట్టుగా కనబడ్డది.

"పళ్లు తిందాం రా. ఈ ఎఱ్ఱటి అరటి పళ్లంటే నాకు చాలా ఇష్టం. ఇవాళ ఈ కమలాఫలాలు కూడా ఇద్దరం చెరొకటీ తిందాం. ఏమంటావు?"

ఇద్దరూ పళ్లు తినటం పూర్తి చేశారు. ఫ్లాస్కులో ఉన్న కాఫీ రెండు కప్పులలోకి ఒంపాడు.

"చూడు. నన్ను చూస్తే నీకు అసహ్యం వెయ్యటం లేదూ? నీ భయమంతా నన్ను చూసి కాదు కదా?" బాధపడుతున్నట్టుగా ఉన్నదతడి ముఖం.

"నాకెందుకు భయం? అందులో మిమ్మల్ని చూశా?? మీరెంతో మంచివారుగా కనబడుతున్నారు."

"ఎందుకబద్ధమాడతావులే! ఒదిగి ఒదిగి కుర్చీలో కూర్చుంటున్నావు? నావైపు భయంభయంగా చూస్తున్నావు! ఏదో వింత జంతువును చూసినట్టు బెదిరి పోతున్నావు! నీ చేష్టలే చెబుతున్నాయి నీ మనసులో ఏమున్నదో? అంతేనా? నిజమా - అబద్ధమా?"

"లేదు - లేదు. మీరలా అనుకోవద్దు. నాచేష్టలవల్ల మీకలా అనిపిస్తే క్షమించండి" చేతులు జోడించింది రేఖ నొచ్చుకుంటూ.

"ఏం చేస్తాం? దేవుడు నన్నిలా పుట్టించి ఇలా ఖైదీని చేశాడు".

"చూడు, ఏమయింది. అమ్మ తిరిగి వచ్చేస్తూ ఉంటుంది. మెట్లు జాగ్రత్తగా దిగి వెళ్లు రేపు వస్తావు కదూ ?" చేతికున్న గడియారాన్ని చూసుకొని ఆమెను తొందరపెట్టాడు.

రేఖ లేవబోయింది.

"నా పేరు గిరిధర రాయడు. అందరూ గిరిబాబని పిలుస్తారు. నేను పేరు అడగకుండానే మాట్లాడేస్తున్నాను. నీపేరేమిటి?" చిన్న పిల్లవాడు అడిగినట్టు అడిగాడు.

"రేఖ"

ఆమె మెట్లు దిగుతున్నంతసేపూ అక్కడే నిలబడి "రేఖా !" పిలిచాడు.

ఆమె వెనక్కు తిరిగి నవ్వుతూ చెయ్యూపి తలుపు మూసింది.

ఆరాత్రి భోజనం దగ్గర కూడా సునందాదేవి మౌనంగానే ఉన్నది.

ఎప్పుడెప్పుడు భోజనం ముగించి గదిచేరుకుంటానా అనుకుంటూ నిమిషాలు లెక్కబెడుతున్న రేఖ సునందాదేవి లేవగానే ఒక్క అంగలో గది చేరుకున్నది. ఆమెకు సునందాదేవిని చూడగానే - ఆ క్రిందటి రోజు తనకు పెళ్లివద్దు వెళ్లిపోతానని ఏడవటమూ - సునందాదేవి "నీ మీద ఎంతఖర్చు చేశానో తెలుసా ? ఎందుకంత ఖర్చుపెట్టానో తెలుసా ? నేను నేను చెప్పినట్టు వినకపోతే ఏమవుతుందో తెలుసా ? నా సమ్మతి లేనిదే నీవీ గడప దాటలేవు" అన్నమాటలు జ్ఞాపకం వచ్చాయి.

"మీరు ఖర్చుచేసిన ప్రతిపైసా నేను తీర్చుకుంటానమ్మా ! నా చర్మంతో చెప్పులు కుట్టించయినా మీ ఋణం తీర్చుకుంటానమ్మా ! నన్ను వెళ్లనియండి. నేను ప్రాణత్యాగమయినా చేసుకుంటాను గాని - పెళ్లిచేసు కోనమ్మా !" అని ఏడుస్తుంటే- "నిన్ను దగ్గరికి తీసి ఇంతచదువు

చెప్పించినందుకు నీవు నామాట విని తీరాలి" అంటూ ఆమె బెబ్బులిలా అరుస్తూ గదిలోకి వెళ్ళిన దృశ్యం కళ్ళల్లో మెదిలింది నిలువెల్లా ఒణి పోయి గోడకు ముఖం ఆనించి వెక్కి వెక్కి ఏడవడం మొదలు పెట్టింది రేఖ.

గదిలోకి వచ్చిన యాదమ్మ రేఖను బలవంతంగా మంచమ్మీద పడుకోబెడుతూ "రేఖమ్మా! నాకొక కాశీమజలీకథ వినిపించవూ? అప్పుడు చెప్పిన కథను సగంలోనే ఆపుచేశావు. పూర్తిగా చెప్పవూ?" అడిగింది ప్రాధేయపడుతున్నట్టుగా.

"మరిచిపోయాను యాదమ్మా!" రేఖ తప్పించుకోవాలని చూసింది.

"జ్ఞాపకం ఉన్నకాడికి చెప్పు నాకివాళ తలనొప్పిగా ఉందమ్మా. నీవు కథ చెప్పి దాన్ని పోగొట్టాలి"

కథ చెప్పక తప్పలేదు రేఖకు.

మరునాడు సునందాదేవి కాఫీ తీసుకుంటుండగా రేఖ ఎదురుగా నిలబడ్డది.

"ఏమిటిలా వచ్చావు? నిన్ను చూస్తేనే నాకు భయంగా ఉంది" చీత్కారం చేసింది.

ఆ మాటలకు ఎక్కడలేని ధైర్యం వచ్చింది రేఖకు. వెనకాముందూ చూడలేదు "కుక్కకు రొట్టె పడేసినట్టు నాకు అన్నంపెట్టి పోషించి — చదువుచెప్పించి ఇలా ఖైదీని చేస్తారా? బొమ్మను ఆడించినట్టు ఆడిస్తారా? ఎందుకమ్మా ఈ పేదవాళ్ల మీద ఇంతఅలుసు? మావి బ్రతుకులు కావా? మాకూ ఇష్టాయిష్టాలు ఉండవా? మా జీవితాలను డబ్బుపెట్టి కొని బానిసలుగా చూస్తారా? మాకెందుకీకట్టడి?" అరుస్తూ నేలమీదపడి దొర్లిగింతలు పెట్టింది రేఖ

సునందాదేవికి సహనం నశించింది.

"రేఖా! నేవిలా అల్లరిచేస్తే కాళ్లూ చేతులూ కట్టి గదిలో పడేస్తాను. ఆ శిక్ష కావాలనుకుంటే ఇలా శోకాలుపెట్టి అల్లరిచెయ్యి. అక్కడి నుంచి వెళ్లిపోయింది సునందాదేవి.

ఆరోజంతా అన్నం నీళ్లూ ముట్టలేదు రేఖ.

సాయంకాలం సునందాదేవి దేవాలయానికి వెళ్లినా అలాగే గదిగోడ కానుకుని కూర్చుంది.

అయిదు - అయిదున్నర - ఆరుగంటలు కూడా కావచ్చింది.

హాలులో పైకివెళ్లే తలుపు తెరుచుకున్నది. గిరిబాబు తలుపు పట్టుకుని నిలబడి 'రేఖా! రేఖా!' పిలుస్తున్నాడు.

మూడో పిలుపుకు రేఖ కదిలి బయటికి వచ్చి చూసింది.

"అరే! ఏమిటలా వున్నావు? కళ్లు తుడుచుకుని పైకిరా! ఆమె కదలటం చూసి మెట్లు ఎక్కాడు. రేఖ అతడి వెనక ఒక్కొక్కమెట్టే కళ్లు తుడుచుకుంటూ ఎక్కింది.

బల్లకు చెరొకవైపుగా ఇద్దరూ చిన్నచిన్న కుర్చీలలో కూర్చున్నారు. మేడమీద ఉన్న ఫర్నిచరంతా చిన్నపిల్లలకని ప్రత్యేకంగా చేయించినట్టుంది.

"రేఖా! నీబాధలూ నాబాధలూ ఒకరితో ఒకరం చెప్పుకోవటం అయిపోయింది. కొంతవరకూ మనసులు తేలికపడ్డాయి. ఇంక వాటిని మరచిపోవడానికి ప్రయత్నిద్దాము. నీవు ఏమేమి పుస్తకాలు చదివావు? నీకాలేజి పుస్తకాలేనా ఇంకా ఇతర పుస్తకాలేవయినా చదివావా?" తెచ్చుకున్న ఉత్సాహంతో అడిగాడు.

తను చదివిన పుస్తకాల పేర్లన్నీ చెప్పింది రేఖ.

"ఇన్ని పుస్తకాలు ఎక్కడ చదివావు? కాలేజి లైబ్రరీలోనా?" అతడిలో కుతూహలం హెచ్చింది

"ఎక్కడోకాదు. మీయింట్లో ఉన్న లైబ్రరీలో నుంచి తీసుకుని చదివాను. చదవటమయితే చదివాను. ఎంతవరకూ బుర్రలోకి ఎక్కాయో తెలియదు. కాలక్షేపానికని మొదలుపెట్టాను. తరువాత ఆసక్తీ కుతూహలమూ పెరిగాయి." అన్నది.

"నా లైబ్రరీ చూడు!" హాలులో పక్కగా ఉన్న గదిలోకి తీసుకు వెళ్ళాడు రేఖను. అదొక విశాలమయిన పెద్దగది. దానికి నాలుగు పక్కలా మూడడుగుల ఎత్తు బీరువాలు. వాటినిండా పుస్తకాలు. అక్కడక్కడ కూర్చోటానికి చిన్న చిన్న కుర్చీలు. రేఖ గదినాలుగు మూలలా చూసి మధ్యలో నిలబడి పోయింది.

"ఇలా నిలబడి పోయావేం? ఈ గదికూడా నా వికృతస్వరూపానికి ప్రతిగా ఉందా?" అన్నాడు బాధగా

రేఖకు ఆ క్రిందటి రోజుకంటె కాస్త ధైర్యం హెచ్చింది.

"అన్నీ మరిచిపోదామని ఇప్పుడే అన్నారు. మళ్ళీ మీరే ఆమాట ఎత్తుతున్నారు" అన్నది మెల్లగా మందలించే ధోరణిలో.

"పొరబాటయింది మేడమ్ పొరబాటు" నవ్వుతూ చెంపలు వేసుకున్నాడు గిరిబాబు.

చెక్కిట చెయ్యి చేర్చుకుని కళ్లు పెద్దవి చేసుకుని వింటున్నది రేఖ.

ఏదో జ్ఞాపకం వచ్చినవాడిలా చివ్వున లేచాడు గిరిబాబు. బీరువాలోని కెమెరా తెచ్చి క్లిక్ మనిపించాడు.

"అదేమిటి?" అదిరిపడి లేచింది రేఖ.

"అదేమిటో వారం రోజుల తరువాత చూపిస్తా" నవ్వుతూ కెమేరాను యథాస్థానంలో పెట్టి వచ్చాడు.

"ఇలా తియ్యతియ్యగా కబుర్లు చెప్పుకుంటూ మన తెలుగు భాషలో మాట్లాడుకుంటూ ఉండచ్చు- నీవు పగలంతా పైననే ఉండకూడదూ ? నీవు వస్తే ఆ జోసఫిన్ రాకపోయినా ఫరవాలేదు నాకు ఇలా కబుర్లు చెప్పుకుంటుంటే రోజులు నిమిషాల్లా గడిచిపోతాయి. ఏమంటావు ?"

నవ్వింది రేఖ ఆమాటలకు. ఆమె నవ్వుతుంటే పలువరుస తళుక్కుమన్నది.

జోసఫిన్ ఎక్కడ ? తనుఎక్కడ ? మహా అయితే మరో అయిదారు రోజులుంటుంది అక్కడ ఆమె. ఆమె చేసినట్టు గిరిబాబుకు తానేమి చెయ్యగలదు ?

ఇద్దరూ ఏవేవో కబుర్లు చెప్పుకున్నారు. దేహాలు ఊగిపోయేటట్టు నవ్వుతున్నారు.

ఆ మరునాడు సునందాదేవికి జోసఫిన్ దగ్గర నుండి ఉత్తరం వచ్చింది; తల్లికి వ్యాధి చాలా తీవ్రంగా ఉన్నదని తాను రావటానికి కనీసం ఒకనెలయినా పట్టవచ్చనీ రాసింది.

పుట్టినప్పటినుంచీ చూస్తున్నాడు కనుక వృద్ధుడయినా నర్శిమ్మునే గిరిబాబు పనులకు నియమించింది సునందాదేవి.

ఆమె దేవాలయానికి వెళ్లగానే తలుపు తెరుచుకొని రేఖ పైకి వెళ్లుతున్నది గిరిబాబు దగ్గర క్రమంగా చనువు ఏర్పడుతోంది. స్నేహంతో తలఎత్తి నవ్వుతూ మాట్లాడం ప్రారంభించింది.

సునందాదేవి ఎప్పుడు బైటికి వెళ్లుతుందా అని రేఖ ఎదురు చూస్తూ ఉంటుంది. పాపం, గిరిబాబు ఒంటరిగా ఏంచేస్తున్నాడో ? అట్లా ఉన్నాడు

గాని - అతడెన్ని పుస్తకాలు చదివాడో ? ఎన్ని చిత్రాలు వేశాడో ? గోడలకు ఉన్న చిత్రాలన్నీ అతడు వేసినవేనని చెప్పాడు.

ఒక బీరువానిండా నోట్సు కట్టలు కట్టి ఉన్నాయి. అవి అతడు చదివిన ప్రతిపుస్తకాలకు రాసిన నోట్సులు. గబగబా దైపుచేసి వాటిమీద పేర్లురాసి కట్టలు కట్టి పెట్టాడు. కొందరు పుస్తకాలు కాలక్షేపానికి చదువుతారు. కొందరు విజ్ఞానం కోసం చదువుతారు. అతడి లైబ్రరీ అంతా కాలక్షేపం కోసం కానట్టుంది వాటిపేర్లు చదివిన తనకెంతో ఆశ్చర్యం కలిగింది.

ఎన్నో విషయాలను తెలుసుకున్న విజ్ఞానవంతుడికీ శాపమేమిటి ? ఆ ఒక్కరూపం తప్ప అతడి హృదయం వింత విశాలమైంది ?

సృష్టిచిత్రాలలో ఇదొకటి కాబోలు ? బరువుగా నిట్టూరుస్తుంది రేఖ.

కాని, రాత్రిళ్ళు మాత్రం సునందాదేవి మాటలు జ్ఞాపకం వచ్చి కన్నీరు కార్చటం మానలేదు. తను రాసిన ఉత్తరాలకు తల్లి జవాబు రాయటం లేదు. ఎందుకని ? ఆమెకు కూడ తను బరువై పోయిందా ?

తనిప్పుడు ఖైదీ. చావటానికి కూడా స్వాతంత్ర్యము లేదు. రేఖ మనసు గిలగిలా కొట్టుకుంటున్నది.

* * *

రేఖ కోసిచ్చిన పళ్లు రెండు పళ్లేలలో సర్ది, ఒక ప్లేటు ఆమె ముందుకు నెట్టి "ఇంతకూ పెళ్లికొడుకును చూపించిందా మా అమ్మ ?" అడిగాడు గిరిబాబు.

"వస్తాడట రేపు పెళ్లనగా, నాకేదో భయంగా ఉంది. అయినా నన్ను మా అమ్మ దగ్గరికి పంపించేస్తే గొడవ వదిలి పోయేదానికి, నాకు పెళ్లిచేయాలన్న పంతమేమిటో అర్థం కావటం లేదు. ఆ పెళ్ళికొడుకు

ఎవరో ఎట్లా ఉంటాడో తెలియదు. కాని పెళ్లి పనులు మాత్రం జోరుగా జరుగుతున్నాయి డబ్బుగల వాళ్ళకు అసాధ్యమనేది ఏముంది?"

"నిజంగా అమ్మ ఇంత కఠినంగా ప్రవర్తిస్తోందా?" గొణుక్కున్నాడు గిరిబాబు.

చివ్వున తలెత్తి చూసింది రేఖ. "గిరిబాబూ! మానవ స్వభావం చాలా విచిత్రమైందని మీ యింట్లో ఉన్న పుస్తకాలల్లోనే చదివాను. అది ఎప్పుడు ఎలా ఉంటుందో సూచనప్రాయంగా తప్ప నిర్ధారణగా ఎవరూ చెప్పలేరట. ఒక మంచి మనిషి ఎల్లవేళలా మంచిగా ఉండలేకపోవచ్చు. కొందరితోనే మంచిగా ఉండవచ్చు కాకపోతే అందరితోను మంచిగా ఉన్న సునందాదేవిగారు నా విషయంలో ఇప్పుడు ఈ విధంగా ప్రవర్తించటానికి కారణం ఏమిటి? అది కేవలం నా దురదృష్టమనుకొంటాను" ఉద్రేకంతో అనేసింది రేఖ కాని, మరునిముషంలోనే లేచి నిలబడి "నాది చాలా తెలివి తక్కువ ప్రవర్తన. నన్ను కర్కశంగా చూస్తున్న సునందాదేవిగారు మీఅమ్మగారని మరిచిపోయి ఆమెను మీ ఎదటనే నిందించాను. విమర్శించాను. ఏదో ఆవేశంలో నోరుజారాను. క్షమించాలి" రెండు చేతులూ జోడించింది.

"ఇందులో నీ తప్పేమీ లేదు రేఖా! నీవొక బాధితురాలివి. కష్టాలు పడుతున్నదానవు. ఉపకారం పేరుతో అపకారాన్ని చవిచూస్తున్న దానవు. నీ అనుభవం కొద్దీ విమర్శించావు. తప్పులేదు. అయినా అమ్మ ఎప్పుడూ ఇలా ప్రవర్తించగా నేను చూడలేదు. వినలేదు. అవునులే. నేను ఈమేడమీద ఖైదు చేయబడిన వాడిని. నాకేం తెలుస్తాయి అన్ని సంగతులు? నాతో మాట్లాడేదెవరు? చెప్పేదెవరు?"

ఇంత బాధ ఉన్నదా ఇతడి గుండెలో? రేఖ తలెత్తి చూసింది. అతడు కిటికీ గుండా దూరానికి తన చూపులను పోనిస్తున్నాడు. తల

తిప్పటంలో అతడు కంటికి పెట్టుకున్న జోడు తళుక్కున మెరిసింది. అతడి నొక్కుల క్రాపులో నుంచి వెంట్రుకల కుచ్చొకటి ఎదురు తిరిగి గాలికి కదులుతూ ముఖమ్మీదకి పడుతున్నది.

ఏదో తటాలున జ్ఞాపకం వచ్చినట్టు గిరిబాబు వెనక్కి తిరిగి బీరువా తెరిచి ఒక కవరు రేఖ చేతిలో పెడుతూ "ఇదేమిటో చెప్పుకో చూద్దాం" అన్నాడు.

ఆమె కవరులో నుంచి ఒక చిన్న ఫోటో తీసి తిప్పి తిప్పి చూసింది. తన ఫోటో అది! దాని వెనక "ఏమాలోచిస్తున్నావు?- గిరిబాబు" అని రాసి ఉంది.

"ఇది ఆరోజు నేను తీసిన ఫోటో. బాగా వచ్చిందా? నీకు నచ్చిందా?" జవాబుకోసం ఎదురు చూస్తున్నాడు.

"బాగాలేకేం? దీనిలో కూడా మీనైపుణ్యం అమోఘంగా ఉంది"

"అబ్బ! ఎప్పుడూ ఒకటే పొగడ్తలా? మామూలుగా సరదాగా మాట్లాడు" అన్నాడు.

"ఏం మాట్లాడను?" క్రీగంటితో అతడిని చూసింది.

"కాలేజి కబుర్లు, నీ స్నేహితుల కబుర్లు అందరూ సాయంత్రపు వేళలో ఏంచేస్తూ ఉండేవారు? అటువంటి కబుర్లు చెప్పాలి. నేనయితేనా? నాకటువంటి అవకాశంలేదు గాని, ఉంటేనా నీకెంత కాలక్షేపం కలిగించే వాడినో? ఎన్ని కబుర్లు చెప్పి నవ్వించేవాడినో" అంతలో అతడి అసమర్థతకు ముఖం చిన్నబోయింది.

"గిరిబాబూ! మీరు నలుగురిలోకి వెళ్ళలేరని బాధపడుతున్నారు. నేను వెళ్ళగలిగి బాధపడుతున్నాను. నన్ను చూడగానే నా స్నేహితులు

కూడా గుసగుసలాడుకుంటారు. హేళనగా మాట్లాడుతారు. మనసారా స్నేహంగా మాట్లాడరు" తలవంచుకుంది.

"ఎందుకు?" విస్మయపడుతూ ప్రశ్నించాడు.

"ఎందుకని చెప్పను? నా పరిస్థితులు చూసి వాళ్ళకట్లా మాట్లాడాలనిపిస్తుంది"

"సరిసరి! మనిద్దరి పరిస్థితీ చెరొక విధంగా బాధాకరంగా ఉంది. ఏం చేద్దాం"

"ఏం చేద్దాం?"

ఇద్దరికి ఒక్కసారే నవ్వు లోపలి నుండి తన్నుకుంటూ వచ్చింది.

కురచ దేహంపైన పెట్టినట్టున్న పెద్దతల - ముఖం - ఆ ముఖంలో తేజస్సు లొలికే రెండు పెద్దకళ్లు అవి తెలివిగా చురుగ్గా చూడలేక పోతోంది రేఖ. కాని - వాటిలోతులను చూడాలన్న ఆసక్తి - కుతూహలం ఆమెను పురికొల్పుతున్నాయి.

ఇప్పుడిప్పుడు రేఖదృష్టి అతడి దేహంపైన ఉండటం లేదు. ఆ కురచమనిషికి కూడా ఒక హృదయమున్నట్టు తెలుసుకుంది. ఆహృదయం చాలా విశాలంగా ఉంది. ఆ మనసు చాలా సుకుమారంగా సున్నితంగా ఉంది రసార్ద్రంగా ఉన్నది.

గిరిబాబు సంఘజీవికాడు. ఏకైకజీవి. లలితకళలలో నిమగ్నుడై మనసును రంజింప చేసుకుంటాడు. తనతో తానే ఆనందిస్తాడు. నోరులేని గ్రంథాలతో కాలం గడుపుతున్నాడు అయినా అతడిలో ఎంతటి సభ్యత! ఎంతటి సంస్కారం! ఎంత పాండిత్యం?

హృదయ సౌందర్యమంటే ఇదేనా?

ఎందుకో ఆమె మనసు పులకించింది. అవ్యక్తమైన భావమేదో నిలువెల్లా ప్రసరించింది. తనమనసు తనదగ్గరే ఉన్నదా అనిపిస్తోంది.

తన్మయురాలయి ఆలోచనల వెంట పరుగులు తీసిన ఆమె మనసు అతడి ముఖం చూడగానే చిన్నబోయింది

అతడి మనసులో ఏదో వ్యథ - తీరని వ్యథ.

అంతలోకి ఆమెకు తానున్నది మేడమీదనని చట్టున జ్ఞాపకం వచ్చింది.

"నేనిట్లా పైకి వస్తున్నట్టు సునందాదేవి గారికి తెలిస్తే ఆమెకు కోపం రావచ్చు అసలే నామీద ఆగ్రహించి ఉన్న ఆమెకు మరింత కోపం తెప్పించటం మంచిది కాదు. నేను వెళ్తాను" లేచి ది రేఖ.

ఆరోజు గిరిబాబు ముఖం చాలా చిన్నబోయి ఉంది. ఆమె అక్కడ ఉన్నంత సేపూ ఏదో ఆలోచనలలో మునిగి ఉన్నట్టు కనబడ్డాడు. బాధ పడుతున్న అతడిని చూసి రేఖ మనసు కూడా ఆహ్లాదంగా లేదు. రేఖ బరువుగా నిట్టూర్చి దిగలేక దిగలేక మెట్లుదిగి వచ్చి తలుపులు వేసింది.

దేవిడీ కంతకూ బూజులు దులిపి రంగులు వేస్తున్నారు. తోటంతా బాగుచేశారు. చెట్లకుండీలకు జాజురంగు పూస్తున్నారు తలుపులకూ ద్వార బంధాలకూ కొత్తరంగులు వేస్తున్నారు. గడపలకు పసుపూ కుంకుమలు పెడుతున్నారు. ఆ దేవిడీ కొంత కాలంగా ఎరగని కొత్త అందాలను సంతరించుకొని నూతన రూపం దాలుస్తున్నది. శుభకార్యం జరపబోతున్న దానిలా కళకళలాడుతూ తలపైకెత్తి నట్టుంది.

మరునాడు ఉదయపు వేళ మామిడాకు తోరణాలు కడతారు.

ఉదయం పదిగంటల వేళ - రేఖను పెళ్లికూతుర్ని చేస్తారు.

పురోహితుడితో అతడు చేయవలసిన పనులు పురమాయిస్తోంది సునందాదేవి. పూజగదికి ఎదురుగుండా ఉన్న విశాలమయిన హాలులో కొబ్బరి ఆకులతో వివాహ మండపం కట్టిస్తోంది.

అటకల మీదినుంచి పాత్రసామగ్రి దింపించి తెల్లగా తోమించిన వాటిని వంట మనుష్యులు వంటపందిట్లోకి చేరవేస్తున్నారు. బియ్యం పప్పూ ఉప్పూ ఉగ్రాణం గదిలోనుంచి తీసి కొలుస్తున్నారు.

సునందాదేవి దేవిడీలో జరుగుతున్న పనులన్నీ పర్యవేక్షిస్తూ అధికార పూర్వకంగా నౌకర్లను తొందర పెడుతున్నది.

ఆమె ఒక్కొక్క మాట ఒక్కొక్క శూలంగా పొడవటం మొదలు పెట్టింది రేఖను.

తనను బలి యివ్వటానికి అంతా సిద్ధంచేసింది సునందాదేవి అని తల్లడిల్లి పోతున్నది రేఖ.

ఈ పెళ్లి విషయంలో ఆమెకున్నది స్వార్థమా? లేక పట్టుదలా?

ఏది ఏమయినా పెళ్లికొడుకును ముందుగా ఎందుకు చూపించదు?

ఒకవేళ - అతడు ఏ గుడ్డివాడో - ఏ కుష్టురోగో అయితే?

వెంటనే తను బావిలో దూకి ప్రాణత్యాగం చేయాలన్న దృఢసంకల్పంతో ఉంది రేఖ.

తటాలున రేఖకో విషయం స్ఫురించింది. తల్లికి తాను వ్రాసిన ఉత్తరాలు నిజంగా చేరలేదేమో! అవి పోస్టులో పడకుండా ఎవరయినా జాగ్రత్త తీసుకుంటున్నారేమో? ఎంత తియ్యగా మాట్లాడినా యాదమ్మ కూడా సునందాదేవిగారి ఉప్పుతినే నౌకరే కదా?

రేఖ నిస్సహాయురాలిలా మంచమ్మీద వాలిపోయింది. ఆమెకు ఎంత దుఃఖము వస్తున్నదో అంతగా కోపం కూడా వస్తున్నది ఒకరిమీద

ఆధారపడిన పేదల బ్రతుకులు ఇంతేలే అనుకుని కళ్లు ఒత్తుకుంటోంది మధ్యమధ్య.

*　　　　*　　　　*

దుమ్ము పట్టిన కాళ్లతో రేగిన తలవెంట్రుకలతో ఎర్రబడ్డ కళ్లతో గేటు తలుపులు నెట్టుకుంటూ పరుగు వంటినడకతో గదిలోకి వచ్చిన మాణిక్యం కూతుర్ని కౌగలించుకుని బావురుమని ఏడ్చింది.

"అమ్మా ! వచ్చేశావా ? నేను ఎన్ని ఉత్తరాలు రాశాను నీకు ? ఒక్కదానికయినా జవాబివ్వలేదు నీవు ! మనం ఇక్కణ్ణించి వెళ్లిపోదా మమ్మా, ఇంక ఒక్కక్షణమయినా ఉండొద్దు. ఈ దేవిడీ ఒక కత్తుల బోనులా ఉంది. పోదాం పద" తల్లిని తొందర చేసింది రేఖ.

కూతుర్ని మళ్లీ కౌగిట్లోకి తీసుకొని "ఈ ఆపదనెట్లా దాటగల మమ్మా" అంటూ బిగ్గరగా ఏడ్చింది మాణిక్యం.

"రేఖా !" గడపలో నిలబడి నిప్పులు గ్రక్కుతూ కేకబెట్టింది సునందాదేవి.

సునందాదేవి గారూ ! నేను తీసుకువెళ్లి పెళ్లి చేస్తానంటే వద్దన్నారు. ఇప్పుడు నా బిడ్డను ఎవరికి ఇచ్చి పెళ్లిచేస్తారో చెప్పకుండా గొంతుకోస్తారా ? మీకు చేతులెట్లా వస్తున్నాయి ? ధనవంతులయితే మాత్రం ఇంత దర్పమా ? ఎవరా పెళ్లికొడుకు ? ముందు నాకు చూపిస్తేనేగాని ఈ పెళ్లి జరగనివ్వను" అరుస్తు సునందాదేవి ఎదుటనిలబడ్డది మాణిక్యం.

"మాణిక్యం ! ఉద్రేకపడకు. నేను రేఖకోసం ఖర్చుచేసిన ప్రతి పైసా నాస్వార్థం కోసమే ననుకుంటున్నావు. నేనూ రేఖ సుఖమే కోరుతున్నాను. ఆమెనొక శ్రీమంతుల యింటి కోడలినిగా చేస్తున్నాను. నేను చేయదలచుకున్న పనిని ఇప్పుడెవరూ ఆపలేరు. నన్ను తిట్టినా శపించినా

అది జరిగి తీరుతుంది. తల్లివి కనుక పెళ్లి కంటితో చూస్తావని రమ్మని రాసాను. అంతే, ఆవేశం తగ్గించుకో. నీ కూతురికి ఏమీ అన్యాయం జరగటం లేదు. రేజను దీవించు."

"పెళ్లికొడుకును చూపించండమ్మా, చూపించి పెళ్లిచేయండి" నిలవదీసింది మాణిక్యం.

"నీకెందు కా పట్టుదల ముందు చూడాలని? నేను ఎవరిని తీసుకు వచ్చినా సరే, నేను తీసుకు వచ్చినవాడే పెళ్ళికొడుకు తెలిసిందా? వాడెటువంటివాడయినా పెళ్లి జరిగి తీరుతుంది" సునందాదేవిలో పట్టుదల మరింతగా పెరిగింది.

పిడుగు మీద పడినట్లయింది మాణిక్యానికీ రేఖకూ. మాణిక్యానికి పిచ్చెక్కినట్టుగా ఉంది. "అమ్మా, ఇంతవరకు మీరు కామేశ్వరీదేవిగారి చెల్లెలని గౌరవించాను. నాబిడ్డను ఇంతకాలమూ పోషించి విద్య నేర్పించారని సవినయంగా మీ ఎదుట నిలబడ్డాను. నేను దిక్కులేని పేదరాలిని. మా జీవితాలతో ఆడుకోవటం న్యాయం కాదమ్మా. నా బిడ్డగొంతు కోసి నా కడుపులో చిచ్చు పెట్టకండమ్మా" మాణిక్యం గోడుగోడున ఏడుస్తూ సునందాదేవి చేతులు పట్టుకుని ఆమె పాదాలమీదికి జారింది.

"ఛీ నాపాదాలు వదలు. మీకెంత ఉపకారం చేసినా గ్రహించరు" కాళ్లు వెనక్కు తీసుకుని ప్రక్కకు జరిగింది సునందాదేవి. కోపంవల్ల కళ్ళూ ముఖమూ జేవురించాయి. పళ్ళు పటపట లాడించింది.

సునందాదేవి పట్టుదలను చూసి పెళ్ళికొడుకు ఏకుంటివాడో, గుడ్డివాడో ననుకుని తల బాదుకోవటం మొదలు పెట్టారు మాణిక్యం, రేఖ.

అంతలో హారన్ మ్రోగించుకుంటూ ఆ ప్రాంగణంలోకి దూసుకుంటూ కారు ఆగిన శబ్దం విని సునందాదేవి తలెత్తి చూసింది.

ఎవరిదీ కారు? మళ్ళీ ఎవరు వచ్చారు?

కళ్ళు చిట్లించుకుంటూ హాలులోకి వచ్చిన సునందాదేవికి కారు డ్రైవరూ నర్సిమ్లూ పట్టుకుని ఎవరినో లోపలికి తీసుకురావటమూ వాళ్ళ వెనుక కామేశ్వరీదేవి కొడుకు సురేష్ మెట్లు ఎక్కి లోపల అడుగు పెట్టటమూ కనబడ్డాయి.

నర్సిమ్లు ఆయనను సోఫాలో పడుకోబెట్టాడు. డ్రైవరు ఒంటి మీద బట్టలు సరిచేశాడు.

"ఆంటీ! అమ్మ కాళ్లనొప్పులతో బాధపడుతోంది. తను రాలేక పోయింది. నేను మొన్ననే వచ్చాను. వెళ్లమని నన్ను బ్రతిమిలాడింది. నేను కారులో వస్తుంటే ఈ ఊరి పొలిమేరల్లో ఈ మనిషి పడి ఉన్నాడు. ఒంటిమీద స్పృహ లేదు. నాడి కొట్టుకుంటోంది. నేను డ్రైవరూ లేవదీసి వెనుక సీట్లో పడుకోబెట్టుకుని తీసుకు వచ్చాము. డాక్టర్ని పిలిపించు. ఆంటీ. పాపమెవరో గాని ఒళ్లు తెలియకుండా పడి ఉన్నాడు" సురేష్ జేబురుమాలతో ముఖమంతా అద్దుకుంటూ చెప్పాడు.

"మొదటి నుంచీ నీవంతా ఉరుకు పరుగుల పనులు నర్సిమ్లూ రహమాన్ వచ్చాడో లేడో చూడు. వస్తే డాక్టర్ని తీసుకు రమ్మని చెప్పు. అయినా - సురేష్! దారిలోనే హాస్పిటల్ ఉన్నది కదా. అక్కడే చేర్పించి రాకపోయావా? ఇంట్లో శుభకార్యం జరగబోతుంటే ఇటువంటి వాళ్లనా ఇంటికి తీసుకువచ్చేది?" రుసరుసలాడుతూ అతడికి కాఫీ టిఫిన్ ఏర్పాట్లు కోసం లోపలికి వెళ్లింది సునందాదేవి.

కాఫీ కప్పు అందుకుంటూ "ఆమాట తోచలేదు ఆంటీ, పోనీలే - పాపం. డాక్టరికి చూపించి మందిప్పించు. అంతగా అవసరమనుకుంటే

అప్పుడే చేరిద్దాం అంటీ! ఇంతకూ పెళ్లెప్పుడు? పెళ్లికొడుకెవరు? అమ్మకేమిటో - ఈ పెళ్లి అంతగా ఇష్టం ఉన్నట్టులేదు!".

"సురేష్! ఎవరికో ఇష్టం లేదని నేను చేయదలచుకున్న పని అపుతాననుకున్నావా? ఆ పెళ్లికొడుకును పీటల మీదనే చూడండి అందరూ!——" ఆమె మాట పూర్తి చెయ్యకముందే కారుదిగి డాక్టరు లోపలికి వచ్చాడు.

సురేష్ దిగ్గున లేచి డాక్టర్ని సోఫా దగ్గరికి తీసుకువెళ్లి చూడమని చేతిసైగ చేశాడు.

బాగా పరీక్షచేసిన డాక్టరు తనపెట్టె తెరచి ఒక ఇంజక్షను ఇచ్చాడు.

"ఏమయింది డాక్టరుగారూ! కారు చాలా స్పీడుతో వస్తున్నది. ఆడొంకల్లో ఈయన పడిఉంటే తీసుకు వచ్చాము. నేను మొదట కారు తగిలి పడిపోయాడేమో ననుకొని భయపడ్డాను. డ్రైవరు కాదన్నాడు. గాయాలేమయినా ఉన్నాయా?" సురేష్ ఆందోళన పడుతున్నాడు.

"అటువంటిదేమీ లేదు. శోషవచ్చి పడిపోయి ఉంటాడు. వేడివేడి కాఫీగాని - పాలుగాని ఇవ్వండి. కొంత సేపటికి తేరుకుంటాడు" అంటూ పెట్టె సర్దుకున్నాడు.

గంట సేపటికి తెప్పరించుకుని మెల్లగా కళ్లు తెరిచాడాయన. చుట్టూ ఉన్న వాళ్లనందరినీ ఒక్కసారి కలయజూశాడు ఒక్క కంటితో.

ఎదురుగా నిలబడి ఆయననే పరకాయించి చూస్తున్న నర్సిమ్ములు "దొరా! దొరా! ఎక్కడినుంచి వస్తున్నారు? ఎక్కడపడి పోయారు?" సంభ్రమంతో చేతులు నులుపుకుంటూ దగ్గరగా వచ్చాడు.

కొద్ది దూరంలో సోఫామీద కూర్చున్న సునందాదేవి దిగ్గున లేచి ముఖంలో ముఖం పెట్టి చూసింది.

ఆమెను చూడగానే మందహాసరేఖ ఒకటి ఆయన పెదవులమీద నాట్యం చేసింది.

షాక్ తగిలినట్టుగా సునందాదేవి వెనక్కి అడుగులు వేసుకుంటూ వెళ్ళి సోఫాలో కూలబడి పోయింది.

విస్మయంతో చూస్తున్నాడు సురేష్‌బాబు.

గోపాలకృష్ణరాయడు తిరిగి వచ్చాడనీ, దారిలో పడిపోతే సురేష్ బాబు కారులో తీసుకు వచ్చాడన్న వార్త క్షణంలో ఆ దేవిడీ అంతా పాకి పోయింది. నౌకర్లందరూ ఒక్కొక్కరే వచ్చి ఆయనకు దణ్ణాలు పెట్టి పోతున్నారు.

ఏడ్చిఏడ్చి కళ్లు తుడుచుకుని యాదమ్మ చెప్పిన వార్త నిజమవునా కాదా అనుకుంటూ గదిలోనుంచి బయటికి వచ్చి చూశారు మాణిక్యం; రేఖ.

మాణిక్యానికి ఆయనను చూడగానే ఆశారేఖ ఒకటి గోచరించింది. గోపాలకృష్ణరాయడికి తనగోడు వినిపిస్తే కొంత లాభం ఉండకపోదు. ఆయన ఇంత దారుణానికి ఒడిగట్టడన్న ధైర్యం ఆమెకు కలిగింది. కాని ఆయనింకా తేరుకున్నట్టు లేరని గోడకానుకుని నిలబడ్డది. మధ్యాహ్నం ఒంటిగంట దాటింది, అందరూ పేరుకు భోజనాలు చేశామనిపించారు.

నర్సిమ్లు గోపాలకృష్ణరాయడికి దగ్గరగా క్రింద కూర్చుని ఆలోచనలో పడ్డాడు. దాదాపు పాతిక సంవత్సరాలు కావచ్చింది - ఆయన గృహత్యాగం చేసి. ఆయన ముఖమీద వృద్ధాప్యం బాగా కనుపిస్తోంది. ఎట్లావెళ్లాడో అలాగే అకస్మాత్తుగా వచ్చాడు. దొరసాని తలపెట్టిన పనులు

ఎట్లా జరుగుతాయో చూడాలి. ఇద్దరి మధ్య పరిస్థితులు ఎలా ఉంటాయో నని ఊహిస్తున్నాడు.

దొర ఉండటానికి వచ్చాడా? లేక పెళ్ళిసంగతి వినివచ్చాడా?

నర్సిమ్ముకిదంతా అయోమయంగా ఉంది. ఊహలకందని పరిస్థితి.

సాయంకాలం ఐదుగంటలకు డాక్టరు వచ్చేసరికి గోపాలకృష్ణ రాయడు మెల్లగా లేచి కూర్చున్నాడు. స్నానం చేయించి నర్సిమ్ము తొడి గించిన ఇస్త్రీ బట్టలతో - చక్కగా దువ్వుకున్న తలవెంట్రుకలతో కళ్ల జోడు ధరించి ఠీవిగా కనబడుతున్నాడు.

నౌకర్ల ద్వారా తెలుసుకున్న డాక్టరు సవినయంగా ఆయనకు చేతులు జోడించి "ఎలా ఉంది మీకు? పొద్దున చాలా నీరసంగా కనుపిం చారు గ్లూకోసు వేసిన పళ్లరసం తీసుకోండి. సెలవు" వెళ్లిపోయాడు ఆశ్చర్యాన్ని అణచుకుని, గోపాలకృష్ణరాయడు! ఎప్పటిమాట!

శ్రావణమేఘాలు గర్జించి కుండపోతగా వర్షించటం మొదలు పెట్టాయి. దేవిడీలో నిస్తబ్ధత ఆవరించుకుంది.

తగ్గినట్టు తగ్గి తిరిగి సంధ్యవేళకు ఉరుములతో పెళపెళ్లాడుతూ వచ్చింది వర్షం. గంటలో ఆఊరినంతా కడిగి వేసింది మరికాసేపటికి తెరి పిచ్చింది. జనం నీటి మడుగుల గుండా తిరుగుతున్నారు.

గోపాలకృష్ణరాయడు లేచి కూర్చోగానే మాణిక్యం ఆయన కెదు రుగా వచ్చి చేతులు జోడిస్తూ "బాబూ! ముకుందం బాబూ! మీరెలా వచ్చారు? దారిలో పడిపోయారని అంతా అంటున్నారు. ఎలా పడ్డారు? మీరేనా ఈయింటి యజమాని? నా గోడంతా రైల్లో విన్నారు కదా! బాబూ!" పాదాలను తాకి కళ్లకద్దుకున్నది.

ఆయన చిరునవ్వుతో సమాధానమిచ్చాడు. తలపంకిస్తూ సునందాదేవి వంక చూశాడు. ఆమె చేష్టలుడిగి చిత్తరువులోని బొమ్మలా మధ్యాహ్నం నుండీ కూర్చున్నది కూర్చున్నట్టే ఉంది. గ్లాసెడు మంచినీళ్లయినా తీసుకోలేదు.

ఆయన అంతా గ్రహించినట్టే పెద్దగా నవ్వాడు.

"అయితే నీకో కొడుకు పుట్టి పెళ్ళికి ఎదిగాడన్న మాట !" సునందాదేవి నుద్దేశించి ఆమెవెపు చూస్తూ అన్నాడు.

సునందాదేవి తలెత్తి ఒకసారి ఆయన వంక చూసి తల దించుకుంది మళ్ళీ.

"ఈ యింటికీ ఈ ఆస్తికీ వాడేనన్న మాట వారసుడు!"

హాలంతా నిశ్శబ్దంగా ఉంది. ఎవరినోటివెంటా ఒక్క మాటయినా రావటంలేదు.

"ధనం దుర్వ్యయమయినా ఈ వంశీయుల రక్తానికే వారసత్వము లభిస్తుంది"

ఆయన మాటలు సంధించి విడిచిన బాణాల్లా ఆమె హృదయాన్ని తూట్లు చేస్తున్నాయి.

"ఏం మాణిక్యమ్మా ? డబ్బు కాసించి నీకూతుర్ని ఈమె కోడలిగా చేస్తున్నావా ? నేను ఉన్నంత వరకూ మీ ఆటువంటివాళ్ల ఆటలు సాగవని తెలుసుకో !"

"ఏం రేఖా! ఐశ్వర్యాన్ని చూసే కదూ ఈపెళ్ళికి అంగీకరించావు !"

"ఛీఛీ ! డబ్బు చూడగానే విచక్షణా జ్ఞానం ఎంత నశించిందీ మీ అందరిలో !"

"నాపీడ విరగడయిందనుకుని అందరూ తలా ఒక కుట్ర పన్నారన్న మాట !"

"నాదేవిడీలో నుంచి తక్షణం మీరంతా వెళ్లిపోండి."

ఆయన ముఖం చాలా గంభీరంగా ఉంది. తాము నిరపరాధులమని చెప్పుకోవటానికి కూడా ఎవరికీ ఆయన వ్యవధి ఇవ్వటంలేదు. మాణిక్యం రేఖ చేతులు నులుపుకుంటూ గోడకు అంటుకు పోయారు.

సునందాదేవి వెక్కి వెక్కి ఏడుస్తున్నది.

అప్పటి నుండీ చివరిమెట్టు మీదనుండి ఈ మాటలన్నీ ఆలకిస్తున్న గిరిబాబు దూసుకుంటూ వచ్చాడు వాళ్ల మధ్యకు.

అందరూ అతడిని చూసి చకితులయ్యారు.

"గోపాలకృష్ణరాయడుగారూ ! ఇంతకాలం నుంచీ నాకు తెలియని విషయాలను మీమాటలవల్ల గ్రహించాను. ఇప్పుడు నా నిజపరిస్థితులేమిటో తెలుసుకున్నాను. నాకు దురాశలేదు. కాని - నాకు తెలియకుండానే మీధనం చాలా నా క్రింద వ్యయమయింది. నా సంగతి నాకు ఇంత విపులంగా తెలిసిన తరువాత నేనొక్క క్షణమయినా ఈ యింట్లో ఉండదలచలేదు."

గిరిబాబు సునందాదేవిని సమీపించి "అమ్మా ! కడుపు తీపికొద్దీ దురాశపడినట్లున్నారు. నాపట్ల చూపిన వాత్సల్యానికి చాలా ఋణపడి ఉన్నాను. కాని - ఈ యింట మరి ఉండలేను. నా పుట్టుక ఒక ప్రశ్నకు తావిచ్చింది. నా రూపం మీకు అవమానకరమైంది. నా ఉనికి మీకు నరక ప్రాయం. ఇదంతా ఒక దుస్వప్నమనుకోండి. సెలవు" ఉద్రేకరహితంగా

అన్న అతడి మాటలు అందరి హృదయాలలో సూటిగా ప్రవేశించి కలచి వేశాయి.

గిరిబాబు అందరికీ చేతులు జోడించి నమస్కరించాడు. గోపాలకృష్ణరాయడికీ సునందాదేవికీ పాదాభివందనం చేశాడు. కాళ్ళకున్న చెప్పులు హాల్లోదిగవిడిచి, ఒంటినున్న షర్టుతీసి కుర్చీలోపడేసి మామూలు పైజామా బనియన్‌తో చరచరా హాలు దాటుతూ మళ్లీ ఏదో జ్ఞాపకం వచ్చినట్టు వెనక్కు వచ్చి "అమ్మా! ఇదిగో రవ్వల ఉంగరం. ఇది ఈ వంశీయులకు చెందాలి." అంటూ ఆమె ముందుంచి హాలుదాటి మెట్లుదిగి దేవిడీ ముందున్న తోటగుండా గేటుదాటాడు.

గోపాలకృష్ణరాయడు ఎదురుచూడని ఘట్టమిది. ఆయన ముఖం పాలిపోయింది, వెంటనే మరింత గంభీరమయింది.

సునందాదేవి కుళ్లి కుళ్లి ఏడుస్తున్నది.

దీని పర్యవసాన మేమిటోనని అందరూ ఎదురుచూస్తున్నారు.

రేఖ గుండె బీటలు వారినట్లయింది. ప్రియాతిప్రియమైన తన స్నేహితుడు - ఆప్తుడు - వ్యథతో చీకిపోయిన తన హృదయానికి పుష్టి కలిగించినవాడు - దిక్కుతోచక అల్లాడి పోతున్న తన మనసుకు ఊరట కలిగించినవాడు - దూరమైపోతున్నాడు. మనసు కరిగేటట్టుగా తనను గురించి చెప్పి, ఆ కరిగిన మనసును దోచుకున్నవాడు ఈ యింటి నుంచి వెళ్లిపోతున్నాడు. ఇక తను మాత్రం ఎందుకా యింట్లో?" ఆమెకు తన ప్రాణం తనదేహంలోనుంచి నడిచివెళ్లుతున్నట్లనిపించింది.

చటుక్కున గదిలోకి వెళ్ళి అలంకారాలన్నీ తీసివేసింది రేఖ. కట్టుకున్న చీరె విడిచి సామాన్యమైన చీరె చుట్టుకుంది. గబగబా హాలు దాటి - గేటుదాటి నూరుగజాలు అప్పుడే నడిచి వెళ్లుతున్న గిరిబాబు చెయ్యి పట్టుకుంది.

గిరిబాబు ఉలిక్కి పడి "ఇదేమిటి ? నీవు వచ్చేస్తున్నావు ? అన్నాడు ఆశ్చర్యంతో.

ఆమె నవ్వుతూ అతడి కళ్లల్లోకి చూసి తలవంచుకుంది.

ఇద్దరూ చేతులు పట్టుకుని వీధి తరువాత వీధి దాటుతున్నారు ఊసు లాడుకుంటూ,

* * *

"రేఖా ! రేఖా !" అన్న మాటలు మాణిక్యానికి తెలియకుండానే చిన్నగా ఆమె నోటవెంట వెలువడ్డాయి.

అందరి ముఖాలనూ పరీక్షగా చూసిన గోపాలకృష్ణరాయడు హాలు మారు[మ్రో]గేటట్టుగా నవ్వాడు.

ఈ నవ్వు మరింత ఆశ్చర్యాన్ని కలిగించింది అందరికీ.

ఆయన నవ్వులో విజయగర్వం వెల్లివిరిసింది.

"నర్సిమ్మూ ! కారు తీసుకువెళ్లి ఇప్పుడు వెళ్లిపోయిన అబ్బాయినీ అమ్మాయినీ తీసుకురా !" ఆజ్ఞాపించాడు.

"సునందా. నేను వెళ్లిపోగానే నీకు పీడ విరగడైనట్లనిపించి ఉంటుంది. ఇప్పుడు - ఇంతకాలానికి తిరిగి వచ్చిన నేను నీ పథకాల

నన్నిటినీ తల్లక్రిందులు చేసినట్టున్నాను. కాని - భయపడకు. నేనీయింట్లో ఉండబోవటం లేదు. రేపు సాయంత్రమే నా ప్రయాణం. అంతవరకూ నా ఉనికిని సహించగలవు కదూ ? ధైర్యం తెచ్చుకుని భోజనం చేసిరా - పగలంతా ఉపవాసం చేసినట్టున్నావు."

అది హాస్యమో ఎగతాళో - నిజమో తెలుసుకోలేని స్థితిలో ఉన్న సునందాదేవి ఎర్రబారిన కళ్లెత్తి చూసింది.

గోపాలకృష్ణరాయడికి గేటు దగ్గరెవరో తచ్చాడుతున్నట్టు కనబడ్డది. లోపలికి తీసుకురమ్మని నౌకర్ని పంపాడు.

బిడియపడుతూ లోపలికి వచ్చి నిలబడ్డాడతడు.

"ఇలావచ్చి కూర్చోండి. గేటు దగ్గరే నిలబడి పోయారేం ?"

అతడు చిరునవ్వుతో నాలుగు ప్రక్కలా కలయచూస్తున్నాడు.

"ఇక్కడెవరైనా మీకు తెలిసిన వాళ్లున్నారా ? అన్నట్టు నిన్నటి రైలులో మేము కూర్చున్న కంపార్టుమెంటులో మీరూ ఉన్నట్టున్నారు కదూ పైబర్తుమీద ?" గోపాలకృష్ణరాయడి నవ్వు మళ్లీ అందరి చెవులలో గింగురుమంది.

కబుర్లు చెప్పుకుంటూ తారురోడ్డుమీద చకచక నడుస్తున్నారు రేఖా గిరిబాబులు.

"ఇదేమిటి ? మనిద్దరికీ పెళ్లి తలపెట్టారా సునందాదేవిగారు ?" రేఖ విస్మయంతో అడిగింది.

"ఏమో ! నాకేం తెలుసు ?"

"పెళ్ళికొడుకు ఎవరు ఎవరు అని అమ్మా నేనూ ఎంతడిగినా చెప్పలేదు ఆమె పైగా బెదిరించారు"

"నాకు పెళ్లా ? నీతోనా ? అసంభవము !" బాధతో తలతిప్పాడు.

"ఏం ? మీకిష్టంలేదా ?" కనుబొమలు పైకెత్తి అడిగింది.

నా యిష్టమడుగుతావేం ? నీ యిష్టమడిగితే భంగపడతాననేగా మా అమ్మ బెదిరింపులతో లొంగతీసుకోవాలని చూసింది ? ఇకపోతే నా యిష్టమా ? జవాబు చెప్పటానికయినా నోరురావాలా ? సర్వాంగసుందరివి నీవెక్కడ ? మరుగుజ్జును నేనెక్కడ ?" బరువుగా నిట్టూర్చాడు.

"గిరిబాబూ ! మీరు మీ ఆకారాన్నే చూసుకుని ఖిన్నులవుతున్నారు. నేను మీ మనసును చూసి ఆనందిస్తున్నాను మళ్ళీ మనిద్దరికీ అభిప్రాయం భేదం వచ్చింది" కిలకిల నవ్వింది.

మనసులో కించగా ఉన్నా అతడికీ నవ్వొచ్చింది ఆమె నవ్వుతుంటే, దేహం జలదరించింది.

అంతలో కారు రయిమని వచ్చి వాళ్ళపక్కనే ఆగింది. దానిలో నుంచి నర్సిమ్లు దిగి "బాబుగారూ, దొరగారు తీసుకురమ్మన్నారు మీ యిద్దరిని"

గిరిబాబు, రేఖ ఒకరి ముఖాలొకరు చూసుకున్నారు. తప్పదన్నట్టుగా ఎక్కి కూర్చున్నారు.

"వధూవరులొచ్చారు. ఎర్రనీళ్లు దిగతుడిచి లోపలికి తీసుకురండి" అన్నాడు హాల్లో నిలబడ్డ వాళ్ళ నుద్దేశించి గోపాలకృష్ణరాయడు.

మాణిక్యం సునందాదేవి ముఖంలోకి చూసింది. ఆమె వంచిన తల ఎత్తలేదు. కాని మాణిక్యం దృష్టి గోపాలకృష్ణరాయడి పక్కన కూర్చున్న

ప్రయాణీకుణ్ణి చూసినప్పటి నుంచీ కలిగిన విస్మయాన్ని అణచుకోలేక పోతున్నది. అతడు కుంటుతూ నడుస్తున్నాడు. మూతి వంకరపోయింది. తలవెంట్రుకలన్నీ రాలిపోయి ఇంచుమించుగా బోడితలలా ఉందే కాని ముమ్మూర్తులా తన భర్త ప్రకాశరావులా ఉన్నాడు.

గోపాలకృష్ణరాయడు అడుగుతున్నాడు "ఏమిటండీ! ఈ జరుగుతున్న నాటకంలో మీకు కూడా సంబంధమున్నదా?" కూర్చున్న చోట నుండి లేవటానికి ప్రయత్నిస్తున్న మాణిక్యాన్ని చూస్తూ ప్రశ్నిస్తున్నాడు.

పీటలమీద కూర్చున్న వధూవరులను చూస్తూ తల తిప్పాడతడు జవాబుగా.

గిరిబాబు లేచి నిలబడి రేఖ తలమీద తలంబ్రాలు పోస్తుంటే సునందాదేవి కడుపులో దేవినట్లయివది. ఇండుప గింజలంత బాష్పాలు రాలకుండా కళ్ళలో నిలిచాయి.

ఆమెవంకే చూస్తున్న గోపాలకృష్ణరాయడు అవి ఆనంద బాష్పాలనుకున్నాడు.